
# బీదబ్రతుకు

యలమంచిలి
వెంకటప్పయ్య



గాంధీ సామ్యవాద పుస్తకమాల

# బీద బ్రతుకు

రచన:

**యలమంచిలి వెంకటప్పయ్య**

**యలమంచిలి వెంకటప్పయ్య**
**సంస్మరణ వేదిక ప్రచురణ**

# బీదబ్రతుకు

## యలమంచిలి వెంకటప్పయ్య స్వీయచరిత్ర

మొదటి ముద్రణ: జూన్, 1985
రెండవ ముద్రణ: 1, మార్చి, 2009
మూడవ ముద్రణ: మార్చి, 21, 2010
నాల్గవ ముద్రణ: జనవరి, 2012

వెల: రు. 25/-
ప్రతులు: 1000

యలమంచిలి వెంకటప్పయ్య
సంస్మరణ వేదిక ప్రచురణ సంఖ్య: 3

దొరుకు చోటు:

1. మైత్రీ బుక్ హౌస్
   జలీల్ వీధి
   కారల్ మార్క్స్ రోడ్, విజయవాడ-2
   సంచారవాణి: 98486 31604
2. విశాలాంధ్ర అన్ని శాఖలలోను.
3. ప్రజాశక్తి అన్ని శాఖలలోను.
4. మురళీధర్, యలమంచిలి
   403, అరుణ నివాస్, డాన్ బాస్కో స్కూలు ఎదురురోడ్డు
   గురునానక్ నగర్, విజయవాడ-520 007
   సంచారవాణి: 9440327500

# తఱుగని గుఱుతు

నాలో దేశప్రేమకు, ప్రజాసేవాభిలాషను కల్గించి, నాకు తగిన చేయూతనిచ్చి, నాలో పట్టుదలనుపెంచి, నన్నింత వానినిగా చేసిన కల్లా–కపటమెరుగని నా తల్లిదండ్రులు ఆదెమ్మ– అంకప్పగార్లకు తఱుగని, అఱగని గుఱుతుగా, ముఱికిలేని నిండు గుండెతో యీ చిట్టిపొత్తాన్ని కూర్చాను.

**– యలమంచిలి వెంకటప్పయ్య – 1985**

# ముందుమాట

ప్రతి పొత్తానికీ, ముందుమాట ఉండి తీరాలి. ఎందుకంటే పొత్తంలో రాయబడిన సంగతి దేనిని గుఱించి చెప్పబడ్డదో, అది క్లుప్తంగా (టూకీగా) మూడు మాటలలో ముందుమాటలో చెప్పాలి. అందువల్ల చదువరులు పొత్తములో రాయబడిన సంగతిని తేలికగా తెలుసుకోగలుగుతారు.

ఈ పొత్తంలో నా సొంత బ్రతుకులో జరిగిన కొన్ని నిజాలను తెలిపాను. అందువల్ల చదువరులు ఆనాటి మన సాంఘిక, ఆర్థిక, నైతిక, రాజకీయ మత పరిస్థితులకు ఈనాటి మన సాంఘిక, ఆర్థిక, నైతిక, రాజకీయ, మత పరిస్థితులకుగల తేడాను తేలికగా తెలుసుకోగలుగుతారని గుఱితోనే నేను యీ చిట్టి పొత్తాన్ని రాశాను. అంతేగాని నా సొంత బ్రతుకును లోకానికి తెలపాలనే చులకన కోరికతో మాత్రం రాయలేదని చదువరులకు మనవి చేస్తున్నాను.

అయితే ఆనాడు సంఘంలో జరిగిన సంఘటన లతోపాటు, నా సొంత రోజువారీ బ్రతుకును కూడా తప్పక రాయాల్సి వచ్చింది. అందులకు తెలివితేటలుగల చదువరులు నన్ను మన్నించినా సంబరమే, మందలించినా సంబరమే.

- యలమంచిలి వెంకటప్పయ్య - 1985

## మూడో ముద్రణకు-ముచ్చటగా మూడు మాటలు

కీర్తిశేషులు యలమంచిలి వెంకటప్పయ్యగారు సామాన్యులలో అసమాన్యులు. వారిది కడు బీదబ్రతుకైనా స్వయంకృషితో మహామేధావిగా, గొప్ప సంఘసంస్కర్తగా, రచయిత, హిందీ ఉపాధ్యాయునిగా, స్వాతంత్ర్యసమరయోధునిగా, నాస్తిక హేతువాదిగా, కార్మికుడిగా, కర్షకుడిగా, కష్టజీవియై దాదాపు నూరేండ్లు సంపూర్ణ జీవితాన్ని గడిపి చివరకు తన శరీరాన్ని, వైద్యవిద్యార్థులకు దానమిచ్చారు. తనకళ్ళను దానమిచ్చి యిద్దరికి చూపునిచ్చిన చిరంజీవి.

ఈ పుస్తకం చదువుతుంటే ఆనాటి సామాజిక జీవితం, రాజకీయ పోరాటాలు, బీదల బ్రతుకుపాట్లు, రైతుల యిక్కట్లు, కళ్ళకు కట్టినట్లుంటాయి. వీరి పుస్తకాలన్నీ నిరక్షరాస్యులు సైతం విని, అర్థం చేసుకోగలరు. ధర కూడా అత్యల్పం రూ2/- రూ3/-లే. అందుబాటులోనున్న ఆ 53 పుస్తకాల్ని ఒకే సంపుటిగా అచ్చొత్తించి నేటి తరానికీ, భావితరాలకు అందుబాటులో ఉండేలా ఓ వెబ్‌సైట్‌లో ప్రపంచ తెలుగు పాఠకులకు అందజేస్తే ఎంత బాగుంటుందో గదా!

**- యస్.హజరత్ అలి**
విశ్రాంత ప్రిన్సిపల్
9395365957

**1-3-2010**
**10-84,**
**వేమూరు-522 261.**

# ఒక పాఠకుని ప్రశంస

*మిత్రులు  యలమంచిలి మురళీధర్ గారికి నమస్సులు.*

నేను ఇంకొల్లు దగ్గర ఇడుపులపాడు అనే గ్రామంలో ఉంటున్నాను, బీరం సుందరరావుగారి ద్వారా మీ నాన్నగారు యలమంచిలి వెంకటప్పయ్యగారి ఆత్మకథ–'బీదబ్రతుకు' అందింది. చదివాను. అది బీదబ్రతుకెలా అవుతుంది. వెలకట్టలేని బ్రతుకు.

నేను 1947లో పుట్టాను. 55 నుండి సమాజం ఎలా ఉందో తెలుసు. కరెంటులేని రోజులు తెలుసు, ఎక్కడైనా రేడియో పలుకుతుంటే ఎవరు మాట్లాడుతున్నారబ్బా అని దాని చుట్టూ చూచేవాణ్ణి. ఇక అంతకంటే ముందు సమాజం గురించి చెప్పుకుంటూంటే వినడమేగాని, మీ నాన్నగారి ఆత్మకథ చదువుతుంటే 1898 నుండి 1955 వరకు సమాజపు రూపురేఖలు కళ్ళకు కట్టినట్లు కనిపించాయి. చివరి పేజీలో అనాటి విద్యార్థి రేఖా చిత్రం చూస్తుంటే అప్పటి విద్యార్థులు ఇలా ఉండేవారా అనిపించింది. తోకలాగులతో, పలక బలపాలతో 6వ తరగతి వరకు చదివిన రోజులు జ్ఞాపకం వచ్చాయి. ఆ రోజులు మీకు జ్ఞాపకం ఉండేవుంటాయి.

నాన్నగారి కథలో ఎక్కడా అతిశయంలేదు. ఉన్నదున్నట్లు వ్రాసారు. చేయి తిరిగిన రచయితలలాగా ఆసక్తికరంగా చదివించారు. కరువు రోజుల్లో ఆమడకాయలు తిన్నాం అంటుంది మా అమ్మగారు. చరిత్ర చూస్తుంటే నిజమేననిపిస్తోంది. ఇక ఐదేళ్ళ బ్రాహ్మణబాలుడు ఇంటికొస్తే తొంభైయేళ్ళ కమ్మావిడ లేచి పలకరించి, కావలసింది ఇచ్చి పంపటం ఆ రోజుల్లోనే చూచాను. ఏమిటా వీళ్ళకింత చాదస్తం అనుకునేవాణ్ణి. కాని, బీదబ్రతుకు చదువుతుంటే వీళ్ళు మెదళ్ళకు బానిసత్వం నేర్పింది బ్రాహ్మలేననిపిస్తోంది.

మన ఊహలకందని, ఎవరో చెప్పిన ఆర్య అనార్యజాతుల గొడవ వదిలి పెట్టి, నాన్నగారు కళ్ళారా చూచి అనుభవించిన శతాబ్ద మానవ చరిత్ర చూస్తుంటే, మానవులు ఇంత అమాయకంగా బ్రతికారా అన్న ఆశ్చర్యం తప్పదు. బండకొయ్య తీర్పులు, మట్టి కుండల బ్రతుకులు, పుల్లనీళ్ల భోజనాలు, బెత్తెడు గోచీల బట్టలు, జొన్న సంకటి జూరుకోడాలు..

అన్నీ వింతలే, మా బోటివాళ్ళకు. నా చిన్నప్పుడు ఒక పూట జొన్న సంకటి ఉండేది మా యింట్లో. అంటే అవి చివరి రోజులన్నమాట. అలాగే... వానాకాలపు చదువులు ఏమిటా అనుకునేవాణ్ణి... ఇది చదివాక అర్ధమయింది. పంతుళ్ళు దసరా పండక్కి పిల్లలను వెంటబెట్టుకొని అడుక్కోడాలు మా చిన్నప్పుడూ ఉండేవి. సరదాగా ఉండేది. అడుక్కున్నా. ఏమైనా–మా చిన్నప్పటి రోజులకు, ఇప్పటికీ ఇంత తేడా ఉంది అంటే–అంతకుముందు యాభైయేళ్ళ క్రితం ఎలా ఉంటుందో ఇప్పుడర్ధమైంది. బ్రాహ్మణుల స్వార్ధం సమాజాన్ని ఎంత నీచస్థాయికి దిగజార్చిందో అర్ధమైంది– మరి అప్పటి ఉన్నవాళ్ళ స్థితి ఎలా ఉండేదో...?

నిజవేం–బ్రాహ్మణుడంటే–రేపటికి ఏముందో, లేదో, ఆలోచించకుండా లేనివాళ్ళకు పంచి పెట్టే వాళ్ళు. అటువంటి వాళ్ళకు దానం చేయటం పుణ్యమే! ఇప్పుడలాంటి వాళ్ళెక్కడున్నారు? ఈ దానాలకర్ధమేంటి? కర్మకాండల్లో దానం చేస్తే పట్టేదెవరు? బలసిన ఈ బ్రాహ్మణులకిచ్చేబదులు లేనివాళ్ళకిస్తే పుణ్యంరాదా? అయితే...మంత్రాలు, నమ్మకాలు...?

ఏమైనా నాన్నగారు తమ రచనతో కాస్త ఆలోచనాపరుల మెదళ్ళను కదిలించారు. ఈ ఆలోచనలతోనే ఆ నాడు కమ్మ బ్రాహ్మణులు తయారయ్యారేమో! నెల్లూరులో ఒక పాఠశాల ఉండేదట. అయితే ఇప్పుడా వ్యవస్థ ఏది?

ఏదెలా ఉన్నా నాన్నగారి జీవితంలో వారి నిరాడంబరత, మానవత, మూర్తిభవించిన దేశ ప్రేమ ప్రస్తుత సమాజానికి (కావలసిన వారికి) ఎంతో అవసరం. కానీ ఈ రోజు అందరూ బ్రాహ్మణులే! ఎవరికని చెప్తాం... కాకపోతే ఈ మానవారణ్యంలో ఒక చిరుదివ్వె 'వెలలేని బ్రతుకు'

తమసోమా జ్యోతిర్గమయ...అని కోరుకుంటూ..

మీ విధేయుడు

**21.3.2009**

**ఇడుపులపాడు**

**523 190**

**డా॥ చింతలపూడి**
**వెంకటేశ్వర్లు**

ఎం.ఏ. పిహెచ్‌డి.

[illegible]

**SIDDHARTHA MEDICAL COLLEGE**
**VIJAYAWADA.**

**DR. Y.SREEHARI RAO,**
*Principal*

**RECEPT**

Received the body of Late Sri Yalamanchili Venkatappaiah garu,Freedom fighter and Gandhian, from his heir Sri Yalamanchili Muralidhar.

**(DR. Y. SREEHARI RAO)**

# బీద బ్రతుకు

## 1

**మన** పూర్వీకులెవరో? వారు ఎక్కడ పుట్టారో, వారు ఎక్కడ పెరిగారో, వారెటువంటి వారో, మొదలగు సంగతులను మనం ముందుగా తెలుసుకొనుట ఎంతో అవసరం.

మన పూర్వికుల పుట్టిల్లు నేడు మన భారతదేశానికి తూర్పున వున్న బంగాళాఖాతంలోని ఫిలిఫ్ఫైన్స్ దీవులు (లంకలు), అని ఇటీవల కాలంలో ఒక రష్యన్ విజ్ఞానవేత్త ప్రకటించారు.

ఫిలిప్పీన్స్ దీవులు భూమధ్యరేఖకు దగ్గరగా ఉన్నందున అక్కడ సూర్యుని ఎండ ఎక్కువగా ఉంటుంది. ఇంతేకాకుండా మన పూర్వీకులు ఎండలో, వానలో కష్టపడేవారు. అందువల్ల వారి శరీరాలు నల్లగా ఉండేవట.

నేటికి సుమారు 6–7 వేల యేండ్లకు పూర్వం మన పూర్వీకులలో కొందరు ఆస్ట్రేలియా ఖండానికి, మరికొందరు ఉత్తర భారత ప్రాంతంలోని అలహాబాద్ ప్రదేశానికి, ఇంకొంత మంది పంజాబులోని సింధు నదీ ప్రాంతానికి వలస వెళ్ళారట. పంజాబు ప్రాంతానికి వెళ్ళిన మన పూర్వీకులకు చరిత్రకారులు ద్రావిడులు అని పేరు పెట్టారు. ద్రావిడులు నల్లని శరీరాలు కలిగి ఉండి పొట్టిగా ఉండేవారని చరిత్రకారులంటున్నారు.

## 2

సింధునదీ ప్రాంతానికి వెళ్ళిన మన పూర్వీకులు గొప్ప విజ్ఞానాన్ని సంపాదించుకొని, ఆకాశంలోనూ, నీటిలోనూ, నీటిపైనా, చీకటిలోనూ తిరగగలిగే శక్తివంతులై ఉండేవారట. వారు సూర్యుని వెల్తుర్ని కూడా కొన్ని రోజులపాటు కనపడకుండా మూసివేయగల శక్తివంతులుగా ఉండేవారట. ఇంతేకాదు వారు కావాలనుకొన్న మానవ రూపాలను ధరించే వారట, కావాలనుకొన్నప్పుడు వానలను కురిపించుకొనేవారట. వారు నదులకు ఆనకట్టలు కట్టి కాల్వలగుండా పంట పొలాలకు నీటిని పారుదల చేసి, రకరకాల పంటలు పండించేవారట. వారు సన్నని నూలుతో నేసిన రకరకాల గుడ్డలను, రాగి, ఇత్తడి, మన్ను మొదలగు వాటితో రకరకాల పాత్రలను, పనిముట్లను వెండి, బంగారాలతో రకరకాల నగలను తయారుచేసి తాము నిర్మించిన ఓడలద్వారా సింధునది గుండా సముద్రంలో ప్రయాణం చేసి టర్కీ, గ్రీకు మొదలగు దేశాలలో వాటిని అమ్మేవారట.

వారు ఆవులు, మేకలు, గొర్రెలు, గుర్రాలు, ఒంటెలు మొదలగు పెంపుడు జంతువులను పెంచేవారట. వారు ఆవులను ముఖ్యంగా పాలు, దూడలు, ఎరువు వగైరాలనూ పెంచేవారట. మేకలను, గొర్రెలను, పాలు, ఎరువు, మాంసము వగైరాల కొరకు పెంచేవారట. గుర్రాలను,

ఒంటెలను బండ్లకు నాగళ్ళకు కట్టేవారట. వాటి మీద ఎక్కి ప్రయాణం చేసేవారట. కాని వారు ఆవు, ఎద్దు, గుర్రము మొదలగు జంతువుల మాంసము తినేవారు కాదట. వారిలో ఎక్కువ మంది శాకాహారులేనట. (కూరగాయలు తినేవారట). వారు ఆవును పూజించేవారట.

## 3

నేటికి సుమారు 3-4 వేల యేండ్లకు పూర్వము మన పూర్వీకులున్న సింధునదీ ప్రాంతానికి మధ్య ఆసియా నుండి తెల్లజాతివారు బ్రతకడానికై వచ్చారట. వారు తమను "ఆర్యులము" అని చెప్పుకొన్నారట. వారు దృఢకాయులు, దేశదిమ్మర్లు. హింసావాదులు. గుఱ్ఱం, ఆవు, ఎద్దు, దున్నపోతు మొదలగు జంతువుల మాంసం తినే పక్కా మాంసాహారులట. వారు మన పూర్వీకులలోని కొంత మంది మేధావులకు (విజ్ఞానవేత్తలకు) రకరకాల ఆశలు చూపించి వారిని వశపరచుకొని వారి శాస్త్ర గ్రంధాలను చాలా భాగం కాజేసి తమలో చేరిపోయిన మన మేధావుల సహాయంతో తమకు లొంగని మన పూర్వీకులను మాయోపాయాలతోనూ, దౌర్జన్యంతోనూ చంపి, తమకు దక్కవని తెలిసిన మన పూర్వీకుల అనేకమైన అమూల్య గ్రంధాలను నిర్దాక్షిణ్యంగా తగలబెట్టి వేశారట. తమకు లొంగని మన రాజులను చంపించి వారి కోటలను, నగరాలను, సేనలను, పశుసంతతిని, వారి పంట భూములను స్వాధీన పరచుకొన్నారట.

ఇంతేకాకుండా మన పూర్వీకులు కట్టిన నదుల ఆనకట్టలను ధ్వంసంచేసి వేశారట. కాని గ్రామాలలో నివసించుచున్న మన పూర్వీకులు చాలామంది క్రూరులైన ఆర్యుల బాధలనుండి తప్పించుకొని దక్షిణ భారత ప్రాంతానికి పారిపోయి వచ్చారట. వారే నేడు ఆంధ్రులు, తమిళులు (అరవవారు) కన్నడులు, మలయాళీలు అని పిలువబడుతున్నారు.

## 4

మన పూర్వీకులు ఆంధ్రులు. ఆంధ్రులను తెలుగువారు లేక తెనుగువారు అని కూడా అంటారు. నేడు మన తెలుగు బాసను మాట్లాడేవారి సంఖ్య 6 కోట్లకు చేరుకొన్నదట. మన తెలుగు బాస పూర్తిగా మౌలికమైనది. అనగా ఇది సొంతంగా పుట్టిందే కాని, ఏ ఇతర బాసలనుండి పుట్టింది కాదు. ఇది సర్వస్వతంత్రమైన బాస. ఇది ఆర్యభాషయని చెప్పబడే సంస్కృత భాషతో ఏవిధమైన పొత్తులేని స్వచ్ఛందమైన, మృదువైన బాస అని భాషావేత్తలు వక్కాణిస్తున్నారు. అందుకే కాబోలు, పాశ్చాత్య భాషావేత్తలు (తెల్లవారు మన తెలుగు బాసను "తూర్పుదేశాల ఇటలీ బాస" అని కొనియాడారు.

## 5

చదువరులారా! ఇప్పుడు నేను మిమ్ములను ఎనిమిది పదులయేండ్ల వెనుకటి కాలానికి తీసికొనిపోతున్నాను. ఆనాడు మన తెలుగునాడు తెల్లవాళ్ళచేత పాలింపబడుచుండేది.

తెల్లవాళ్ళు పరిపాలనా సౌకర్యం కోసం మన తెలుగునాటను కొన్ని ముక్కలుగా చేసివేశారు. ప్రతిముక్కకు జిల్లా అని పేరు పెట్టారు. ప్రతి జిల్లానూ కొన్ని ముక్కలు చేశారు. ప్రతి ముక్కకు తాలూకా అని పేరు పెట్టారు. ప్రతి తాలూకానూ కొన్ని ముక్కలుగా చేశారు. ప్రతి ముక్కకూ ఫిర్కా అని పేరు పెట్టారు. ప్రతి ఫిర్కాలోనూ కొన్ని పల్లెటూళ్ళుండేవి.

నాది కృష్ణాజిల్లా గుడివాడ తాలూకా పామర్రు ఫిర్కాలోని కనుమూరు గ్రామం. ఆనాడు మా వూరిలో కమ్మవారు ఎక్కువ. తరువాత ఎక్కువ సంఖ్యలో బ్రాహ్మణులుండేవారు. మా వూరిలో ఆ నాడు 2 మంగలివారి ఇండ్లు, 2 మాల సాలీల ఇండ్లు, 4-5 తురకల వారి ఇండ్లు (సాహెబ్బులు) 40-50 తూర్పువారి ఇండ్లు ఉండేవి. ఆ నాడు మా వూరిలో చాకళ్ళు ఉండేవారో లేదో నాకు గుర్తు లేదు. కాని మా కుటుంబాలకు మాత్రం మా ఊరికి దగ్గరలో ఉన్న గోపువానిపాలెం నుండి చాకళ్ళు రోజూవచ్చి మా గుడ్డలను ఉతికి సాయంకాలం ప్రతి ఇంటివద్ద ఒక పెద్దమూకుడు నిండా అన్నం పెట్టించుకొని తీసికొని వెళ్ళేవారు. ఇంతేకాకుండా వారికి గుడ్డలు ఉతికినందులకు సంవత్సరానికి కుటుంబాన్ని బట్టి ధాన్యం కూడా ఇవ్వబడేది.

## 6

ఆ రోజులలో మా ఊళ్ళో నడిబజారులో ఒక "బండకొయ్య" ఉండేది. మా వూరిలో ఎవడైనా తప్పు పనిచేస్తే మా ఊరి పెద్దలే విచారించి తీర్పు చెప్పి వాడు చేసిన తప్పుకు (నేరానికి) తగిన శిక్షను కొయ్యబండ ద్వారా వేసేవారు.

ఆ నాడు మా ఊరిలో ఆరుగురు పెత్తందారులుండేవారట. మా నాయన బీదవాళ్ళ ముఠా నాయకుడట. మా ముఠాను పాపయ్యగారి ముఠా అనేవారు. మా తండ్రి అంకప్ప. ఆయన తండ్రి పేరు వీరన్న. వీరన్న తండ్రిపేరు నీలయ్య, నీలయ్య తండ్రిపేరు పాపయ్య. మా ఊరిలో ఆనాటి ముసలి వాళ్ళు నేను బడికి వెళ్ళుచున్నప్పుడు "నీవు ఎవరి అబ్బాయివిరా?" అని నన్ను అడిగినప్పుడు నేను అంకప్ప కొడుకునని చెప్పేవాణ్ణి. అప్పుడు వారు "నీవు పాపయ్యగారి, నీలయ్యగారి, వీరన్నగారి అంకప్ప కొడుకువంట్రా!"అని అనేవారు. ఈ రకంగా మా కుటుంబానికి మూడు, నాలుగు తరాలనుండి మా వూరిలో మంచి పేరుండేదట.

## 7

మా నాయన పేరు అంకప్ప, మా అమ్మపేరు ఆదెమ్మ. మాది పెద్ద బీద కమ్మ రైతుకుటుంబం. ఆ రోజులలో మాకు కాటన్ దొరగారి పుణ్యమా అంటూ, రెండు ఎకరాల మాగాణి పొలం ఉండేది. మేము ఆరుగురము అన్నదమ్ములము. మాకు ఇద్దరు అక్కలు, ముగ్గురు చెల్లెండ్రు కూడా ఉండేవారు. మా అమ్మ అంచనా ప్రకారం నేను 1898లోనూ, నా చెలికాండ్ర అంచనా ప్రకారం నేను 1900లో పుట్టి ఉంటానట. ఈనాడు

నేను 87 ఏండ్ల మూడుకాళ్ళ (కర్ర పోటీతో నడిచే) ముసలయ్యనన్నమాట. అయినప్పటికీ ఈ ముసలితనంలో కూడా ఎందుకోగాని నాకు నా ఆరవయేట ఈడునుండి జరిగిన కొన్ని నిజాలు (జరిగిన పనులు) అదే పనిగా పందెం వేసుకొని గుర్తుకు రాసాగాయి. అందువల్ల వాటిని నల్లని అక్షరాలలో పెడితే, ఈనాటి పిల్లలకు, పెద్దలకు ఏమాత్రమైనా కాలక్షేపం కలుగగలదనే నమ్మకంతో వాటిని నేను ఇప్పుడు అక్షరాలలో పెట్టాను. కాని వాటిలోని కొన్ని సంగతులు పగటి కలలుగా నేటి చదువరులకు కన్పిస్తాయి. కాని అవి నా కల్పితాలు కావనియు, ఆనాటి దేశ కాల పరిస్థితులననుసరించి అవి నిజంగా జరిగిన సంగతులేనని మనవి చేస్తున్నాను.

## 8

మాది ఒక పెద్ద బీద కమ్మ రైతుకుటుంబమనియు, ఆ రోజులలో మాకు కాటన్ దొరగారి చలువ వల్ల రెండు ఎకరాల మాగాణి పొలం ఉందని లోగడ చెప్పాను. ఆ రోజులలో మా రెండు ఎకరాల మాగాణి పొలం ఈనాటి మాగాణి పొలంలాగా పండేది కాదు. మా రెండు ఎకరాల మాగాణి పొలంలో మహా అయితే 12-14 బస్తాలు వడ్లు పండేవి. ఆ వడ్లు మా కుటుంబానికి చాలేవి కావట. అందువల్ల మా అయ్య, మా చిన్నయ్యలు ముగ్గురు, నలుగురు కలిసి మా వూరిలోని శివాలయం మాన్యం 15 ఎకరాల మెట్ట పొలాన్ని చెరి సగం పాలుకు సాగుచేసేవారు. అందులో మా వంతు వచ్చే ఫల సహాయంతో మా కుటుంబం చాలీచాలని తిండితోనూ, చినిగిన గుడ్డలతోనూ, కుక్కిమంచాలతోనూ కాలక్షేపం చేస్తూ ఉండేది.

నేను మా అన్నలు 8-9 యేండ్ల ఈడు వచ్చేవరకు మా నాయన పాత కట్టుపంచిని చింపుకొని బెత్తెడున్నర వెడల్పు, మూరెడున్నర బారుగల గోచీలనే పెట్టుకొనేవాళ్ళం. మా వంటిమీద చొక్కాలుగాని, మట్టలాగులుగాని బారులాగులుగాని ఉండేవి కావు. మేము దిగంబర సన్యాసిల్లాగ ఉండేవాళ్ళం. మా ఇంటిలో పక్కలకు దుప్పట్లు కాని, జమఖానాలుగాని, పరుపులుగాని ఉండేవి కావు. చలికాలంలో బాగా చలివేసిన రాత్రిపూట మేము ఇద్దరం ముగ్గురము కలిసి మా అమ్మ పాతకోకను కప్పుకొని కుక్కిమంచాల మీద పండుకొనేవాళ్ళం. చలికాలంలో చలి మరీ ఎక్కువగా వేసిన రాత్రులందు మా అయ్య అందరికంటే ముందుగా తెల్లవారుఝామున లేచి పొయికాడ ఎండు గోగూసలతో చలిమంట వేసేవాడు. పిల్లలం మేము ఒక్కొక్కరం లేచి పొయికాడకు వెళ్ళి చలిమంట చుట్టూ కూర్చొని చలి కాచుకునే వాళ్ళం. తెల్లవారిన తరువాత పిల్లలం మేము ఎండలోకెళ్ళి కూర్చుండి చలి కాచుకొనే వాళ్ళం. చలికాలపుటెండ మాబోటి గోచిపాత రాయళ్ళకు ఎంతో సంబరం కలిగించేది.

# 9

ఆ రోజులలో మా ఇంటిలో అన్నీ మట్టికుండలే ఉండేవి. అన్నం, కూర, పచ్చడి, వెన్నపూస, నెయ్యి, ఆముదము, చల్ల, తరవాణి (పుల్లనీరు), సంబారు కారం, ఊరగాయ పచ్చళ్ళు మొదలగువాటికన్నింటికీ మట్టికుండలే వాడబడేవి. వాడుకొనే నీళ్ళను నిల్వ ఉంచుకోటానికోసం మాకు ఒక పెద్ద మట్టిగాబు ఉండేది. గొడ్లకు నీళ్ళు పెట్టడానికని పెద్ద మట్టితొట్టి ఉండేది. మంచినీళ్ళకు ఒక పెద్ద మట్టిబాన ఉండేది. కందులు, జొన్నలు, బియ్యం వగైరా ధాన్యాదులను రోజూ వాడుకోటానికోసం నిల్వ ఉంచుకోటానికై మా ఇంటిలో రెండు-మూడు అరివేణి బానలుండేవి. కాని ఆ రోజులలో చాలామంది పొలాలుగల రైతులు నేలలో గజం, గజంన్నర లోతు గుంటలను త్రవ్వి వాటిలో గడ్డిపెట్టి ధాన్యం పోసి పైన గడ్డి కప్పి దానిపైన మన్నుపోసి ఆ గుంటను పూడ్చివేసి కొన్నినెలల వరకు వడ్లను నిల్వ ఉంచేవారు. ఆ గుంటను పాతర అనేవారు. పాతరపడ్డ ధాన్యం తొందరగా అరుగునని చెప్పి రోగులకు కూడా పాతర పడ్డ ధాన్యం అన్నం పెట్టేవారు.

మా కుటుంబం మొత్తానికి మంచినీళ్ళు త్రాగడానికి రెండు మూడు కంచు గలాసులు ఉండేవి. అన్నం తినడానికి మూడు-నాలుగు సత్తు నిలువు గిన్నెలు ఉండేవి. మయ్య, మమ్మ అన్నం తినడానికి ఒక పెద్ద కంచుపళ్ళెం ఉండేది. కాని మయ్య ఎక్కువగా బాదమాకుల లేక మర్రి ఆకుల విస్తరిలోనే అన్నం తినేవాడు. మేమందరం చెంబట్టుకొని వెళ్ళడానికి మా ఇంటిలో రెండు ఇత్తడి నిలువు చెంబులుండేవి. అప్పుడప్పుడు మేము మట్టి ముంతలను కూడా వాడేవాళ్ళం. ఆవు పాలు తీయడానికి మా ఇంటిలో ఒక కుంబకోణపు చెంబు ఉండేది.

మాకు పాడి (పాలు, పెరుగు, మజ్జిగ) లేనపుడు మమ్మ తరవాణి పట్టేది. ఒక శుభ్రమైన మట్టికుండలో వడపోసిన మంచినీళ్ళు సగానికి పైగా పోసి అందులో వేడి వేడి మొక్క జొన్నన్నంగాని పచ్చ జొన్న అన్నంగాని పది పట్రెండు ముద్దలు వేసి కొన్ని గంటల సేపు మూతపెట్టి నిల్వ ఉంచేది. ఆ నీళ్ళు, అన్నం పులిసి పుల్లగా అయిపోయేవి. వాటిని "తరవాణి" అనిగాని "పుల్లనీళ్ళు" అనిగాని అనేవారు.

మమ్మ కూర చేయలేని రోజున తరవాణినే తిరుగుబోతవేసి మజ్జిగచారు లాగ చేసేది. దానిలో వేడి వేడి అన్నం, ఉప్పు కలుపుకొని మేము ఎంతో సంబరంతో జుర్రుకొనేవాళ్ళం. గింజలు పోసి కూరగాయలు కొనలేక మమ్మ మా వాముల దొడ్డిలో పడి మొల్చిన దొగ్గలకూరను గాని అటుకు మామిడి (గల్జేరుకాడ)గాని ఎక్కువగా వండుతుండేది.

మాది పెద్ద బీద కుటుంబంగా. అందుకని అన్నం ఆటి వస్తుందని మమ్మ ఎక్కువగా మొక్కజొన్న అన్నంగాని, పచ్చజొన్నల అన్నంగాని వండేది. మా అన్నలు, మా అక్కలు

మొక్కజొన్న అన్నంగాని, పచ్చజొన్నల అన్నంగాని బాగా ఇష్టంగా తినేవాళ్ళు, కాని నేను, మయ్య ఇద్దరం మొక్కజొన్న అన్నంగాని పచ్చజొన్న అన్నంగాని ఇష్టంగా తినేవాళ్ళం కాము. అందుకని మమ్మ, మయ్యకు వరి అన్నం పెట్టేది.

మా అక్కలు అత్తగారిండ్లకు వెళ్ళిన తరువాత మా అన్నలే మొక్కజొన్నలు పిండిగా కొట్టేవారు. పచ్చజొన్నలు కొయ్యరోటిలో తొక్కి కడిగి వండటానికి మమ్మకు ఇచ్చేవారు. మా అన్నలు వడ్లు దంపేవారు. వారు అవసరమైనపుడు ఇంటి పనులలో మమ్మకు తోడ్పడేవారు.

మమ్మ రోజూ కూర వండలేక ఒక వారం రోజుల వరకు మా అందరకూ సరిపోయే పచ్చిమిరపకాయల పచ్చడిగాని, గోంగూర పచ్చడిగాని, పండు మిరపకాయల కొరివి పచ్చడిగాని (ఎర్రకారపు పచ్చడి) తొక్కి మమ్మే సొంతంగా ఇంటిలో వండిన వంట ఆముదము కొంత, మా ఇంటిలో మమ్మచేసిన వెన్న కొంత వేసి తిరగబోత పెట్టి ఒక పెద్ద మట్టిచట్టిలో ఉంచి మూకుడు మూతవేసి ఉట్టిమీదపెట్టి ఉంచేది. దానిని మేము ఒకవారం రోజులపాటు అన్నంలో కలుపుకొని తినేవాళ్ళం. ఆ రోజులలో బీరువాలుండేవి కావు. అన్ని వంట పదార్థాలు ఉట్ల మీదనే ఉంచబడేవి.

ఆ రోజులలో పల్లెటూళ్ళల్లో రైతులు సొంతంగా జనపనారతోగాని, గోగునారతోగాని, సారనారతోగాని ఉట్లు, నీళ్ళకావిడి మట్లు, గొడ్లకు త్రాళ్ళు, బండి మోకులు, నాగలి మోకులు, పగ్గాలు, మంచాలకు నులక, గొడ్లకు చిక్కాలు మొదలగునవి తయారు చేసుకొనేవారు.

మా ఇంటిలో ఎప్పుడూ సంబారుకారం ఉండేది. ఎందుకనగా కూరలేని రోజున మేము వేడి వేడి అన్నంలో సంబారుకారం పోసుకొని వెన్ననుగాని, నేయినిగాని వేసుకొని ఎంతో సంబరంగా తినేవాళ్ళం. సంబారుకారం ఎంతో రుచిగానూ, ఆరోగ్యకరంగానూ ఉండేది. మమ్మ ఎండుమిరపకాయలు, ధనియాలు, మెంతులు, ఉప్పు మొదలగువాటిని తేలికగా వేయించి వాటిలో వెల్లుల్లిపాయల గర్భాలు, వండిన పసుపుకొమ్ములు వేసి రోటిలో మెత్తగా పొడి కొట్టించేది. ఆ పొడిని సంబారుకారం అనేవారు. ప్రతి సామాన్య రైతు కుటుంబంలోనూ ఆ రోజులలో ఈ సంబారు కారం తప్పక నిల్వ ఉంచబడేది. కూర లేనప్పుడు దీనినే నేయిగాని, వెన్నగాని వేసుకొని అన్నంలో కలుపుకొని తింటే ఎంతో రుచిగా ఉండేది.

నేను చిన్నప్పుడు సంబారుకారం ఎక్కువగా తినేవాణ్ణి. పచ్చిమిరపకాయల పచ్చడిలో కారం చాలలేదని ఒక్కొక్కప్పుడు నేను సంబారుకారం మమ్మ చూడకుండా పచ్చడిలో కలుపుకొని తినేవాణ్ణి.

ఆ రోజులలో మా ఊరిలో మెట్ట పొలాల్లో పచ్చికబీళ్ళు ఎక్కువగా ఉండేవి. వాటిలో పెద్ద పెద్ద చెదలపుట్టలు ఉండేవి. వానాకాలంలో ఆ పుట్టలమీద విపరీతంగా పుట్టకొక్కులు

మొలిచేవి. మా అన్నలు వానాకాలంలో రోజూ పుట్టకొక్కులను త్రవ్వుకుని తెచ్చేవారు. వానాకాలంలో మేము ఎక్కువగా పుట్టకొక్కుల కూరనే తినేవాళ్ళం.

అప్పుడప్పుడు మమ్మ ఇరుగుపొరుగు ఇండ్లనుండి ఉలవనీళ్ళు తెచ్చి ఉలవ చారు కాసేది. దానిని మేము రెండు మూడు రోజులపాటు కూరగా వాడుకొనేవాళ్ళం.

అన్నం ఆటి రావాలని మమ్మ అప్పుడప్పుడు మొక్కజొన్న పిండిలో గుమ్మడికాయ ముక్కలనుగాని, ఉలవల ముతక రవ్వనుగాని పోసి మొక్కజొన్న తోప వండేది. నేను, మయ్య తప్ప తక్కినవారంతా చాలా ఇష్టంగా ఆ తోపను తినేవారు.

నేను మొక్కజొన్న అన్నంగాని, పచ్చజొన్న అన్నంగాని ఎన్నడూ కడుపునిండా ఇష్టంగా తినేవాణ్ణి కాదు. అందువల్ల నేను చాలా బలహీనంగా బక్కచిక్కి ఎండిపోయి ఉండేవాణ్ణి. మా ఇంట్లో ఆ రోజులలో మా నాయనకు మాత్రం వరి అన్నం (బియ్యపు అన్నం) వండేవారు. అందుకని మా నాయన అన్నానికి ఎప్పుడు వస్తాడా అని నేను కనిపెట్టుకొని ఆయనకై ఎదురు చూస్తూ ఉండేవాణ్ణి. ఒక్కొక్క రోజున నేను మొక్కజొన్న అన్నం అని అన్నం తినకుండానే బడికి మమ్మకు కనబడకుండా పరుగెత్తేవాణ్ణి. ఈ సంగతి మా నాయనకు తెలిసి తాను అన్నం తినకుండా, నా కోసం బడికాడకు వచ్చి నన్ను తన భుజాల మీద ఎక్కించుకొని వీధి గుండా వస్తూ ఉంటే మా ఊరిలోని కలిమిగల కమ్మవారు కొంతమంది బ్రాహ్మణులు "ఏమంకప్పా! కొడుకును చదివించి 'కలెకటరు'గా చేయాలనుకొంటున్నావా? వెధవను ఎవరి గొడ్లకాడైనా పాలేరుతనానికి పెట్టక నెత్తినేసుకొని ఊరేగుతున్నావా?" అని ఎగతాళిగానూ, తేలికగానూ మాట్లాడేవారు. కాని మా నాయన వారి యెద్దేవా మాటలను విని, చిన్నగా నవ్వి మెదలకుండా ఇంటికివచ్చి నన్ను తన పీటమీద వెనుక పక్కన నేను మమ్మకు కనపడకుండా ఉండేలాగున కూర్చోపెట్టుకొని తన కంచు కంచంలో పెట్టిన వరి అన్నం, కూర వగైరాలలో కొంత భాగాన్ని నా సత్తు గిన్నెలో మమ్మకు కనపడకుండా ఉంచి, తినమని మమ్మ వింటుందేమోనని నోటితో చెప్పక తన ఎడమచేయి మోచేతితో నెమ్మదిగా నన్ను పొడిచి తినమని సైగ చేసేవాడు.

నేను మా నాయనకు పెట్టిన వరి అన్నం, కూర వగైరాలను తింటున్నానని మా యమ్మకు నామీద వల్లమాలిన కోపం వచ్చేది. కోపంతో మమ్మ నన్ను "ఓరి సచ్చినాడా! నీ జిమ్మలాగ! పాడు గున్న! ముదనష్టపాడా! నీ తల పగల! మీ నాయన్ని అన్నం తిననివ్వంట్రా! నీ తల పగల!" అని అదే పనిగా తిట్టేది. ఒక్కొక్కప్పుడు కోపం పట్టజాలక మమ్మ పొయికాడ ఉన్న పిడకను అన్నం తింటున్న నామీద విసిరి వేసేది. అప్పుడు మా నాయన మమ్మతో "ఓసి నీ నోట కూడు గొట్ట! వాడు అసలే తిండి సరిగా తినక ఎండుకు పోతోంటే, వాణ్ణి

తిట్టడానికి నీకు నోరూ, కొట్టడానికి చేతులు ఎట్లా వస్తున్నాయే? నీ నోట కూడు గొట్ట" అని ఆమెను మందలించేవాడు. ఒక్కొక్కప్పుడు మమ్మ నన్ను కొట్టబోతే మా నాయన మమ్మను కొట్టబోవగా, మమ్మ మా నాయనకు అందకుండా దూరంగా పరుగెత్తేది.

ఇంతకూ మమ్మకు నా మీద ఇంత కోపం ఉంటానికి మరొక బలమైనకారణం కూడా ఉంది. నేను చిన్నప్పుడు ఇరుగు పొరుగు పిల్లలతో ఆడుకొనేటప్పుడు వారిని చీటికి మాటికి కొట్టి ఇంటిమీదకు యాగీలు తెచ్చేవాణ్ణి. అందుకని మమ్మ నాకు "భజనగాడు" అని పేరు పెట్టి 'భజనగా!" అని పిలిచేది. ఎప్పుడైనా ఇరుగు పొరుగు పిల్లవాడు నన్ను కొట్టినపుడు నేను ఏడుస్తూ మమ్మవద్దకు వెళ్ళేవాణ్ణి, మమ్మ నన్ను దగ్గరకు లాక్కొని గట్టిగా పట్టుకొని "నీవు వాళ్ళవద్దకు ఎందుకు వెళ్ళావు పాడు గున్నా!" అని నన్ను చావబాదేది. అందుకని చిన్నప్పుడు నాకు మమ్మంటే చచ్చే అంత భయం ఉండేది. అయితే మమ్మ చాలా నిరాడంబరంగానూ, నిష్కపటంగానూ ఉండేది. ఆమె కల్లా కపటం ఎరుగని దొడ్డ ఇల్లాలని మా చుట్టుపక్కల అమ్మలక్కలు అనుకొనేవారు. నిజంగా మమ్మకు గుడ్డసోకుగాని, నగల ఆరాటంగాని, బడాయి మాటలుగాని, అబద్ధంగాని, సోమరిగా కూర్చోవడం గాని గిట్టేది కాదు. గంపెడు పిల్లలతో ఒక్కతే పిల్లలందర్ని సర్దుకొని మమ్మ రాత్రులందున, తెల్లవారుఝామున కనిపించీ కనిపించని వెల్తురు గల చిన్ని కిరోసిన్ బుడ్డి గ్రుడ్డి వెల్తుర్లో రాట్నం వడికేది. ఆమె తాను వడికిన నూలుతో మా దోడ్లో కాపురముంటున్న కబ్బదు అనే మాలసాలీతో తనకు కోకలను నేయించుకొని తడిపిన తరువాత కట్టుకొనేది.

ఒకసారి మా ఇరుగు పొరుగు అమ్మలక్కలు ఏదో శుభకార్యానికై మమ్మ గంపెడు పిల్లలుగల దొడ్డముత్తయిదని యెంచి మా అమ్మకు పసుపు, కుంకుమ, కుంకుళ్ళు, నూనె, సున్నిపిండి వగైరాలుపెట్టి తలంటుకొని తొందరగా పేరంటానికి రావలసిందని మమ్మకు బొట్టుపెట్టి వెళ్ళారు. కాని మమ్మ పిల్లా జెల్లాతో తీరిక లేకపోయినందున సకాలానికి పేరంటానికి వెళ్ళలేకపోయింది. అందుకని మమ్మ రాలేదని అమ్మలక్కలందరు మరల మా ఇంటికి వచ్చి మా యమ్మను రమ్మని తొందరింపసాగారు. వారి తొందరవల్ల మమ్మ మా పడమటింటి గదిలో మేదర పెట్టిలోఉన్న తన కోకల్లోని కొత్తకోకకు బదులు చీకటిలో కనపడకపోవుటవల్ల పాతకోకను కట్టుకొని బయటకు వచ్చింది. అమ్మలక్కలు మమ్మను చూచి కడుపుబ్బ నవ్వుతూ మా అమ్మతో "ఇదేంటాదెంపెద్దమ్మా? పాతకోక కట్టుకొని పేరంటానికి బయలుదేరావు?" అని ఇరగబడి నవ్వసాగారు. అప్పుడు మా యమ్మ వారి మాటలను, నవ్వును లక్ష్యపెట్టక వారితో "ఏ కోకైతే ఏమి పోయిందల్లా? పదండి వెళ్దాం" అని చెప్పి పేరంటానికి వెళ్లింది.

# 10

మమ్మ మాటి మాటికి లేచి ప్రతి ఒక్కరికీ అన్నం పెట్టుట కష్టమని, మేమే పిల్లలం ఎవరంతట వారం ఉట్లల్లో ఉన్న మట్టికుండలోని అన్నము, మట్టిచట్టిలో ఉన్న కూరగాని పచ్చడిగాని వేసుకొని మమ్మ చూడకుండా మట్టిముంతలో ఉన్న నేతిని ఎంగిలి చేతితోనే తీసికొని మా సత్తు నిలువు గిన్నెలలో పెట్టుకొని తిని ఎవరి గిన్నెను వారే కడిగి గోడకు ఆనించి పెట్టేవాళ్ళం. చల్ల లేనపుడు తరవాణిని గిన్నెనిండా పోసుకొని అన్నం పిసుక్కొని అదేపనిగా జుర్రుకొనేవాళ్ళం. మా ఇంటిలో పాడి లేనపుడు చల్ల ఉండేది కాదు. అప్పుడు మమ్మ తరవాణిని తప్పక పట్టేది. వేసవికాలంలో మేమందరం చల్ల ఉన్నప్పటికీ ఒక పూట తప్పక తరవాణిని ముఖ్యంగా మిట్టమధ్యాహ్నమప్పుడు త్రాగేవాళ్ళం. ఎందుకంటే వేసవి కాలంలో తరవాణిని త్రాగితే వడదెబ్బ తగలదని పెద్దాళ్ళనేవాళ్ళు.

మాది పెద్ద బీద కుటుంబం. అందుకని మమ్మ పండుగలకుగాని, ఒట్టప్పుడుగాని, చిఱుతిండిగా చలిమిడినిగాని, కుడుములనుగాని చేసేది. చలిమిడిలో ఎండుకొబ్బరి ముక్కలు, వేయించిన నువ్వులు కలిపి పాకం పట్టేది. చలిమిడిని మేము నెల-రెండు నెలలపాటు చిఱుతిండి క్రింద తినేవాళ్ళం. మా యమ్మ మొక్కజొన్న పిండితోగాని బియ్యపు పిండితోగాని ఇడ్లీలవలె కుడుములను ఆవిరిలో వండేది. అప్పుడుప్పుడు కుడుముల పిండిలో సెనగలుగాని, కందులుగాని, తాటితాండ్రనుగాని కలిపి కుడుములు చేసేది. ఆ కుడుములను మేము 3-4 రోజులపాటు చిఱుతిండి క్రింద తినేవాళ్ళం. ఇడ్లీలు కూడా ఒకరకపు ఆవిరి కుడుములే.

అప్పుడప్పుడు మమ్మ మొక్కజొన్నలలో సెనగలుగాని, కందులుగాని కలిపి గుగ్గిళ్ళు వేసేది. వాటిని మేము రెండు మూడు రోజులపాటు చిఱుతిండి క్రింద తినేవాళ్ళం. అప్పుడప్పుడు మమ్మ మొక్కజొన్నలు వేయించేది. వాటిని మొక్కజొన్న పేలాలు అనేవారు. మా అన్నల చేత పేలాలను పిండిగా కొట్టించి దానిలో కల్లు బెల్లంగాని, మంచిబెల్లంగాని కలిపి ఒకబానలో పోసి ఉంచేది. ఆ పేలప్పిండిని మేము నెల-రెండు నెలలపాటు చిఱుతిండి క్రింద రోజూ దోసిళ్ళల్లో పోసుకొని బుక్కేవాళ్ళం. అప్పుడప్పుడు పేలపిండిని మేము నోటినిండా పోసుకొని బుగ్గలుబ్బించి ఎదురుగా ఉన్న మా చెలికాండ్ర ముఖం మీద సరదాగా 'ఉఫూ' అని ఊదేవాళ్ళం.

ఆ రోజులలో మా ఊళ్ళో తాడిచెట్లు, ఈతచెట్లు వఱుగా ఉండేవి. వేసవికాలంలో మా అన్నలు తాటిముంజెలను తాటాకు రేకలలో కట్టుకొని ఇంటికి తెచ్చేవారు. మేము వేసవికాలంలో చాలారోజులు తాటిముంజెలను తినేవాళ్ళం. తాటిబుర్రలతో మేము బండ్లను తయారు చేసుకొని వాటికి త్రాళ్ళు కట్టి పందాలు వేసుకొని ఆడుకొనేవాళ్ళం. ఎండిన తాటిబుర్రలను పొయిలో పెట్టుకునేవారు. మా అన్నలు ముదిరిన ఈతకాయ గెలలను

కోసుకొని వచ్చి మా గడ్డివామిలో పండేసేవాళ్ళు. పండిన ఈతకాయలను మేము ఖర్జూర కాయల్లాగ లొట్టలేసుకుంటూ తినేవాళ్ళం. వానాకాలంలో మా అన్నలు తెల్లవారుఝామున లేచి తాటిపండ్లను ఏరుకొని తెచ్చేవారు వాటిని మేము నిప్పులమీద కాల్చుకొని తలా రెండు గింజల గుజ్జును చీకేవాళ్ళం. తాటిపండ్ల గుజ్జును మేము ఒక నెలరోజుల పాటు చిఱుతిండి క్రింద తినేవాళ్ళం. మమ్మ, మా అక్కలు కాల్చిన తాటిపండ్ల గుజ్జును సన్నని గుడ్డమీదగాని, తాటాకు చాపమీదగాని, తాటాకుతో అల్లిన చిలుకులమీదగాని రోజూ కాస్త కాస్త 10–15 రోజులపాటు వేసి ఎండబెట్టేవారు. ఎండిన తరువాత ఆ గుజ్జును ఒలిచేవారు. ఎండిన తాటిగుజ్జును తాటిచాప లేక తాటితాండ్ర అనేవారు. తాటితాండ్రను మేము అప్పుడప్పుడు చిఱుతిండి క్రింద తినేవాళ్ళం. అది పండ్లకు చుట్టుకొని పోయేది. మా అమ్మ తాటితాండ్రను మొక్కజొన్న పిండిలోగాని, వరిపిండిలోగాని తమిదపిండిలోగాని కలిపి కుడుములు చేసేది.

మా అన్నలు తాటి గింజలను నేలలో ఒక అడుగులోతున గుంటలో పాతేసేవారు. కొన్ని నెలలకు అవి తేగలుగా తయారయ్యేవి. తేగలను మేము కాల్చుకొని గాని ఆవిరిలో ఉడకేసుకొనిగాని తినేవాళ్ళం.

ఈనాడు ఎక్కడబడితే అక్కడ “వయ్యారి భామ” (మాచెర్ల కంప మొక్కలు) మొలిచినట్లు ఆ రోజులలో రక్కిస ఎక్కడబడితే అక్కడ ఏపుగా, దట్టముగా పెరిగేది. మా ఇంటిలో చిఱుతిండి ఏమీ లేనపుడు మేము రక్కిసపండ్లను తెచ్చుకొని వాటిలోని గుజ్జును చప్పడించి గింజలను ఊసేసేవాళ్ళం.

ఇంతేకాదు ఆ రోజులలో కంచెలమీద పిచ్చిదొండ తీగె పిచ్చిగా పెరిగేది. మా ఇంటిలో చిఱుతిండి ఏమీలేనప్పుడు మేము పిచ్చిదొండ పండ్లను కోసుకొని వచ్చి గుజ్జును తిని గింజలను ఊసేసేవాళ్ళం.

మా అన్నలు మాగాణి చేలల్లో కలుపుతీయడానికి వెళ్ళి నమ్మదుంపలు తెచ్చేవారు. వాటిని మేము కాల్చుకొని చిఱుతిండి క్రింద తినేవాళ్ళం. ఆ రోజులలో చిలగడదుంపలు కూడా వ(జ్రు)గా ఉండేవి. వాటిని మేము నిప్పులమీద కాల్చుకొని తినేవాళ్ళం. అప్పుడప్పుడు మమ్మ సన్నని చిలగడదుంపలను ఉడకేసేది. వాటిని మేము రెండు మూడురోజుల పాటు చిఱుతిండి క్రింద తినేవాళ్ళం. మమ్మ చిలగడదుంపలను ఇగురుకూరగాను, పులుసుకూరగాను వండేది.

# 11

వేసవికాలంలో మా అన్నలు మధ్యాహ్న సమయంలో వేపచెట్లెక్కి వేపపండ్లను తాము తింటూ క్రిందఉన్న మా పిల్లలకు కూడా పండ్లుగల రెబ్బలను విరిచి క్రింద పడేసేవారు. నేను, మరికొంత మంది నా జతగాండ్రు వేపపండ్లను గబగబా కోసుకొని నోటినిండా

పెట్టుకొని గుజ్జును చప్పడిస్తూ గింజలను ఊసేసేవాళ్ళం. ఒకరోజున నా జతగాడు నాకంటే ఎక్కువ పండ్లను తింటున్నాడని నేను గబ గబా నోటినిండా పండ్లను కుక్కుకొని గుజ్జు చప్పరిస్తుండగా తొందరలో రెండు మూడు గింజలు నా కడుపులోనికి గబాలున జారిపోయాయి. ఈ సంగతి నేను నా జతగానితో చెప్పగా అతడు నన్ను పండ్లను తినకుండా చేయడానికై నాతో "నీవు మింగిన వేపగింజలు రేపటికి నీ కడుపులో మొక్కలు మొలుస్తాయి. అప్పుడు నీవు చచ్చిపోతావు" అని చెప్పి నన్ను బెదరేశాడు. నేను పండ్లను తినుట మానివేసి మన్నలకు కూడా చెప్పకుండా ఏడుస్తూ ఇంటికి వెళ్ళి ఏడుస్తూ కూర్చున్నాను. ఇంతలో మా నాయన పొలమునుండి ఇంటికి వచ్చాడు. నేను ఏడ్వడం చూసి "ఎందుకు ఏడుస్తున్నావురా" అని నన్నడిగినపుడు నేను జరిగిన కథంతా చెప్పాను. అప్పుడు మా నాయన నాతో "ఓరే అబ్బాయీ! నీవు మింగిన గింజలు నీ కడుపులో మొక్కలు మొలవవురా! అవి రేపు నీవు చెంబట్టుకి వెళ్ళినప్పుడు నీ పియ్యవెంట బయటకు వచ్చేస్తాయి. అంతేగాని అవి నీ కడుపులో ఉండవు. ఏడ్వబోకు" అని నన్ను ఓదార్చాడు.

ఒకసారి బడిలో పిల్లలము కలలను గురించి చెప్పుకొంటూ ఉండగా కలలో పందిపిల్లలు కన్పిస్తే, కల వచ్చినవాడు ఆరు మాసాల లోపల చచ్చిపోతాడని మాలోని పెద్దకుర్రవాడు చెప్పాడు. కొన్ని రోజులకు ఒక అర్ధరాత్రివేళ నాకు కలలో పందిపిల్లలు కన్పించాయి. వెంటనే నేను మేల్కొని మంచం నడాన కూర్చొని చచ్చిపోతాననే భయంతో ఏడ్వసాగాను. నా ఏడ్పును విని మా నాయన లేచి ఎందుకు ఏడుస్తున్నావురా అని నన్నడిగినపుడు నేను కల సంగతిని చెప్పి బిగ్గరగా ఏడ్వసాగాను. మా నాయన ఎంత బ్రతిమాలినా నేను వినిపించుకోకుండా ఇంకా బిగ్గరగా ఏడ్వసాగాను. తెల్లవార్లూ నేను ఏడుస్తూనే ఉన్నాను. తెల్లవారిన తరువాత బడికి వెళ్ళే వేళ అయినప్పటికీ నేను బడికి వెళ్లకుండా ఏడుస్తూ ఉన్నాను. నేను రోజూ అందరి కంటే ముందుగా బడికి వెళ్ళేవాణ్ణి. కాని ఆ రోజున వెళ్లనందున నేనెందుకని రాలేదని మా ఆఖరు తెలుగు గురువుగారైన కూనపులి సుందరరామయ్యగారు స్వయంగా మా ఇంటికి నా కొరకు వచ్చి బయట నిలబడి నన్ను పిలిచారు. కాని నేను ఇంకా బిగ్గరగా ఏడుస్తూ బయటకు రాలేదు. అందుకని మా గురువుగారైన సుందరరామయ్యగారు స్వయంగా నా మంచం కాడికి వచ్చి, విషయం కనుక్కొని నాతో "ఓరే వెంకటప్పా! ఆ కల వచ్చిన వాళ్ళు చావర్రా! కాని వాళ్ళు చదువులో కాస్త మందకొడులుగా ఉంటారు. అంతేగాని చావడం అనేది లేదు. లే! బడికి వెళదాం" అని నాకు నచ్చచెప్పి నన్ను వెంటబెట్టుకొని బడికి తీసుకొని వెళ్ళారు.

# 12

మా ఇంటిలో చిఱుతిండి ఏమీ లేనప్పుడు నేను మమ్మ చూడకుండా బియ్యం, కందిపప్పు కలుపుకొనిగాని, చింతపండు, కారం, ఉప్పు కలుపుకొనిగాని తినేవాణ్ణి. ఒక్కొక్కప్పుడు మమ్మను బతిమాలుకొని పెద్దుల్లిపాయను (నీరుల్లిపాయను) పిడకల నిప్పుమీద కాల్చుకొని తినేవాణ్ణి.

ఆటిడుపు రోజున (బడికి సెలవురోజున) నేను మా అన్నల వెంట మొక్కజొన్న చేనుకాడకు వెళ్ళేవాణ్ణి. మా అన్నలు కండెలను, విరుచుకొని వచ్చి ఒకటి రెండు రేకులుంచి వాటిని తుమ్మ కంపమీద కాల్చేవారు. కండెలను కాల్చుటను తంపటి వేయుట అనేవారు. లేతకండెలను పాలబొండ్లు అనేవారు. పాల బొండ్లను మేము కాల్చుకోకుండానే పండ్లతో గీరుకొని తినేవాళ్ళం. మమ్మ పాలబొండ్లను ఉడకేసేది. ఉడికిన కండెలను మేము ఒకటి రెండు రోజుల పాటు చిఱుతిండి క్రింద తినేవాళ్ళం.

గింజలను రాలకొట్టిన కండెలను కండిబొండ్లు అనేవారు. ఎండిన కండిబొండ్లను, మగ తాడిచెట్టు గులకచళ్ళను ఒకరాత్రి భూపుటము (నేలలో ఒక గుంటలో కుమ్మవేయుట)వేసి రెండవ రోజున ఉదయాన వాటిని బయటకు తీసి కలామిలా నలగగొట్టి పొడిచేసి దానిలో కొంచెం సూరేకారం కలిపి వెడల్పుగల గుడ్డలో దానిని పోసి గుండ్రని పొట్లాలు కట్టేవాళ్ళం. ఆ పొట్లాలను, పూల పొట్లాలు అనేవారు. ఆ పొట్లాలకు పైన పది పదిహేను రోజులపాటు ప్రతిరోజు పేడపూసి ఎండలో పెట్టేవాళ్ళం. దీపావళిపండుగ రోజున సాయంకాలం లేత తాటిమట్టలను మూడుగా చీల్చి వాటిలో ఆ పూపొట్లాలను ఉంచి వాటికి త్రాళ్ళుకట్టి వాటిలో పిడకనిప్పులను ఉంచి బాగా రాజుకొన్న తరువాత చీకటి పడినప్పుడు తాడుపట్టుకొని వాటిని గిరగిరా తిప్పేవాళ్ళం. పూల పొట్లాలనుండి పూవులు పూవులుగా నిప్పురవ్వలు రాలేవి. అందుకే వాటిని పూల పొట్లాలు అనేవారు.

ఆ రోజులలో దీపావళి రాత్రియందు పిల్లలూ, పెద్దలూ (మగవాళ్ళు మాత్రమే) ముందుగా, ఎండు గోగూసలను గుప్పెడు గుప్పెడు కట్టలుగా కట్టుకొని వాటి చివర నిప్పంటించి గిరగిరా తమ తమ వాకిళ్ళ ముందు బజారులో త్రిప్పేవాళ్ళు. ఆ గోగూసల కట్టను దీట దివిటీ అనేవాళ్లు. అందుకే దీపావళి పండుగను దిటీల పండుగ అని సామాన్యంగా అంటారు.

దీపావళి పండుగ రాత్రియందు ఆడవాళ్ళు ముఖ్యంగా హిందువుల ఆడవాళ్ళు తమ తమ ఇండ్ల వాకిళ్ళల్లోనూ, కిటికీలలోనూ, గోడల గూళ్లలోనూ మట్టి ప్రమిదలలో ఆముదము పోసి దూదివత్తులను వెలిగించేవారు. అందుకే యీ పండుగను దీపావళి అని అంటారు. దీపావళి అంటే దీపముల సమూహము (గుంపు).

ఆ రోజులలో దీపావళి పండుగకు బీదాసాదా అనే భేదం లేకుండా హిందువులనబడే వారందరూ తమ తమ తాహతుకు తగ్గ ఏదో ఒక పిండివంట (పప్పులు) చేసుకొని తాము తింటూ తమ పనివాళ్ళకు పెట్టేవారు. అందరూ తప్పక తాటాకు టపాకాయలను కాల్చేవారు. మా ఊరు హైదరాబాద్–బందరురోడ్డు ప్రక్కనే ఉండేది. అందువల్ల దీపావళి రాత్రియందు మా వూళ్ళోని కలిమిగల కొంతమంది యువకులు రోడ్డుమీదకు వెళ్ళి పందాలు వేసుకొని రెండు ముఠాలుగా చీలి రాత్రి 1–2 గంటల వరకు ఒకరిమీద ఒకరు మండుతున్న తోటాలను విసిరి విసిరి వేసుకొనేవారు. ఈ సందర్భంలో తోటాల నిప్పురవ్వలు పడి చాలామందికి చేతులు, కాళ్లు, గుడ్డలు కాలేవి. ఈ రకంగా ఆ రోజు రాత్రిపూట ఒక్క మా గ్రామంలోనే 2–3 వందల రూపాయల తోటాలు కాల్చబడేవి. ఆ రోజులలో యీ ఖర్చును గొప్పగా చెప్పుకొనేవారు.

# 13

ఆటిడుపు రోజున నేను మన్నల వెంట పచ్చజొన్నచేనుకాడకు వెళ్ళేవాణ్ణి. మా అన్నలు లేత లేత జొన్నకంకెలను విరుచుకొచ్చి, గింజలను గుడ్డలోగాని, బుట్టలోగాని రాలగొట్టేవారు. వాటిని ఒక డబ్బా రేకులోగాని, కుండపెంకులోగాని పోసి వేయించేవారు. లేత పచ్చి జొన్నగింజలను ఊసబియ్యం అనేవారు. వేయించిన ఊస బియ్యం ఎంతో రుచిగానూ, ఆరోగ్యకరంగానూ ఉండేవి.

నేను మన్నలవెంట ఆటిడుపు రోజున సెనగచేసుకాడకు వెళ్ళేవాణ్ణి, మా అన్నలు పాకానికి వచ్చిన సెనక్కాయలుగల సెనగ మొక్కలను పీక్కొచ్చి వాటిని తుమ్మ చిదుగుల మీద కాల్చేవారు. సెనక్కాయలను కాల్చుటను తంపటి వేయుట అనేవారు. తంపటి వేసిన కాయల గింజలు మినపగారెలకంటే కూడా ఎక్కువరుచిగా ఉండేవి.

ఆటిడుపు రోజున నేను మన్నలవెంట కందిచేనుకాడకు వెళ్ళేవాణ్ణి. మా అన్నలు ముదిరిన కందికాయలను కోసుకొచ్చి ఒక మట్టి పిడతలో ఉడకేసేవారు. ఉడికిన కందికాయలలోని గింజలు ఎంతో రుచిగా ఉండేవి. అవి ఈ రోజులలో ఉడకేసిన వేరుశెనక్కాయలలోని గింజలు కంటే ఎక్కువ రుచిగా ఉండేవి.

మా అన్నలు తమిదలను బరకగా (పిండి) విసిరేవారు. మమ్మ ఆ బరక తమిద పిండితో పిట్టును ఆవిరిలో తయారుచేసేది. అది యీ కాలపు గోధుమ లేక బొంబాయి రవ్వతో తయారుచేయబడే ఉపమా కంటే కూడా ఎక్కువ ఆరోగ్యకరంగా ఉండేది. మేము దానిలో ఏదేని పచ్చడిగాని, పులుసుకూరగాని కలుపుకొని తినేవాళ్ళం.

మమ్మ వేసవి కాలంలో మెత్తని తమిద పిండితో జావ కాసేది. ఆ జావలో మేము చల్లనుగాని, తరవాణిని గాని పోసుకొని జుర్రుకొనేవాళ్ళం. ఆ జావ ముందు యీ కాలపు సగ్గుబియ్యపు పాయసం బలాదూర్! తమిద జావ వేసవికాలంలో ఎంతో చలవచేసేది.

## 14

ఆ రోజులలో మాకు ఒక ఎద్దు, ఒక ఆవు, ఒక ఆవుదూడ, 15-20 మేకలు ఉండేవి. మాకు ఆ రోజులలో గేదలున్నట్లు నాకు గుర్తులేదు. మా పెద్దన్న నరసయ్యగారు మేకలను, మా రెండవ అన్నయ్య శ్రీరాములుగారు ఆవును, ఎద్దును రోజూ మేపడానికి పొలం తోలుకొని వెళ్ళేవారు. మా మూడవ అన్నయ్య కృష్ణయ్యగారు ఇంటివద్ద ఉండి మమ్మకు ఇంటి పనులలో సహాయపడేవారు. ఆయన ఇల్లు, వాకిలి, పశువుల చావిడి, మేకల పాక ఊడ్చి వాకిట్లో కళ్ళాపి చల్లేవారు. అంటుకుండలు తోమేవారు. మా ఉప్పునీళ్ళ బావినుండి వాడుకోవడానికి నీళ్ళు తోడుకొని వచ్చి ఒక పెద్ద మట్టిగాబులో పోసేవారు. మా ఊరి దేవాలయంలోని మంచినీళ్ళ బావినుండి కావిడి వేసుకొని రోజుకు రెండు కావిళ్ళ మంచినీళ్ళు తెచ్చేవారు.

ఆయన చల్ల చేసేవారు, మొక్కజొన్నలు పిండిగా కొట్టేవారు. పచ్చజొన్నలు కొయ్యరోటిలో తొక్కి కడిగి వండటానికి మమ్మకు ఇచ్చేవారు. వడ్లు దంపేటప్పుడు మా మమ్మతో పాటు వడ్లు దంపేవారు. మా చెల్లెళ్ళ తలలకు కొబ్బరినూనె రాసి తలలు దువ్వేవారు.

## 15

మా నాయన చదువుకోలేదు. కాని ఆయనకు చదువంటే ఎంతో ప్రేమ. అందువల్ల మా నాయన మా అన్నలందర్ని చదవేశాడట. కాని వారెవ్వరూ సరిగా బడికి వెళ్ళక మారాము చేసేవారట. అందువల్ల మా నాయన మా అన్నలందర్నీ బడి మాన్పించివేసి వారిని పొలంపనులలో పెట్టవలసి వచ్చిందట. కాని నేను మాత్రం నా ఆరవయేట నుండే బడి అంటే పరుగెత్తేవాణ్ణి. నేను నాగా లేకుండా బడికి వెళ్ళేవాణ్ణి. మా కుటుంబంలోనూ, మా చిన్నయ్యల కుటుంబాల్లోనూ నేను తప్ప మరెవ్వరూ చదవడం లేదు. అందువల్ల నేనంటే మా అన్నలకూ, మా నాయనకూ, మా చిన్నయ్యలకు ఎంతో ప్రేమ. అందుకని నాకు మెడకు మెలికలు తిరిగిన ఒక ఇత్తడికంటే, చేతులకు రెండు ఇత్తడి మురుగులు, చెవులకు రాగి తీగె పోగులు, ఎడమ చెవిపైభాగాన పచ్చని గాజు పూసగల లాకులాగ వ్రేలాడే ఒక పోగు ఉండేవి. నాకు నెత్తిమీద చిటికెడు పిలక జుట్టు, ముఖాన పంగనామాలు, మొలకు ఒక గోచీ ఉండేవి. నేను 9 యేండ్ల ఈడు వచ్చే వరకు గోచీలనే పెట్టుకొనేవాణ్ణి.

నేను బడికి వెళ్ళేటప్పుడు రోజూ ఎడమచేతి చంకలో బడిలో కూర్చోవడానికై సొంతంగా ఇంటి వద్ద అల్లుకొనిన తాటాకుల చాపను, కుడి చేతిలో బడివద్ద నేలమీద అక్షరాలు నేర్చుకోవడానికి పిడకల కచ్చికలుగల చిన్న తాటాకుల బుట్టను తీసికొని వెళ్ళేవాణ్ణి.

ఆ రోజులలో బీద పిల్లలకు అక్షరాలు, గుణింతము, ఎక్కాలు నేలమీదనే కచ్చికల బూడెద మీదనే నేర్పేవారు. కాని కలిమిగలవారి బిడ్డలు మాత్రం రాతిపలకలను కొనుక్కొని వాటిమీద వ్రాసుకొనేవారు. మేము కచ్చికల బూడెదమీద మా కుడిచేతి నడిమివ్రేలు మీద

మా చూపుడు వ్రేలు (రెండవ వ్రేలు)వుంచి అక్షరాలు దిద్దుకొనే వాళ్ళం. వాటిని గుంట ఓనమాలు అనేవారు. నేను రెండేండ్ల తరువాత పుస్తకం పట్టాను. పుస్తకం చదువుట మొదలు పెట్టడాన్ని పుస్తకము పట్టుట అనేవారు. పుస్తకం పట్టే రోజున పిల్లవాని తల్లిదండ్రులు ఎంత బీదవాళ్ళైనా సరే, తమ తాహతుకొద్దీ బడి పిల్లలకు కొబ్బరి ముక్కలు, వడపప్పు, బెల్లం, పంతులయ్యకు ఒక కొత్త రెక్కచాపు (ఒక కట్టుపంచె, ఒక పైపంచె) పెట్టి బహుమతిగా కొంత డబ్బు యిచ్చేవారు.

నేను మొదట పై అట్టమీద అరటిచెట్టు బొమ్మగల తెలుగు బాలశిక్షను చదివాను. తరువాత ఏమి చదివిందీ గుర్తులేదు. కాని నేను 'ఆంధ్ర నామ సంగ్రహము', 'గజేంద్ర మోక్షము', 'రుక్మిణి కళ్యాణము', 'అమర కోశము', 'రాఘవ పాండవీయము', ఆదిపర్వము, సభాపర్వము (భారతం)చదివాను. 'ఆంధ్ర సంగ్రహము', 'అమర కోశము' కంఠస్థ పరచాను. ఈ పుస్తకాలన్నీ నేను నా 14ఏండ్ల యీడు లోపలనే చదివాను. తరువాత నేను కృష్ణాజిల్లా జమీగొల్వేపల్లెలో పూజ్యులు వల్లభనేని రామకృష్ణయ్య కవిగారి వద్ద 'మనుచరిత్ర'ను ఆ గ్రామంలో వారాల తిండి తిని 8 మాసాల పాటు నేర్చుకొన్నాను.

## 16

మా బడిలో పాఠాలు రాని చిన్న పిల్లలను పంతులయ్య మామూలు గుంజీలు, మోకాటి గుంజీలు తీయించి గోడ కుర్చీ వేయించేవారు. కాని పాఠాలురాని పెద్ద పిల్లలను గోచీలు పెట్టించి నడిబజారులో నిలబెట్టి పాఠాలు వచ్చేవరకు చదివించే వారు. అల్లరి చేసిన పిల్లలను పేముబెత్తంతో వారి అరచేతులమీద కొట్టేవారు. మరీ ఎక్కువ అల్లరిచేసిన పోకిరీ పిల్లల్ని కోదండం తీయించేవారు. పాఠశాల ఇంటిదూలానికిగాని, పూరిపాక తన్నుడుకర్రకుగాని ఒక లావాటి త్రాడు వ్రేలాడకట్టి దానిని అల్లరిచేసిన పిల్లవానిని పట్టుకొని వ్రేలాడమనేవారు. ఇంకా ఎక్కువ అల్లరిచేసిన పిల్లవానిని కోదండం పట్టించి వాని పాదాలకు కొంచెం ఎడంగా కాగితాలతో సన్నని మంట పిల్లవానిని భయపెట్టడానికై వేయించేవారు. పిల్లవాడు మంటకు భయపడి తన పాదాలను పైకి ముడుచుకొని ఇక అల్లరి చేయనని బిగ్గరగా ఏడ్చేవాడు.

ఆ రోజులలో పంతులయ్యలు అల్లరిచేసిన పిల్లలను కనికరం లేకుండా గొడ్డును బాదినట్లు చావ బాదేవారు.అందుకని కొంతమంది పోకిరీ పిల్లకాయలు, ఎవ్వరికీ తెలియకుండా పంతులయ్య కూర్చునే చాపక్రింద పల్లేరుకాయలుగాని, రక్కసిమట్టగాని పెట్టేవారు, పంతులయ్య పాపం మామూలుగానే వచ్చి చాపమీద కూర్చోగానే తేళ్ళు కుట్టినట్లు పల్లేరుకాయలుగాని, రక్కిసమట్ట ముళ్ళుగాని కసిక్కిన గుచ్చుకొనేసరికి పంతులయ్య కెవ్వున కేక బెట్టి చిందులు గంతులువేస్తూ చాపను తీయించి చూచేవారు. పల్లేరుకాయలనుగాని, రక్కిసమట్టగాని చూచి పంతులయ్యకు పట్టరాని కోపంవచ్చి పేము బెత్తం తీసికొని ఎదురుగా

కూర్చున్న ఏ పాపమూ ఎరుగని పిల్లలను నిజం చెప్పమని వరుసబెట్టి చిత్తుచిత్తుగా రెండుమూడు బెత్తాలు విరిగిపోయేవరకు చావ బాదేవారు. పిల్లలందరూ ఏడుస్తూ ఏమీ చెప్పలేకపోయేవారు.

# 17

మా బడికి ప్రతి పూర్ణిమకు, ప్రతి అమావాస్యకు సెలవులుండేవి. సెలవులను ఆటూడుపు రోజులు అనేవారు. అటిడుపు రోజులంటే ఆటవిడుపు రోజులని అర్థం. ప్రతి ఆటిడుపుకూ ప్రతి ఒక పిల్లవాడుగాని పిల్లగాని బీదా సాదా అనే విచక్షణలేకుండా ఒక్కొక్క కానీ (1 1/2 పైసల విలువలగల రాగి నాణెము) చొప్పున తెచ్చి పంతులయ్యకు ఇవ్వాలి. ఆ కానీని అటిడుపు కానీ అనేవారు.

ప్రతి పండుగకు ప్రతిపిల్లవాడు పంతులయ్యకు తన ఆర్థిక తాహతుకొద్దీ బియ్యం, పప్పు, చింతపండు, నేయి, పెరుగు, కూరగాయలు, కొంతదక్షిణ (డబ్బు) తెచ్చిఇవ్వాలి. దసరా పండుగకు పంతులయ్య పిల్లలందర్నీ ప్రతి పిల్లవాడి ఇంటికి, పిల్లలకు విల్లంబులను, కొయ్యకోతులను యిచ్చి తీసికొని పోయి దసరా పాటలు “అయ్యవారికి చాలు అయిదు వరాహాలు, పిల్లలకు చాలు పప్పు బెల్లాలు” మొదలగు పాటలు పాడించేవారు. పిల్లల తల్లిదండ్రులు పిల్లలకు కొబ్బరికాయలు, బెల్లం ఇచ్చి పంతులయ్యకు కొంత డబ్బు ఇచ్చేవారు.

కొంతమంది పంతులయ్యలు దసరా పండుగకు కొన్నిరోజులకు ముందుగా పెద్ద పిల్లలను వారి వారి బంధువుల ఊళ్ళకు తీసుకొని పోయేవారు. పిల్లల చుట్టాలు తమ చుట్టాల పిల్లలకు పప్పు బెల్లాలకని కొంత డబ్బును ఇచ్చి, పంతులయ్యకు దక్షిణగా (బహుమతిగా) కొంత డబ్బు యిచ్చేవారు. ఈ విధంగా దసరా పండుగకు పంతులయ్యలు కొంత ఆదాయం పొందేవారు.

# 18

ఆ రోజులలో కాస్త ఆస్తిపాస్తులుగల వారందరూ పెండిండ్ల సమయాలలో తప్పనిసరిగా భోగం మేళాన్ని పెట్టేవారు. ఎందుకనగా భోగంమేళం ఉందంటే జనం పిలవకుండానే పొయ్యేవారు. అందుకని కలిమిగలవారే కాకుండా, సామాన్య ఆర్థిక వనరులుగలవారు కూడా అప్పో సప్పో చేసి తమ ఇండ్లలోని పెండ్లిండ్లకు తప్పనిసరిగా భోగం మేళాన్ని పిలిపించేవారు.

ఆ రోజులలో పెండ్లికొడుకూ, పెండ్లికూతురు ఇద్దరూ పల్లకీలో కూర్చోని ఊరేగేవారు. పల్లకీని ఆరుగురు చాకళ్ళు మోసేవారు. చాకళ్ళను బోయీలు అనేవారు.

పెండ్లికి ముందు పెండ్లికొడుకును పల్లకీలో కూర్చోబెట్టుకొని బోయీలు పెండ్లికుమార్తె ఇంటికి మోసుకొని పోయేవారు. దారిలో పెండ్లికొడుకు బోయీలకు త్రాగినంత కల్లు

పోయించేవాడు. బోయీలు కల్లు నిషాలో (మత్తులో) హుషారుగా పాటలు పాడుతూ పరుగెత్తుతూ పల్లకీని మోసుకొని పోయేవారు.

పెండ్లిపెద్దలు, మేళతాళాలవారు, భోగంమేళంవారు సవారీ బండ్లలో (గుడిసీ బండ్లలో) కూర్చోని పెండ్లికూతురు ఊరికి సాయంకాలానికి చేరుకొనేవారు. పెండ్లిపెద్దలు వగైరాలు పెండ్లికుమార్తె ఊళ్ళో ఏదేని చెరువు గట్టుమీదనో, ఏదేని బావివద్దనో విశాలమైన చోటులో కాళ్ళు కడుక్కొని చాపలమీద కూర్చుండేవారు. పెండ్లికూతురువైపు వారు మిరియాల పొడిచేసి బెల్లం పానకం తయారుచేసి కావిళ్ళతో మోసుకొచ్చి వచ్చి పెండ్లి పెద్దలకు ముందుగా పానకం త్రాగించి తరువాత తాంబూలాలు యిచ్చి సత్కరించేవారు. తరువాత పెండ్లిలగ్నం వేళను బట్టి పెండ్లికి ముందుగాని, తరువాతగాని భోజనాలు ఉండేవి.

ఆ రోజులలో కరెంటు(విద్యుత్) లేదు. అందువల్ల రాత్రులందు వెల్తురుకోసం కిర్సనాయిల్‌లో (కిరోసిన్‌లో) ఎండిన పిడకలను ముంచి వాటిని బారాటి వాసపు గెడల చివర అమర్చబడిన ఇనపచువ్వలకు రెండువైపులా తగిలించి నిప్పు వెలిగించేవారు. వాటిని కూలీలు మోసేవారు. కాని పెండ్లికొడుకు పల్లకీ వద్ద మాత్రం ఆముదపు కాగడాలను చాకళ్ళు వేసేవారు.

ఆ రోజులలో మామూలు మంగలి మేళము, రామడోళ్ళు, తాషా మరపాలు, బాకాజోళు ళ్ళ మొదలగు వాయిద్యాలతోనే ఎక్కువ పెండ్లిండ్లు జరుగుతూ ఉండేయి. ఆ రోజులలో బ్యాండు మేళం పల్లెటూళ్ళల్లో చాలా తక్కువ ప్రచారంలో ఉండేది. కాని మా ఊళ్ళో భాగ్యవంతురాలైన యలమంచిలి బసవపూర్ణమ్మగారి కుమార్తెల పెండ్లిండ్లకు మొట్టమొదటిసారిగా మా ఊళ్ళోకి బ్యాండుమేళం వచ్చినట్లు నాకు గుర్తు, ఒకే మాదిరి డ్రస్సు వేసుకొని 15-20 మంది బ్యాండు వాయిద్యాలు వాయించారు. వారిని చూట్టానికి మా ఊరిలోని జనం ఎగబడ్డారు.

ఆ రోజులలో ఎక్కువ పెండిండ్లు రాత్రులందే జరిగేవి. పెండ్లివారు ముఖ్యంగా అబ్రాహ్మణులు వచ్చిన రాత్రికే పెండ్లి జరుపుకొనేటట్లు లగ్నాలుండేవి. మరునాడు ఉదయం పెండ్లి పెద్దలు వగైరాలు ఫలహారంచేసి ఎండెక్కక ముందే మేళతాళాల వారిని, భోగంమేళాన్ని తీసుకొని పెండ్లికొడుకును, పెండ్లికూతురిని ఊరేగించడానికి బయలుదేరేవారు. (ఊరివారికి ఎరిగించడానికి)

ప్రతి ఇంటి ముందు 1-2 నిమిషాలసేపు ఆగేవారు. భోగంమేళంలోని ఆడవాళ్ళు కాళ్ళకు గజ్జెలు కట్టుకొని పాటలు పాడుతూ చిందులు త్రొక్కుచూ నృత్యం చేసేవారు.

సాయంకాలం 5-6 గంటలకు పెండ్లి పెద్దలు కొత్తబట్టలు కట్టుకొని ఊరిలోని దేవాలయం వద్దగాని మరే ఖాళీ చోటులోగాని సభ చేసేవారు. ఆ సభను మేజువాణి

అనేవారు. కాని దానిని మేజవానీ అని అనాలి. అంటే పెండ్లికూతురువైపువారు, పెండ్లిపెద్దలకు యిచ్చే అతిధ్యము (అతిధి సత్కారము). పెండ్లి కూతురు వైపువారు మంచిగంధము, అత్తరువు, పన్నీరు, తమలపాకులు, వక్కలు, యాలక్కాయలు, లవంగాలు, జాజికాయ, జాపత్రి వగైరాలతో పెండ్లి పెద్దలను సత్కరించేవారు. ఆ సందర్భంలో భోగంమేళంలోని నాయకురాలు గొల్లభామగాను, భరతనాట్యం తెలిసిన ఒక బ్రాహ్మణుడు శ్రీకృష్ణుడుగాను పాటలు పాడుతూ అభినయిస్తూ నాట్యం చేసేవారు. పెండ్లి పెద్దలు వారిరువురి పాటలు వారి హాస్యం, వారి నాట్యం చూసి సంబర పడేవారు.

ఊళ్ళోకి భోగంమేళం వచ్చిందనగానే ఊళ్ళోని కుర్రకారంతా ముఖ్యంగా కాస్త తడిగల కుర్రవాళ్ళు (డబ్బుగలవాళ్ళు) భోగంమేళంలోని అందమైన పడుచు అమ్మాయిలకు డబ్బిచ్చి వారిని జతకట్టేవారు.

ఆ రోజులలో ఆ పని తప్పుగాగాని, నేరంగాగాని యెంచబడేదికాదు. పైపెచ్చు ఆ పని మగవాని లక్షణమని (గుఋతని) పొగిడేవారు.

కొంతమంది కలిమిగల వారి వయస్సు వచ్చిన మగబిడ్డలు భోగంమేళంలోని కన్యలను (జతకట్టని ఆడపిల్లలను) డబ్బిచ్చి కొనుక్కొనేవారు. అలా కొనుక్కొనే పనిని కన్నెరికము అనేవారు. అంటే భోగంకన్యను మొదటిసారిగా జతకట్టుట. ఆ కన్యను డబ్బిచ్చి కొనుక్కొన్నవాడు బ్రతికి ఉన్నంతకాలం ఆమె అతడు కోరినప్పుడల్లా అతనితో జతకట్టి తీరాలి.

ఆ రోజులలో భోగంవారు పెండిండ్లు చేసుకొనేవారు కాదట. ఆ రోజులలో దేవాలయాల తరుపున కూడా కొంతమంది భోగంవారుండేవారు. వారిని దేవదాసీలు అనేవారు. దేవదాసీలు దేవుని ఉత్సవాల సందర్భంలో నృత్యం చేసేవారు. వారితో పూజారులు వగైరాలే కాకుండా ఊరిలోనివారు ఎవరైనా చాటుగా డబ్బిచ్చి జతకట్టేవారు. ఆ రోజులలో అది తప్పుకాదు. పూజారులకు వలెనే దేవదాసీలకు కూడా దేవాలయం తరఫున వారి భుక్తికై మడిమాన్యాలు (ఈనాములు) ఉండేవి.

ఆ రోజులలో మా కనుమూరుకు దగ్గరగా ఉన్న మేదూరులో రెండు మూడు బజారులలో అంతా భోగంవారే ఉండేవారని చెప్పుకొనేవారు. వారు చుట్టుప్రక్కల ఊళ్ళకు మేళాలకూ వెళ్ళేవారట. ఆ రోజులలో భోగంవారిని చాలా తేలికగా చూచేవారట, కాని వారి మోహంలో పడని మగవాడంటూ ఉండేవాడు కాదట.

# 19

ఆ రోజులలో ఇంగ్లీషు భాషా ప్రచారం మా జిల్లాలోని పల్లెటూళ్ళల్లో లేదనే చెప్పాలి. కాని బందరు, విజయవాడ యీ రెండు పట్టణాల్లో ఒకటి రెండు ఇంగ్లీషు ఉన్నత పాఠశాలలుండేవట. అందువలన ఇంగ్లీషు నేర్చుకోవడానికి కొన్ని పల్లెటూళ్ళల్లోని కాస్త ఆస్తిపాస్తులు, చదువు సంధ్యగల వారు తమ మగ బిడ్డలను బందరుగాని, బెజవాడగాని పంపేవారట.

మా కనుమూరునుండి మా మొదటి తెలుగు గురువుగారైన పెద్దిభొట్ల శేషయ్యగారి కుమారుడు బందరువెళ్ళి ఇంగ్లీషు చదివినట్లు నాకు గుర్తు. కాని పాపం అతడు చదువు పూర్తికాకముందే చనిపోయాడు. ఆ రోజులలో మా కనుమూరులో రెండు మూడు వీధిబడులుండేవి. వాటిలో తెలుగు మాత్రమే నేర్పబడేది. ఆ కాలపు చదువును వానాకాలపు చదువు అనేవారు. అంటే వానాకాలంలో పనిపాటలు తక్కువగా ఉన్నప్పుడు గ్రామాలలో చాలామంది చదువుకొనేవారట. మరల పనీపాటలు వచ్చినప్పుడు చదువును మానివేసే వారట. అందువల్ల ఆ చదువుకు వానాకాలపు చదువు అనే పేరువచ్చింది.

ఆ రోజులలో బ్రాహ్మణేతరులలో తెలుగు చదువుకొనేవారు చాలా తక్కువ. అటువంటప్పుడు వార్కి ఇంగ్లీషు నేర్చుకోవాలనే కోరిక ఎలా కల్గుతుంది? పైపెచ్చు ఇంగ్లీషు 'మాల భాష', 'మాదిగ భాష' దానిని మనం నేర్చుకోకూడదని కొంత మంది బ్రాహ్మణ పండితులు చెప్పేవారట. దీనికి తోడు తెల్లదొరలు తెల్ల దొరసానులు మాదిగ గూడాలలోకే తరచుగా వచ్చి తమ క్రీస్తుమత ప్రచారం చేసేవారు. అందువల్ల బ్రాహ్మణేతరులు ఇంగ్లీషుభాషను మాలభాషగా ఎంచి దానిని ఏవగించుకొని దాని జోలికి పోయేవారు కాదు.

ఆ రోజులలో చాలామంది బ్రాహ్మణేతరుల పరిస్థితి బ్రాహ్మణ సిద్ధాంతిగారు గాని, పురోహితుడుగాని నందంటే నంది, పందంటే పందిగా ఉండేది. సిద్ధాంతిగారిని గాని పురోహితుణ్ణి గాని ఆలోచించకుండా బ్రాహ్మణేతరులెవ్వరూ ఏ పనిని కూడా చేసేవారు కాదు.

బ్రాహ్మణేతరులు పై చదువులు, సంస్కృతం వగైరాలు చదవకూడదనియు, చదివితే పాపమనియు శాస్త్రాలలో వ్రాయబడి ఉందనియు బ్రాహ్మణ పండితులు చెప్పి వారిని బెదరేసేవారు. ఇటువంటి భయాలు బ్రాహ్మణేతరులకు ఉగ్గుపాల (చిన్నప్పటి నుండే)తోనే కలిగింపబడేవి. అందువల్ల ఆనాడు బ్రాహ్మణులంటే బ్రాహ్మణేతరులకు చచ్చే అంత భయం ఉండేది.

ముక్కుపచ్చలారని ఒక బ్రాహ్మణ బుడుతనికి బ్రాహ్మణేతరసంఘంలో ఉన్న గౌరవ మర్యాదలు, ఆదర సత్కారాలు ఒక మంచి నడతగల ముసలి బ్రాహ్మణేతర కులస్థునికి ఉండేవి కావు.

7-8 ఏండ్ల బ్రాహ్మణ కుర్రవాడు ఏదేని పని మీద అబ్రాహ్మణుల ఇంటికివస్తే 70-80 ఏండ్ల ముసలి అబ్రాహ్మణుడు కూడా మంచంమీద నుండి గభాలున లేచి, నిలబడి ఉన్న ఆ బ్రాహ్మణ కుర్రవానిని సాదరముగా వినయవిధేయతతో, భయభక్తులతో మంచంమీద కూర్చోపెట్టి తాను నిలబడి మాట్లాడేవాడు. ఆ బ్రాహ్మణ కుర్రవాడు వెళ్ళిపోయేవరకూ ఆ ముసలి అబ్రాహ్మణుడు నిలబడే ఉండేవాడు. ఆ బ్రాహ్మణ కుర్రవాడు. ముసలి

బ్రాహ్మణేతరునితో "ఏమోయి అంకప్పా! ఇవ్వాళ మా ఇంటిలో కూరగాయలు నిండుకొన్నాయి. మమ్మ ఏదైనా కూరగాయను నిన్నడిగి తీసుకొని రమ్మని నీ వద్దకు నన్ను పంపించింది. నీవు ఏదైనా కూరగాయుంటే నాకు ఇవ్వుము" అని అనేవాడు.

మంచి నడతగల నీతివంతుడైన ఒక ముసలి అబ్రాహ్మణుడు ఏదేని పనిమీద బ్రాహ్మణుల ఇండ్లకు వెళ్ళితే వారు, వారి పిల్లలు, వారి ఆడవారు అందరూ మంచాలమీద కూర్చుంటే ఆ ముసలి బ్రాహ్మణేతరుని నిలబెట్టి మాట్లాడి పంపేవారు.

ఆ రోజులలో పిల్లలకు అందులో బీద పిల్లలకు తమలపాకులు వేసుకొనుటంటే మహా సరదాగా ఉండేది. తమలపాకులు, వక్కలు, సున్నం వేసుకొని పిల్లలు ఎవరి నాలుక ఎక్కువ ఎర్రగా పండిందోనని ఒకరికొకరు తమ తమ నాలుకలను చూపించుకొని ఎక్కువ ఎర్రగా పండిన నాలుకగల కుర్రవాడు ఎంతో సంబరంతో గంతులు వేసేవాడు.

ఒకసారి నేను, నా జతగాడైన ఒక బ్రాహ్మణ కుర్రవాడు ఇద్దరం రాత్రి 1 గంటకు ఒక అబ్రాహ్మణుని ఇంటిలో జరిగే ఒక పెళ్ళికి తమలపాకుల ఆశతో వెళ్ళాము. అర్థరాత్రి పెండ్లగుటవల్ల పిల్లలందరూ పెండ్లి పందిట్లోనే చాపలమీద నిద్రపోయారు. నా జతగాడైన బ్రాహ్మణ కుర్రవాడు కూడా నా ప్రక్కనే నిద్రపోయాడు. కాని నేను మాత్రం తమలపాకుల యావలో మేల్కొనే ఉన్నాను. పెండ్లి అయిన తరువాత పురోహిత బ్రాహ్మణుడు తమలపాకులను ముందుగా బ్రాహ్మణులందర్కి యిచ్చి ఇంకెవరైనా బ్రాహ్మణ కుర్రవాడున్నాడా అని బిగ్గరగా కేకవేసెను. వెంటనే నా జతగాని సంగతి నేను చెప్పగా పురోహితుడు నిద్రిస్తున్న ఆ బ్రాహ్మణ కుర్రవాని వద్దకు వచ్చి వాని చేతిలో తమలపాకులుంచి తరువాత బ్రాహ్మణేతరులలోని పెద్దవాళ్ళకు ఇచ్చిన తరువాత అబ్రాహ్మణ పిల్లలమైన మాకు ఇచ్చారు. ఆ రోజులలో బ్రాహ్మణులంటే బ్రాహ్మణేతరులకు భయమో లేక భక్తోగాని ఎంతగా ఉండేదో పై ఘటనలద్వారా స్పష్టంగా వెల్లడి యగుతోంది.

ఆ రోజులలో బ్రాహ్మణేతరుల దొడ్లో ఆవు యీనిందంటే వారు తొలిరోజు జున్నుపాలను పుణ్యమనియు, ఆవు పాలు బాగా యిస్తుందనియు నమ్మి బ్రాహ్మణులకు పంపేవారు. దొడ్లో కూరపాదు కాయడం ప్రారంభిస్తే తొలిగా కాసినకాయను బ్రాహ్మణులకు పంపిన కూరపాదు బాగా చాలాకాలం వరకు కాస్తుందని నమ్మేవారు. ఇంతేకాదు. పాడి వున్న బ్రాహ్మణేతరులు పుణ్యమని బ్రాహ్మణులకు తాము వాడుకోగా మిగిలిన పాలు, పెరుగులను ఊరకే పంపేవారు.

ఆ రోజులలో బ్రాహ్మణేతరులలో చదువుకున్నవారు చాలా తక్కువని లోగడ చెప్పాను. అందువల్ల బ్రాహ్మణేతరులు కొన్ని సంస్కృత మాటలను సరిగా పలకగలిగేవారు కాదు.

మచ్చుకు బ్రాహ్మణులు అనే మాటనే తీసుకొందాం, చదువు సంధ్యలులేని అనేకమంది బ్రాహ్మణేతరులు బ్రాహ్మణులు అనే మాటాను బ్యాంబలు అనేవారు. కాస్త పదిమందిలో తిరగనేర్చిన చదువురాని బ్రాహ్మణేతర పెద్దలు కొందరు ఆ మాటనే బ్రామలు అనేవారు. వానాకాలపు చదువులు చదివిన బ్రాహ్మణేతరులు "బ్రాహమలు" అనేవారు. బ్రాహ్మణేతరులు యీ తప్పుడు ఉచ్చారణను విని బ్రాహ్మణులు నవ్వుకొనే వారే గాని వారి ఉచ్చారణను సరిచేయాలనే సద్భావనే బ్రాహ్మణులలో ఉండేదికాదు. శ్రద్ధగా చదువుకొనే బ్రాహ్మణేతర కుర్రవాడెవడైనా కాస్త స్వచ్ఛంగా మాట్లాడటానికి యత్నిస్తే కొంతమంది బ్రాహ్మణులు "ఏమిరా వెంకటప్పా! మా బ్రాహ్మణ కుర్రవానివలె స్వచ్ఛంగానూ, శుద్ధంగానూ మాట్లాడుతున్నావే? ఏమీ నీవు బ్రాహ్మణుడవు కావాలనుకొంటున్నావా?" అని ఎగతాళి చేసి నిరుత్సాహ పరచేవారు.

## 20

నాకు మొట్టమొదట తెలుగు నేర్పిన గురువులు పెద్దిభొట్ల శేషయ్య, పేరయ్యగార్లే. వీరిద్దరూ అన్నదమ్ములు. మా ఊరిలోని తద్దినాలు, దినాలు, పెండిండ్లు, ఏడూరులు, శాంతులు, అక్షరాభ్యాసాలు, మనుగుడుపులు (గర్భాదానాలు) మొదలుగు కార్యాలన్నీ యీ అన్నదమ్ములిద్దరే చేయించేవారు.

కాని రోజుకు మూడు గంటలు–సాయంకాలం రెండు గంటల నుండి 5 గంటల వరకు మాకు (పిల్లలకు) ఉచితముగా తెలుగు నేర్పేవారు.

మాది పెద్దూరు, అందువల్ల మా ఊళ్ళో ఏదో ఒక మూల తద్దినమో, దినమో, ఏడూరో, శాంతో–ఏదో ఒక కార్యం రోజూ తప్పక ఉండేది. అందువల్ల మా గురువులిద్దరూ ప్రొద్దున్నే లేచి కాలకృత్యాలు తీర్చుకొని ఊళ్ళోకి చెరి ఒక వైపుకు బయలుదేరేవారు. చదువుకొనే పిల్లలం మేము కూడా రెండు ముఠాలుగా చీలి వారి వెంట వెళ్ళేవాళ్ళం. అన్నగారి వెంట కొందరం, తమ్ముని వెంట కొందరం.

వారు తద్దినంగాని దినంగాని పెట్టించినపుడు వారికి యిచ్చే బియ్యం, పప్పు, చింతపండు, బెల్లం, నెయ్యి, పెరుగు, విస్తళ్ళు వగైరాలను నా బోటి గోచిపాత రాయుళ్ళు మా గురువులగారి అంగవస్త్రాలలో మూటలు కట్టుకొని మూటలను మా భుజాలమీద వేసుకొని ఒక చేతితో నేతి గిన్నెనుగాని పెరుగు గిన్నెనుగాని పట్టుకొని, రెండవ చేతితో మూటలను గట్టిగా పట్టుకొని గురువులు పెట్టిన బెల్లపు ముక్కను చప్పడిస్తూ కులుక్కుంటూ ఆ మూటలను గురువులగారి ఇంటికి చేర్చేవారము.

మా గురువు లిరువురు భోజనం చేసి కాసేపు పవళించి లేచి 2 గంటల నుండి 5 గంటల వరకు మాకు చదువు నేర్పేవారు. 5 గంటల తరువాత అన్నదమ్ములిద్దరు మర్నాటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడానికై ఊళ్ళోకి చెరి ఒక వైపుకు వెళ్ళేవారు.

# 21

ఆ రోజులలో సామాన్య ఆస్తిపాస్తులుగల బ్రాహ్మణేతర ఆసామి కూడా తద్దినంగాని, దినంగాని తప్పక పెట్టితీరాలి. పెట్టని వానిని బ్రాహ్మణులు గ్రామ పెత్తందారుల ద్వారా సంఘం నుండి వెలివేయింపచేసి వానిని నానా కష్టాలపాలు చేసేవారు. అందువల్ల ప్రతి బ్రాహ్మణేతర ఆసామి పాపం బ్రాహ్మణులకు జడిసి ఆర్థిక తాహత్తు ఉన్నా లేకపోయినా అప్పో సప్పోచేసి తద్దినము, దినము వగైరాలు తప్పక పెట్టి బ్రాహ్మణులను సంతృప్తి పరిచేవారు.

పెండ్లి అయిన మనిషి (ఆడ గాని మగవాడు గాని) చనిపోతే అతని తాలూకు వారు చనిపోయిన వానికి తప్పక దినం (శ్రాద్ధకర్మ) చేసేవారు. దినం పెట్టినపుడు 40 క్రొత్త అంగవస్త్రాలలో ఒక్కొక్క అంగవస్త్రంలో శేరు బియ్యం (1 1/2 కిలో) చొప్పున మూటలు కట్టి దినానికి వచ్చిన బ్రాహ్మణులకు తలా ఒకటి ఇచ్చి కొంత సంభావన (డబ్బు) కూడా ఇచ్చేవారు. ఆ బియ్యపు మూటలను "పాత్రాలు" అనేవారు. బ్రాహ్మణులెవ్వరూ రానపుడు మొత్తం పాత్రాలను పురోహిత బ్రాహ్మణుడే తీసికొనిపోయేవాడు. బియ్యంతో పాటు పురోహితునికి పప్పు, బెల్లం, చింతపండు, నేయి, పెరుగు, కూరగాయలు, డబ్బు వగైరాలు కూడా యిచ్చేవారు.

కాస్త తడిగల ముసలి బ్రాహ్మణేతరుడు చనిపోతే, ఇంటి పురోహితునికి భూదానము, గోదానము (ఆవును), సువర్ణదానము (బంగారము), చెప్పులు యిస్తూ తక్కిన బ్రాహ్మణులతోపాటు ఒక తాటాకుల గొడుగు, ఒక విసెన కర్ర, ఒక కొయ్య పీట, ఒక కంచు గ్లాసు, ఒక అంగవస్త్రము యిచ్చేవారు.

ఇంకా బాగా తడిగల ముసలి బ్రాహ్మణేతరుడు చనిపోతే వారి పేరుమీద బ్రాహ్మణ సంతర్పణ చేయబడేది. అంటే బ్రాహ్మణులకు విందు భోజనాలు పెట్టబడేవి. బ్రాహ్మణ సంతర్పణ ఉన్నదని తెలిస్తే, ఇక చూడండి! చుట్టు ప్రక్కల సుమారు 20 మైళ్ల దూరంలో ఉన్న ఊళ్ళనుండి కూడా బ్రాహ్మణులు పెద్దలు, మగ పిల్లలు భోజనానికి, సంభావనానికి పనికట్టుకొని ఎన్ని పనులున్నా మానుకొని పరుగులిడుతూ తండోపతండాలుగా వచ్చేవారు.

ముందుగా సంభావనాలు యివ్వటానికై బ్రాహ్మణులందర్నీ ఒక ప్రహరీ గోడగల దొడ్డిలోనికి పంపి గేటువద్ద ఇంటి పురోహితుడు, ఊరి పెత్తందారు- ఇద్దరూ నిలబడి పురోహితుని సలహా మేరకు, ఊరి పెత్తందారు బ్రాహ్మణులకు బేడ (12 పైసలు ఒక వెండి నాణెము) మొదలుకొని ఒక రూపాయి వరకు వారి వారి చదువులను బట్టి యిచ్చేవారట.

మా ఊరిలో జరిగే సంతర్పణ భోజనానికి మా ఊరికి దగ్గరలో ఉన్న శాయపురం అనే ఊరు నుండి ఎక్కువ మంది బ్రాహ్మణులు వచ్చేవారు. ఎందుకన ఆ ఊరిలో ఆనాడు అంతా బ్రాహ్మణులే ఉండేవారు. వారుచుట్టు ప్రక్కల ఊళ్ళల్లో ఎక్కడైనా దినంగాని, సంతర్పణగాని, జరిగినప్పుడు తప్పక హాజరయ్యేవారు. సంతర్పణ వార్త వినగానే

బ్రాహ్మణులకు ప్రాణాలు లేచి వచ్చేవి. పొడుముబుర్ర నిండా మద్రాస్ షణ్ముఖం ముక్కు పొడుమును నింపుకొని, దానిని రొంటిని దోపుకొని, నడుమును ఒక అంగవస్త్రంతో బిగించి, తలకొక అంగవస్త్రం చుట్టుకొని మరో అంగవస్త్రానికి బుడిచెంబును బంధించి దానిని భుజాన వేసుకొని యుద్ధానికి బయలుదేరే యోధులవలె సంతర్పణ భోజనంతో యుద్ధం చేయడానికై పరుగులిడుతూ సంతర్పణ జరిగే ఊరికి సకాలంలో చేరుకొనేవారు.

సంతర్పణలో బ్రాహ్మణులు ఎంత తృప్తిగా భోజనం చేస్తారో చనిపోయిన మనిషికి అంత తృప్తి కలుగునని బ్రాహ్మణ పండితులు సంతర్పణ చేయించే బ్రాహ్మణేతర ఆసామితో చెప్పి సంతర్పణను ఘనంగా చేయించమని అతనిని ప్రోత్సహించేవారు. బ్రాహ్మణేతర ఆసామి పండితుల మాటలు నిజమని నమ్మి అప్పో సప్పో చేసి శుద్ధమైన నేతితో రకరకాల పిండివంటలు (పప్పులు) కూరలు, పాలతో పాయసము, పులిహోరము మొదలగు పదార్థాలను బ్రాహ్మణ వంటవాళ్ళచేత చేయించేవాడు. ఆ రోజులలో పల్లెటూళ్లలోని రైతులు యీ రోజులలోలాగ పాలు, పెరుగు, కూరగాయలు వగైరాలను అమ్ముకొనేవారు కాదు. ఎవరి ఇంటిలోనైనా ఏదేని కార్యం వచ్చిందంటే తక్కినవారంతా తమ తమ తాహతు కొద్దీ పాలు, పెరుగు కూరగాయలు ఊరకే సప్లయి చేసేవారు, పాలు, పెరుగు చాలకపోతే గొల్లవారివద్ద గొఱ్ఱెల, మేకల పాలు, పెరుగు కొద్ది వెలకు కొనేవారట.

# 22

మా ఊరి బ్రాహ్మణులలో ఎక్కువమందికి కొద్దికొద్దిగా సొంత పొలాలు, పశువులు ఉండేవి. పొలాలు లేని బ్రాహ్మణులలో కొందరు పురోహితులుగానూ, కొందరు పూజారులుగానూ, కొందరు కరణాలుగానూ, కొందరు సిద్ధాంతులు గానూ, కొందరు నాటువైద్యులుగానూ, కొందరు భజన నేర్పే గురువులుగానూ, కొందరు బడిపంతుళ్ళుగానూ, కొందరు గజ్జి, చల్ది, కర్బాణి మొదలైన చర్మ జబ్బులకు మంత్రాలు పెట్టే వైద్యులుగానూ, కొందరు చదువులేని బ్రాహ్మణేతర ధనవంతుల వద్ద గుమస్తాలుగానూ, కొందరు భిక్షాందేహి అని అంటూ రోజూ మా ఊళ్ళోనూ, చుట్టుప్రక్కల గ్రామాలలోనూ అడుక్కుతినేవారుగానూ ఉండేవారు. కాని వారంతా బాగా భూమి బుట్ర, గొడ్లూ గోదలు ఉన్న బ్రాహ్మణేతర రైతుల కంటె ఎక్కువ సుఖజీవనం చేస్తూ ఉండేవారు. ఎందుకనగా వారంతా (బ్రాహ్మణులంతా) తమ తమ వృత్తులతోపాటు దినము, తద్దినము, పెండిండ్లు వగైరాలకు వెళ్ళి దక్షిణలు, సంభావనలు, పాత్రాలు పట్టేవారు. ఇంతేకాకుండా శాస్త్రాలలో బ్రాహ్మణ కులంలో పుట్టిన ప్రతివాడని బిచ్చమడుగుటకూ, దినము, తద్దినము వగైరాల సందర్భాలలో దానాలు పట్టుటకు యోగ్యుడని (అర్హతగల వాడని) వ్రాయబడి ఉంది. అందువల్ల బ్రాహ్మణుడు ఏ వృత్తిలో ఉన్నా సరే, దినము, తద్దినము, పెండ్లి వగైరాల సందర్భాలలో దాన, ధర్మాలు పట్టుచుండుట

వలన అతడు ఆర్థికముగా తక్కిన కులాల్లోని భూమి పుత్ర ఉండేవారి కంటె ఎక్కువ సుఖజీవనం చేస్తూ ఉండేవాడు.

ఆ రోజులలో దుక్కలాంటి నడి వయస్సుగల బ్రాహ్మణుడు మా ఊరిలో బిచ్చానికి గుడ్డ జోలి చంకకు తగిలించుకొని బయలుదేరితే, కాస్త ఆస్తిపాస్తులున్న ప్రతి బ్రాహ్మణేతర ఇల్లాలు తన ఇంటివద్ద అరుగుమీద చాపవేసి, బిచ్చానికి వచ్చిన బ్రాహ్మణుని చాపమీద గౌరవంగా కూర్చోబెట్టి గొప్ప వినయ విధేయతతో తాను సొంతంగా దంపిన బియ్యాన్ని దోసిలినిండా తెచ్చి ఆ బిచ్చానికి వచ్చిన బ్రాహ్మణుని గుడ్డ జోలిలో ఉంచి ఆయన అడక్కముందే తన దొడ్లో కాసిన ఏదేని కూరగాయను కోసుకొని వచ్చి ఇచ్చేది. ఎందుకనగా బ్రాహ్మణునికి ఏదేని వస్తువు దానం చేస్తే గొప్ప పుణ్యము కలుగుననే మూఢనమ్మకం ఆ రోజులలో బ్రాహ్మణేతరులకు ఉగ్గుపాలతోనే బోధింపబడేది.

కాని కూలీనాలి చేసుకొని గౌరవంగా బ్రతుకుతున్న ఆత్మాభిమానం గల ఒక ముసలి బ్రాహ్మణేతరుడు జబ్బుపడి కూలినాలి చేయలేని స్థితిలో ఆరోగ్యం బాగుపడువరకు గతిలేక ఇతరుల వద్దకు ఆర్థిక సహాయానికై కలిమిగల బ్రాహ్మణేతరుల లోగిళ్ళకు వెళితే వారు అతనిని నానా చివాట్లు పెట్టి సహాయం ఏమీ చేయకుండానే తమ లోగిళ్ళ ముందునుండి తరిమివేసేవారు. ఎందుకనగా బ్రాహ్మణేతర బిచ్చగానికి ఏవిధమైన దానం చేయకూడదనియు, చేస్తే చేసిన వార్కి పాపం తగులుతుందనియు కేవలం బ్రాహ్మణుడనే వానికొక్కనికే బిచ్చం పెట్టేవారిని తరింప చేయగల శక్తిగలదనియు శాస్త్రములలో వ్రాయబడి ఉందని బ్రాహ్మణ పండితులు వక్కాణించేవారు.

## 23

మా ఊరి మాదెగవారు మా ఊరికి సుమారు రెండు మూడు ఫర్లాంగుల (1/4 కి.మీటరు) దూరంలో చుట్టు గుడిసెలు వేసుకొని వాటి చుట్టూ మట్టి గోడలు పెట్టుకొని కందికంప తడికలను వాకిళ్ళకు తలుపులుగా కట్టుకొని కాపురంచేస్తూ ఉండేవారు. వారికి మంచినీళ్ళబావి ఉన్నట్లు నాకు గుర్తుకు రావడంలేదు. కాని మా ఊరిలో మున్సిఫ్‌గారి మేడకు పడమర వైపున బజారులోని మంచినీళ్లబావి వద్దకు బావికి దూరంగా కొంతమంది మాదెగవారు మంచినీటికై తమ కుండలను ఉంచేవారు. బ్రాహ్మణేతరులెవరైనా దయదలచి ఆ కుండల్లోనీళ్ళు పోస్తేపోసినట్లు, లేనట్టయితే ఆ కుండలు రోజులు తరబడి బావివద్దనే ఖాళీగా పడి ఉండేవి. నీళ్ళుపోసిన కుండలమీద మూతలుండేవి కావు. అందువల్ల కాకులు పిచ్చుకలు వగైరా పిట్టలు ఆ కుండల మీద కూర్చొని రెట్ట వేస్తూ ఉండేవి.

మాదెగవారు మా ఊళ్ళోకి రావాలంటే వానాకాలంలో మోకాటిలోతు రేగడ బురదలో కదం తొక్కుకుంటూ నడిచి రావలసి వచ్చేది. వారు మా ఊరి బ్రాహ్మణేతరుల బజారులలో కూడా భయపడుతూనే నడిచేవారు. ఇంతేకాదు. బ్రాహ్మణేతరుల బజారులలో కూడా

మాదెగవారు చెప్పులు తొడుక్కొనిగాని, గొడుగువేసుకొనిగాని వెళ్ళటానికి అనుమతి ఉండేది కాదు. కొన్ని ప్రాంతాలలో మాదెగ వారు ఇత్తడి పాత్రలను వాడటానికి వీలులేదు. వారు (మాదెగవారు) తలగుడ్డ చుట్టుకొని అగ్రకులాలవారి (బ్రాహ్మణులు, బ్రాహ్మణేతరులు) ముందుకు రాకూడదు. ఇంతేకాదు ఒకవేళ మాదెగవారు ఏదేని పనిమీద బ్రాహ్మణేతరుల బజారుకు వెళ్ళవలసి వస్తే వారు బజారు మధ్య నడవకుండా ఒక వైపుగా తొలిగి తొలిగి వంగి వంగి నడవాలి. ఎవరైనా బ్రాహ్మణేతరులు ఎదురుగా వస్తూ ఉంటే వారికి దూరంగా తొలిగిపోవాలి. ఇక బ్రాహ్మణ బజారుగుండా మాదెగవారు వెళ్ళవలసి వస్తే బ్రాహ్మణులెవరైనా బజారులో ఎదురుగా వస్తూ ఉంటే బజారులో వారు ఒక మూల నక్కి కూర్చుండి ఆ బ్రాహ్మణులు వెళ్ళిపోయిన తరువాత లేచి పోవాలి. కొంతమంది చాదస్తపు బ్రాహ్మణులు మాదెగవారిని చూచుట, వారితో మాట్లాడుట కూడా పాపమని ఎంచి వారికి చాలా దూరంగా ఉంటూ ఉండేవారు. మాదెగవారు కూడా ఆ రోజులలో బ్రాహ్మణ బజారుకు పోవటానికి సాహసించేవారు కాదు.

మా ఊళ్ళోని కమ్మవారు మొదలగు బ్రాహ్మణేతర రైతులు మాదెగవారిని పాలేర్లుగా (నౌకర్లుగా) పెట్టుకొని వారికి ముప్పొద్దుల అన్నంపెట్టి నెల నెలకు కొంత ధాన్యం కూడా ఇచ్చేవారు. వారికి అన్నం బయట వాకిట్లో పెట్టేవారు. అన్నం పెట్టేటప్పుడు వారి మట్టిమల్లలల్లో అన్నం, కూర వగైరాలను ఎత్తి పడేసేవారు. చల్ల కూడా ఎత్తి పోసేవారు. వారి మట్టి ముంతలలో త్రాగడానికి మంచినీళ్ళు కూడా ఎత్తి పోసేవారు. ఎందుకనగా పొరపాటున వారిని అంటుకొన్నా, వారికి పాత్ర తగిలినా, అంటు అని ఎంచి తాము స్నానము చేసేవారు. పాత్రలను తగలబెట్టి పసుపునీళ్ళు జల్లి తీసికొనేవారు. కొంతమంది పాలేళ్ళకు మట్టి ముంతలు కూడా ఉండేవికావు. అన్నం తింటూ ఉన్నప్పుడు వారికి దప్పిక అయితే ఎంగిలి చారతోగాని, దోసిలితోగాని మంచినీళ్ళు త్రాగేవారు. వారి చారలోగాని, దోసిలిలోగాని మంచినీరు ఎత్తిపోసేవారు, మంచినీళ్ళు త్రాగి వారు మరలా అన్నం తినేవారు.

చాలా మంది బ్రాహ్మణేతర రైతులకు కూడా మాల మాదెగల పొడగిట్టేది కాదు. పొరపాటున తమ పంచె చెంగు వారికి తగిలితే వెంటనే చన్నీళ్ళ స్నానం చేసి తీరేవారు. మాల మాదెగలు పొరపాటున బ్రాహ్మణేతరుల ఇత్తడి, రాగి పాత్రలను ముట్టుకొంటే, వాటిని మంటేసి తగలబెట్టి పసుపునీళ్ళు చల్లి తీసికొనేవారు.

బ్రాహ్మణేతరుల మట్టి పాత్రలను మాల మాదెగలు పొరపాటున ముట్టుకొంటే, వాటిని పగలగొట్టి దూరంగా పారవేసేవారు. మాల సాలీలు నేసిన గుడ్డను తడిపి తీసికొనేవారు.

మాల మాదెగలకు బ్రాహ్మణులకు పొత్తే ఉండేది కాదు. అందువల్ల బ్రాహ్మణులను ముట్టుకొనుటగాని, వారి పాత్రలను ముట్టుకోవడం గాని ఉండేది కాదు. మాల మాదెగలు దగ్గరకు వస్తేనే మైలపడిపోతామని బ్రాహ్మణులు వారికి చాలా దూరంగా ఉండేవారు.

కాని మాల మాదెగలు దంపిన బియ్యం, నూర్చిన ధాన్యం, సంచులలో పోసిన వడ్లు, నేసిన గోని సంచులు, నేసిన త్రాళ్ళు, పేనిన నులక, కోసుకొచ్చిన కూరగాయలు, చింతకాయలు, అరటికాయలు, వండిన బెల్లం, పండించిన ఉప్పు, కడిగిన పశువులు, గడ్డి వేసుకొని వచ్చిన బండి, ఎడ్లు, అల్లిన చాపలు, వాడిన పలుగు, పాఱ, తట్టలు, బుట్టలు మొదలగువాటిని బ్రాహ్మణులు, బ్రాహ్మణేతరులు తడపకుండానే వాడుకొనేవారు. వాటికి అంటులేదు. కాని మాల మాదిగల శరీరాలను అంటుకోకూడదు. అంటుకొంటే పాపము తగులునని శాస్త్రాలలో భగవంతుడే వ్రాసిపెట్టాడని బ్రాహ్మణ పండితులనే వారట.

మా ఊరిలో తూర్పు దేశస్తులుండేవారు. వారిని 'తూర్పువారు' అని అనేవారు. వారు శూద్రుల క్రింద లెక్కే. కనుక పొలాలున్న బ్రాహ్మణులు ఎక్కువగా తూర్పువారినే పాలేర్లుగా పెట్టుకొనేవారు. కాని బ్రాహ్మణేతర పాలేర్లు దొరకనపుడు మాత్రం పొలాలున్న బ్రాహ్మణులు తప్పనిసరియై మాల మాదెగలను పాలేర్లుగా పెట్టుకొనేవారు. అయితే వారికి బ్రాహ్మణేతర రైతులవలె ముప్పొద్దులు అన్నం పెట్టేవారు కాదు. కాని వారికి నెల నెల ధాన్యం జీతం క్రింద కొలిచేవారు. ఎప్పుడైనా పండుగల సందర్భంలో బ్రాహ్మణులు తమ మాదెగ పాలేర్లకు అన్నం పెట్టవలసి వస్తే, బ్రాహ్మణ ఆడవారు ఒక బాదమాకుల విస్తరిలో అన్నం, కూర వగైరాలనుపెట్టి తమ యిండ్లకు బయట బజారులో ఆ విస్తర్ని ఉంచేవారు. ఆ విస్తరి దగ్గరకు పాలేర్లు రాకముందే బ్రాహ్మణ ఆడవారు దూరంగా వెళ్ళిపోయేవారు. మాదెగ పాలేరు వచ్చి ఆ విస్తర్ని తన చినిగిన మురికి పైపంచెలో వేసుకొని ఏ చెరువుకట్టకో, ఏ కాల్వ కట్టకో తీసికొని పోయి అన్నం తిని చెరువులోనో కాల్వలోనో గ్రుక్కెడు నీళ్ళు త్రాగేవాడు.

ఆ రోజులలో ప్రతి బ్రాహ్మణ ఇంటి ఆవరణలో తప్పక బాదం చెట్టు ఉండేది. కాని బాదం చెట్టు బ్రాహ్మణేతరుల ఇంటి ఆవరణలో ఉంటే వారికి బాధలు తప్పవని బ్రాహ్మణ పండితులనేవారట. అందుకని బ్రాహ్మణేతరులు తమ ఇంటి ఆవరణలో బాదం మొక్క మొలిస్తే వెంటనే దానిని పీకి పారవేసేవారట. అదేవిధంగా నిమ్మ, అరటి చెట్లను కూడా బ్రాహ్మణేతరులు పెంచకూడదనియు, వారు విస్తట్లో అన్నం తినుట పాపమనియు, బ్రాహ్మణేతరులు, మాల మాదెగలు మోకాలి పైకే పంచెలు కట్టుకోవాలనియు, మోకాలి క్రిందకు వారు పంచెలు కట్టుకొనుట పాపమనియు, బ్రాహ్మణ పండితులు చెప్పేవారు. ఇంతేకాదు మాల మాదెగలు చొక్కాలు తొడుక్కోకూడదు. తొడుక్కొంటే, బ్రాహ్మణుల, బ్రాహ్మణేతరుల ఎదుటకు రాకూడదని కూడా బ్రాహ్మణ పండితులనేవారట.

బ్రాహ్మణుల ఇండ్ల వద్ద అన్నం తింటే పుణ్యమని కొంతమంది చాదస్తపు కలిమిగల బ్రాహ్మణేతరులు అనుకొని బ్రాహ్మణుని ఇంటికి భోజన సామగ్రిని యావత్తు పంపించి అక్కడ అన్నం తినేవాళ్ళు. అన్నం తిన్న తరువాత వారు తమ విస్తళ్ళను పారవేసి వచ్చి తాము అన్నం తిన్న చోటును ఆవు పేడతో అలికేవారు. తరువాత బ్రాహ్మణ ఆడవారు వచ్చి పసుపునీళ్ళు చల్లి ఆ చోటును శుద్ధిచేసేవారు.

బ్రాహ్మణుడు ఏదేని పనిమీద బ్రాహ్మణేతరుల ఇండ్లకు వచ్చినపుడు, అతనికి దప్పిక అయితే బ్రాహ్మణేతరుల మజ్జిగ త్రాగేవాడు. మజ్జిగ నిండుకున్నప్పుడు అతడు బ్రాహ్మణేతరులిచ్చిన మంచినీటిలో ఒకటి రెండు మజ్జిగ చుక్కలను వేయించుకొని త్రాగేవాడు. మజ్జిగ చుక్కలు పడిన నీళ్ళకు అంటులేదని బ్రాహ్మణ పండితులు శాస్త్రాలలో రాసి ఉన్నదని చెప్పేవారు.

"మాదెగవారు" అనేమాట యొక్క అసలు రూపము "మా తెగవారు". పూర్వ కాలంలో సవర్ణ హిందువులు-ముఖ్యంగా బ్రాహ్మణులు-మాదెగవారిని తమ తెగకు (గుంపుకు) చెందినవారేనని చెప్పుకొనేవారట. కాని కొన్నాళ్ళకు "మా తెగవారు" అనే మాట "మాదెగవారు"గా మారిపోయిందట. దీనికి తోడు ఆ రోజులలో కొంతమంది స్వార్థపరులైన సవర్ణ హిందువులు మాదెగవారికి సాంఘిక, ఆర్థిక, వైద్య, విద్యా సౌకర్యాలను లేకుండా చేసినందుకు వారు కడు బీదవారైపోయి చచ్చిన గొడ్డుమాంసం తినేవారుగా దిగజారిపోయారట.

అందువలన స్వార్థపరులైన కొంతమంది వైదిక బ్రాహ్మణ పండితులు మాదెగవారిని గొడ్డుమాంసం తినే నీచులు, వారిని ముట్టకూడదు, వారితో మాట్లాడకూడదు అని వారిని నిందించి ఆనాటి సంఘ పెద్దలను కూడగట్టుకొని వారిని(మాదెగవారిని) తమ సవర్ణ హిందువుల ఊళ్ళకు దూరంగా మురికికూపాలైన గూడాలలో ఉంచి వారిచేత నానా రకాల వెట్టిచాకిరీ చేయించుకోసాగారు.

ఆ రోజులలో పాపం మాదెగవారు సవర్ణ హిందువు యొక్క చచ్చినగొడ్ల చర్మాలతో వారికి (సవర్ణ హిందువులకు) చెప్పులు, మోటబానలు, పట్టెళ్ళు, వారి పసిపిల్లలకు జంధ్యాలు తయారు చేసి యిచ్చేవారు. ఇంతేకాదు వారు సవర్ణ వైదిక హిందువుల పీనుగులను కాల్చేవారు. వారు సవర్ణ హిందువుల చావుకబుర్లను ఇతర గ్రామాలలో ఉన్నవారి చుట్టాలకు చేర్చేవారు.

ఇటువంటి సేవాతత్పరులైన మాదెగవారిని గొడ్డుమాంసం తినే నీచులు అని నిందించి వారిని ముట్టకూడదు, వారితో మాట్లాడకూడదు, చివరకు వారిని చూడకూడదని శాస్త్రాలలో బ్రాహ్మణ పండితులు వ్రాశారు.

నిజమాలోచిస్తే యీ గొడ్డుమాంసం తినే మాదెగకులంలో పుట్టిన అరుంధతీదేవిని, నేడు వైదిక బ్రాహ్మణులమని చెప్పుకొనే వారి మూల పురుషుడు, వేశ్యాపుత్రుడు అయిన

వసిష్ట మహర్షి ఆమె గుణగణాలను మెచ్చుకొని పెండ్లాడాడని వైదిక బ్రాహ్మణ పండితులే వక్కాణిస్తున్నారు.

ఇంతేకాదు నేడు సవర్ణ హిందువుల పెండిండ్ల సందర్భాలలో బ్రాహ్మణ పురోహితుడు అరుంధతిని ఆదర్శ మహిళ అని చెప్పి ఆమెవలె మంచి నడత, గుణము కలిగి ఉండాలని పెండ్లికూతురికి, వసిష్టుని వలె కులమును పాటించక మంచి గుణము నడతగల అమ్మాయిని పెండ్లి చేసుకోవాలని పెండ్లి కొడుకుకు బోధించి వారిచేత ఒట్టొట్టి ప్రమాణాలను చేయిస్తాడు.

ఇక్కడ ఒక ముఖ్యమైన సంగతిని చదువరులు గుర్తుంచుకోవాలి. గొడ్డుమాంసం తినే మాదెగవారి ఆడపడుచైన అరుంధతీదేవికీ, వైశ్యాపుత్రుడునూ, ఆవుమాంసం లేనిది ముద్దెత్తనని అలిగిన వసిష్ట మహర్షికి పుట్టిన నేటి వైదిక బ్రాహ్మణులు మాదెగవారిని గొడ్డుమాంసం తినే నీచులని నిందించి వారిని సవర్ణ హిందువుల ఊళ్ళకు దూరంగా ఉంచడం వారు (సవర్ణ హిందువులు) తమను తామే అవమానించుకొనుట కాదా?

చూడండి. మన ఊళ్ళల్లో మాదెగలలో కూడా గొడ్డుమాంసం తినేవారు చాలా తక్కువే. ఆ తక్కువ మందికూడా చచ్చిపోయిన గొడ్డుమాంసమునే తింటారు. కాని వారు అమెరికా, ఐరోపా ఖండాలలోని ప్రజలవలె ప్రతిరోజు మాంసానికై వేలాది బ్రతికిఉన్న ఆవులను చంపుట లేదు. ఆ దేశాలలో రోజూ వేలాది ఆవులు మాంసానికై చంపబడుతున్నాయి. అక్కడ గొర్రెలు, మేకలు, కోళ్ళు ఉన్నప్పటికీ వాటి మాంసం ఆవు మాంసం తరువాతనే.

ఆ దేశాలలో ఆవు మాంసం తిననివారు అరుదుగా ఉంటారు. కనుక వారంతా బ్రతికి వున్న ఆవులను చంపి తినేవారే. కాని వారిని మనదేశపు సవర్ణ హిందూ పండితులు గొడ్డుమాంసం తినే నీచులు అని గాని అంటరానివారనిగాని, మాట్లాడరానివారనిగాని అనకపోగా పైపెచ్చు వారి దేశాలకు మన సవర్ణ హిందువులు బ్రాహ్మణులతో సహా అనేకమంది డబ్బు సంపాదనకై డాక్టర్లుగానూ, ఇంజనీర్లుగానూ, సంగీత విద్వాంసులుగానూ, భరత నాట్యాచార్యులుగానూ, లలితకళా విశారదులుగానూ, చిత్రకళా నిపుణులుగానూ, యోగులుగానూ, తత్త్వవేత్తలుగానూ, బాబాలుగానూ, పారిశ్రామికవేత్తలుగానూ పేర్లు పెట్టుకొని ఎగబడుతున్నారు.

ఇక్కడ ఒక సంగతిని చదువరులు మరచిపోరాదు. సవర్ణ హిందూ మేధావులు వగైరాలు మనదేశంలోని గొడ్డుమాంసం తినే మాదెగవారిని తమ గ్రామాలకు దూరంగా ఉంచి ఇతర దేశాలలోని గొడ్డుమాంసం–ఆవు మాంసం తినేవారికి సేవచేసి డబ్బుసంపాదించుకొనుటలో మనదేశపు సవర్ణహిందూ పండితుల దృష్టిలో తప్పుకానట్లుగా కన్పిస్తోంది.

ఇక్కడ ఒక సంగతిని చదువరులు గుర్తుంచుకోవాలి. మనదేశపు గొడ్డుమాంసం తినే మాదెగవారు ఆర్థికంగానూ సాంఘికంగానూ వెనుకబడి ఉన్నందువలనే వారిని గొడ్డుమాంసం

తినే నీచులని మన సవర్ణ హిందూ పండితులు వగైరాలు నిందిస్తున్నారు. ఎందుకన ఆవుమాంసం తినే డబ్బుగల విదేశస్థులకు మన సవర్ణహిందువులు ఊడిగము చేసి డబ్బుసంపాదించుటలో తప్పులేదని భావిస్తున్నారు. మరియు డబ్బు సంపాదనకు కులము, మతము, దేశము, ఆచారాలు, ఆహారాలు, అడ్డురావని మన సవర్ణ హిందూ సోదర సోదరీలు ప్రత్యక్షంగా రుజువు చేస్తున్నారు. కనుక నిజమైన ప్రజాస్వామ్యవాదులైన రాజకీయవేత్తలంతా, ఆర్థికంగానూ, సాంఘికంగానూ, విద్యావైద్య వగైరా వనరులలోనూ మనదేశంలో వెనుకబడి ఉన్న హరిజన, గిరిజన తదితర వెనుకబడిన వారందరకూ తగిన ఆర్థిక, సాంఘిక, వైద్య, విద్యా సౌకర్యాలను కల్పించి వారిని డబ్బుగల వారిగా చేసిన యెడల, మనదేశంలోని వైదిక బ్రాహ్మణులు వగైరా సవర్ణ హిందువులంతా వారిని తప్పక ప్రేమించి గౌరవించగలరని మనవి చేస్తున్నాను.

## 24

ఆ రోజులలో మాల మాదెగలవారు కూడా తమను హిందువులమని చెప్పుకొనేవారు. కాని పాపం వారిని సవర్ణ హిందువులు తమ దేవాలయాల లోనికిగాని, తమ బావుల వద్దకుగాని రానిచ్చేవారు కాదు. వారు వస్తే దేవుడు, బావులు మైల పడిపోతాయనేవారు. ఆ రోజులలో ఇంకా పల్లెటూళ్ళల్లో క్రీస్తుమత ప్రచారం బాగాలేదు. అందువల్ల మాల మాదెగలవారు కూడా బ్రాహ్మణులు, బ్రాహ్మణేతరులు మొదలుగు హిందువులవలెనే తమకు "రామయ్య–రామమ్మ, భూషయ్య–బూసెమ్మ, రంగయ్య–రంగమ్మ, సుబ్బయ్య–సుబ్బమ్మ, రత్తయ్య–రత్తమ్మ, సూరయ్య– సూరమ్మ, చంద్రయ్య–చంద్రమ్మ, మంగయ్య–మంగమ్మ మొదలగుపేర్లను పెట్టుకొనేవారు. కాని బ్రాహ్మణులు, బ్రాహ్మణేతరులు వారిన రామిగా–రామీ, బూసిగా–బూసీ, సుబ్బిగా–సుబ్బి, రత్తిగా–రత్తీ అని పిలిచేవారు.

బ్రాహ్మణులు, బ్రాహ్మణేతరులను "రామన్న–రామంమప్ప, సుబ్బన్న–సుబ్బమ్మప్ప, రంగన్న–రంగమప్ప, నాగన్న–నాగంమప్ప, వెంకన్న వెంకంమప్ప" అని పిలిచేవారు.

కాని మాల మాదెగల వారు బ్రాహ్మణేతరులను "రంగయ్య దొరగారు– రంగమ్మ దొరసానిగారు, భూషయ్య దొరగారు–బూసెమ్మ దొరసానిగారు, రత్తయ్య దొరగారు–రత్తమ్మ దొరసానిగారు, పెద్ద దొరగారు, పెద్ద దొరసానమ్మగారు, చిన్న దొరగారు–చిన్న దొరసానమ్మగారు. పెద్దబాబుగారు –పెద్దమ్మాయిగారు, చిన్నబాబుగారు–చిన్నమ్మాయిగారు అని భయభక్తులతో పిలిచేవారు.

ఇక బ్రాహ్మణులను మాల మాదెగలవారు, కమ్మ, కాపు వగైరా బ్రాహ్మణేతరులు "రామయ్య పంతులుగారూ, సుబ్బయ్య సిద్ధాంతిగారు, సోమయ్య సోమయాజులుగారు,

పున్నయ్య శాస్త్రిగారు, శేషయ్య శర్మగారు, మంగయ్య శ్రౌతులుగారు, అప్పయ్యశాస్త్రిగారు అని పిలిచేవారు. బ్రాహ్మణుల మగపిల్లలను కూడా ఇదేవిధంగా పిలిచేవారు.

బ్రాహ్మణుల సంగతి నాకు గుర్తులేదు. కాని బ్రాహ్మణేతరులు కొంతమంది చాదస్తపు మాదెగవారు మాత్రం మనదేశంలో మన మాలసాలీలు నూలుకు వరిగంజిని గాని, జొన్నగంజినిగాని పెట్టి నేసిన గుడ్డను తడిపి వాడుకొనేవారు. కాని బ్రాహ్మణులు, బ్రాహ్మణేతరులు యావన్మందీ హిందువులు, మాల మాదెగల వారితో సహా విదేశాలలో ముఖ్యంగా ఇంగ్లండులోని గుడ్డల మిల్లులలో ఆవు కొవ్వు క్షారంలో నానపెట్టిన నూలుతో నేయబడిన మల్లు, గ్లాసుకో, 1702 మల్లు వగైరా విదేశీ గుడ్డలను పెండిండ్లు వగైరా శుభకార్యాల సందర్భాలలో కూడా తడపకుండానే వాడుకొనేవారు. ఇక బ్రాహ్మణ వితంతువుల సంగతి చెప్పనక్కర లేదు. గ్లాసుకో, మల్లు వగైరా విదేశీగుడ్డలు సన్నగా ఉండి తడిపిన వెంటనే ఆరిపోవునని ఎంచి వాటినే కొని కట్టుకొనేవారు. వారు వాటిని కొన్నప్పుడు తడిపే వారు కాదు. తడపకుండా కట్టుకుంటున్నారని ఎవరైనా అడిగితే మనదేశంలో మన మాలసాలీలు నేసిన గుడ్డకు అంటుగాని విదేశాలలో ఎక్కడో మిల్లులలో తయారైన గుడ్డకు అంటులేదని శాస్త్రాలలో రాయబడి ఉందని బ్రాహ్మణ పండితులు చెప్పేవారట.

## 25

ఆ రోజులలో కమ్మ, కాపు, రెడ్డి, వెలమ, సాలి, మంగలి, చాకలి మొదలగు బ్రాహ్మణేతరులలో పెండ్లి అయిన మనిషి–ఆడదికాని, మగవాడుగాని చనిపోతే అతని ఇంటిపేరుగల వారంతా 15 రోజులపాటు విచార సూచకంగా మైల పాటించేవారు. మైలను 'సూదకము' అనేవారు. మైలకు గుర్తుగా తిరుచూర్ణపు బొట్టుకు బదులు నాము బొట్టును పెట్టుకొనేవారు. మైలను ముఖ్యంగా బ్రాహ్మణులు తు.చ.తప్పకుండా పాటించేవారు. మైలవాళ్ళను బ్రాహ్మణులు ముట్టుకొంటే తప్పక చన్నీళ్ళస్నానం చేసేవారు. మా బడిలో మైల పిల్లలను వేరుగా కూర్చోవెట్టేవారు. మైలలో పెండిండ్లు, అక్షరాభ్యాసము మొదలగు శుభ కార్యాలను చేసేవారు కాదు.

ఈ సూదకాన్ని బ్రాహ్మణులు పదిరోజులపాటు మాత్రమే పాటించేవారు. బ్రాహ్మణేతరులకు 15 రోజులు, మీకు 10 రోజులు ఎందుకని బ్రాహ్మణ పండితులను అడిగితే మా బ్రాహ్మణులు మీ బ్రాహ్మణేతరులవలె చదువు సంధ్యలులేని మూర్ఖులు, అజ్ఞానులు కాదు.వారికి చనిపోయిన మనిషికై బ్రాహ్మణేతరులకు కలిగినంత విచారముగాని, దిగులుగాని, దు:ఖంగాని కలుగదని బ్రాహ్మణ పండితులు వక్కాణించేవారట.

బ్రాహ్మణేతరులు 15వ రోజున తమ ఇంటిలో వాడుకొనే మంచాలు, పీటలు, పక్కగుడ్డలు మొదలగువాటిని తడిపేవారు. చనిపోయిన మగవాని పెండ్లాన్ని చాకళ్ళు ఒక మంచాన్ని వెల్లికలవేసి దానిమీద పండుకోబెట్టి ఏదేని చెరువుకట్ట వద్దకో, ఏదేని బావివద్దకో

తీసికొనిపోయి ఆమెను స్నానంచేయించి ఒక గోరంచు తెల్లని ముడికోకను కట్టుకోటానికి యిచ్చేవారు. ఆమె గాజులు పగలగొట్టేవారు. ఆమె పుస్తె (మంగళ సూత్రం) తెంచి వేసేవారు. ఆమె ముఖానగల కుంకుమ బొట్టు తుడిచి వేసేవారు. ఆమె రవికె తీసివేసేవారు. ఆ రోజు మొదలుకొని ఆమె రవికెను తొడుక్కోకూడదు. ఆమె రంగు గుడ్డలనుగాని, పువ్వులనుగాని ధరించరాదు. సువాసన ద్రవ్యాలను ఆమె రాసుకోకూడదు. పెండ్లి వగైరా శుభకార్యాలలో ఆమె పాల్గొనకూడదు. ఎవరైనా ఊరికి బయలుదేరేటప్పుడు ఎదురుగా ఆమె రాకూడదు. ఆమె చేతులకు రాగి గోట్లు తొడుక్కోవాలి. గాజులు తొడుక్కోకూడదు. ఈ ఘోరమైన దృశ్యాన్ని నేను మా పెద్దక్క పెనిమిటి చనిపోయినప్పుడు కృష్ణాజిల్లా బల్లిపర్రు గ్రామంలో చూచి ఆవురమని ఏడ్చాను. నాకు దగ్గరగా వున్న కొంతమంది పెద్ద మనుషులు నన్ను దగ్గరకు తీసుకొని ఓదార్చారు.

బ్రాహ్మణులలో ఇంతకంటే ఎక్కువ ఘోరమైన దురాచారం ఉండేది. పెనిమిటి చనిపోయినప్పుడు బ్రాహ్మణ వితంతువుకు (తాడు తెంపబడిన అమ్మాయికి) తల వెంట్రుకలు కూడా మంగలి చేత గొరగించి వేసేవారు. అందుకే పెనిమిటి చనిపోయిన బ్రాహ్మణ అమ్మాయిని ముండమోపి అని అనేవారు. ముండమోపి అంటే బోడిగుండు గల ఆడది అని అర్థం. బ్రాహ్మణ వితంతువులు నెలకొకసారి తప్పక తల గొరిగించుకోవాలి. పడుచు వితంతువులకుగాని బాల వితంతువులకుగాని మరల పెండిండ్లు చేసేవారుకాదు. ఎందుకనగా ఆడవాళ్ళు మరల పెండ్లి చేసుకొనుట పాపమని శాస్త్రాలలో ఉందని బ్రాహ్మణ పండితులు చెప్పేవారట. ఆ రోజులలో బాల్యవివాహాలు ముఖ్యంగా బ్రాహ్మణులలో ఎక్కువగా ఉండేవి. అందువల్ల బ్రాహ్మణ వితంతువులు కూడా ఎక్కువగా ఉండేవారు.

బ్రాహ్మణ వితంతువులు (విధవలు=ముండమోపులు) ఒంటిపూట భోజనంచేసి రెండవపూట ఏదైనా అల్పాహారం చేసేవారు. రెండవపూట చాలామంది బ్రాహ్మణ వితంతువులు వేపుడు పిండినిగాని తెపాళా రొట్టెనుగాని చేసుకొని తినేవారు. మా ఆఖరు గురువుగారైన కూనపల్లి సుందర రామయ్యగారి అత్తగారు (పేరు గుర్తులేదు) తాను తినగా మిగిలిన రొట్టెనుగాని వేపుడు పిండినిగాని వెంకటప్పా అని నన్ను పిలిచి నాకు పెట్టేవారు. ఆ రోజులలో మా ఊళ్ళోని వయస్సు మళ్ళిన బ్రాహ్మణ వితంతువులు మా ఊరి మెట్టచేలల్లోని పచ్చగడ్డిని తమ పశువులకు కోసుకొని వచ్చేవారు. మా గురువుగారి అత్తగారు కూడా గడ్డికై మెట్టపొలాలకు వెళ్ళేవారు. ఆ రోజులలో బ్రాహ్మణులలో ఆ పని తప్పుకాదు.

## 26

ఆ రోజులలో చాలా పల్లెటూళ్ళల్లో ఎక్కువగా కలరా (డోకులు, వాంతులు), మశూచికము (అమ్మోరు), తడపర, ఆటలమ్మ మొదలగు జబ్బులు వస్తూ ఉండేవి. ఆ

జబ్బులను అమ్మవారలు (దేవీదేవతలు) కోపం చెంది పంపుతూ ఉంటారనియు, మందులు వాడితే అమ్మవార్లకు కోపం ఇంకా ఎక్కువై పోతుందనియు, అందుకని ఆ జబ్బులకు మందులు వాడకూడదనియు చెప్పేవారు. కాని అమ్మవార్లను శాంతింపచేయడానికి కొలుపులు (జాతర్లు) కొలవాలని చెప్పి కొలుపులు కొలిచేవారు.

ఆ జబ్బులు ఊళ్ళో కన్పించగానే అమ్మవార్లకు కొలుపులకు కొన్నిరోజులు ముందుగా ముడుపులు కట్టేవారు. ముడుపులను మీదులు అని కూడా అనేవారు. ఊళ్ళో ఈ జబ్బులు కన్పించగానే ఊరిలోని ఇండ్లు కలిగిన వారందరూ తమ తమ ఇండ్ల వాకిళ్ళకు పచ్చి వేపమండల తోరణాలు కట్టుకొనేవారు. ఇండ్ల గోడలను పేడతో అలికించి సున్నం కొట్టించుకొనేవారు.

ఆ రోజులలో మా ఊళ్ళో ఆడ-మగ గణాచారులుండేవారు. గణాచారులంటే దేవతావేశముగల మనిషి. దేవతావేశము కలిగినపుడు గణాచారి వణుకుతూ ఏవేని మాటలు బిగ్గరగా కేకలు పెట్టుతూ అనేవాడు. ఆ మాటలను అమ్మవార్లే వానిచేత అనిపిస్తున్నారని జనం నమ్మేవారు.

మా ఊళ్ళో ఆ రోజులలో ఒక బ్రాహ్మణ ఆడ గణాచారి, ఒక బ్రాహ్మణ మగ గణాచారి, నలుగురు గవళ్ల గణాచారులుండేవారు. ఒకసారి ఒక గవళ్ళ గణాచారి దేవతావేశంలో ఒక కోడిపెట్ట మెడను పండ్లతో కసిక్కిన కొరికి దానిని దూరంగా విసిరి పారవేశాడు. అది అమ్మవారి మహిమ అని ప్రజలు నమ్మేవారు.

బ్రాహ్మణ గణాచారుల సంగతి నాకు గుర్తులేదు కాని బ్రాహ్మణేతర గణాచారులు అందరూ, మేళతాళాలవారు, డప్పులు వాయించేవారు, పంబలాళ్ళు కొలువుల సమయంలో కల్లు, నాటు సారాయి లెస్సగా త్రాగేవారు. ఆ సమయంలో త్రాగుట తప్పుగా ఎంచబడేదికాదు. పైపెచ్చు త్రాగుట తప్పనిసరి అనుకొనేవారు.

కొలుపులు కొలవటానికై మావూరిలో నడిబజారులో ఖాళీగాఉన్న చోటులో ఒక్కొక్క దేవతకు తాటాకులతో ఒక్కొక్క గుడిసె వేసేవారు. ఆ గుడిసెను పురము అనేవారు. ముత్యాలమ్మ, పోలేరమ్మ, గంగానమ్మ, మారెమ్మ, ఇనకుండంకమ్మ, కొర్లంకమ్మ, పోతురాజు మొదలగు దేవీ దేవతలకు విడివిడిగా పురాలు నిర్మించేవారు. వాటిలో అమ్మవార్ల మట్టిబొమ్మలను ఉంచి పదిరోజులపాటు పూజించేవారు.

ఆఖరురోజున అమ్మవార్లకు మ్రొక్కుబడులని దున్నపోతులు, మేకపోతులు, గొర్రెపోతులు, కోడిపెట్టలు వగైరాలు బలి యిచ్చేవారు. పందులు మాత్రం తినడానికి పనికి వస్తాయిగాని అమ్మవార్లకు బలి ఇవ్వడానికి పనికి రావనేవారు.

బలి యిచ్చిన దున్నపోతులను మాదెగవారు, మేకపోతులు, గొర్రెపోతులు, కోళ్ళు వగైరాలను బ్రాహ్మణేతరులు కమ్మ, కాపు, వెలమ, రెడ్డి, మంగలి, చాకలి, కుమ్మరి వగైరాలు తినేవారు. కొంతమంది బ్రాహ్మణేతరులు బలి ఇవ్వబడిన మేకపోతులు వగైరాల మాంసమును

ఇతర గ్రామాలలోవున్న తమ చుట్టాలకు కూడా పంపించేవారు. కొంతమంది బ్రాహ్మణేతరులు బలి ఇవ్వబడిన మేకపోతులు వగైరాల మాంసమును చిన్న చిన్న ముక్కలు ముక్కలుగా ఒక సన్నని త్రాడుకు గుచ్చి ఎండబెట్టుకొని కూరలు ఏమీ లేనినాడు వాటిని వండుకొని తినేవారు. ఆ ఎండిన మాంసపు ముక్కలను దోసకాయ వరుగువలె వాడుకొనేవారు.

బ్రాహ్మణులు అమ్మవార్లకు (దేవతలకు) బలి ఇచ్చే దున్నపోతులును మాదెగవారికి, మేకపోతులు, గొర్రెపోతులు వగైరాలను కుమ్మరి, చాకలి, కమ్మరి, సాలి వగైరా పనివాళ్ళకు ఉచితంగా ఇవ్వబడేవి. కాని బ్రాహ్మణ అమ్మవార్లకు ఎక్కువగా పిండి వంటలనే (పప్పులనే) ఆరగింపు చేసేవారు.

కొలుపులు చివరిరోజున ఒక చిన్న కొయ్య చక్రాల బండిని చేయించి దానిలో కొర్లంకమ్మ బొమ్మను పట్టుకొని ఒక పంబలాయన కూర్చుండేవాడు. ఆ బండిని "కొర్లంకమ్మ బండి" అనేవారు. ఆ బండిని మా ఊరిలోని వారు కొందరు మా ఊరి పొలిమేర వరకు మేళతాళాలతో లాక్కెళ్ళి అక్కడ రెండుమూడు మేకపోతులను కొర్లంకమ్మకు బలియిచ్చి కొన్ని కొబ్బరికాయలు కొట్టి ఆ బండిని ఆ బొమ్మని అక్కడ విడిచిపెట్టి వచ్చేవారు. అమ్మవారిని తృప్తిపరచి ఊరి పొలిమేర దాటించి వచ్చాము. ఇక మన ఊళ్ళో జబ్బులుండవని ప్రజలు నమ్మేవారు.

# 27

ఆ రోజులలో బ్రాహ్మణేతరులలోనూ మాల మాదెగలలోనూ ఎక్కువగా ఆడవాళ్ళకు దయ్యాలు పట్టేవనేవారు. ఆ దయ్యాలను వదిలించేవారిని 'భూత వైద్యులు' అనేవారు. ఆ రోజులలో 'చేబడులు' (ఇతరులను చంపడానికి చేసే క్రతువులు) కూడా ఎక్కువగా ఉ ండేవనేవారు. చేబడులు కూడా భూతవైద్యులే నయంచేసే వారట.

ఆ రోజులలో బ్రాహ్మణులు, కుమ్మర్లు, చాకళ్ళు భూతవైద్యం చేసేవారు. కమ్మ, కాపు, రెడ్డి, వెలమ, రాజు వగైరా బ్రాహ్మణేతరులకు పట్టే దయ్యాలను బ్రాహ్మణ భూతవైద్యులు, మాల మాదెగల వారికి పట్టిన దయ్యాలను కుమ్మరి, చాకలి భూతవైద్యులు వదిలించేవారట.

బ్రాహ్మణ భూతవైద్యుల సంగతి నాకు తెలియదు కాని కుమ్మరి, చాకలి భూతవైద్యులు మాత్రం దయ్యాలను వదిలించే సందర్భంలో లెస్సగా కల్లు, సారాయిలను త్రాగి దట్టంగా వేటమాంసం తినేవారట. సారాయి త్రాగి మాంసం తినంది దయ్యాలతో మేము పోరాడలేమని వారు చెప్పేవారట.

భూత వైద్యులు దయ్యాలు పట్టినవారిని పేము బెత్తాలతో అదేపనిగా చావబాదే వారట. దయ్యాలు పట్టినవని అనుకోనేవారు ఆ దెబ్బలకు తాళలేక దయ్యాలు పారిపోయేవని చెప్పుకొనేవారు. కాని దయ్యాలు పట్టుట అనేది ఒక రకపు జబ్బు అని నేటి డాక్టర్లు అంటున్నారు. ఆ రోజుల్లో భూత వైద్యులు సామాన్య ప్రజలను భయపెట్టి వారిని ఆర్థికంగా దోచుకొనేవారు.

# 28

ఆ రోజులలో తడిస్తేనూ, నలిగితేనూ, చినిగిపోయేవి, కాలితే మసై పోయేకాగితాల నోట్లు (కరెన్సీ నోట్లు) ఉండేవికావు. కాని తడిసినా, సామాన్యంగా కాలినా చెడిపోకుండా ఉండే రాగి, వెండి నాణేములు (బిళ్ళలు) ఉండేవి. వాటిని దమ్మిడీలు, అరకానులు, కానులు, అర్ధణాలు, బేడలు, పావలాలు, రూపాయిలు అనేవారు. దమ్మిడి, అరకానులు, కానులు, అర్ధణాలు, శుద్ధమైన నికార్సైన రాగితోను, బేడలు పావలాలు రూపాయిలు శుద్ధమైన వెండితోనూ చేయబడేవి.

అరకానీకి 1 1/2 దమ్మిడీలు, కానీకి 3 దమ్మిడీలు, అర్ధణాకి 6 దమ్మిడీలు, అణాకు 12 దమ్మిడీలు, బేడకు 24 దమ్మిడీలు, పావలాకు 48 దమ్మిడీలు, రూపాయికి 192 దమ్మిడీలు. దమ్మిడీ విలువ 1/2పైస, అరకానీ విలువ 3/4 పైసలు, కానీ విలువ 1 1/2 పైసలు, అర్ధణా విలువ 3 పైసలు, అణా విలువ 6 పైసలు, బేడ విలువ 12 పైసలు, పావలా విలువ 24 పైసలు.

ఆ రోజులలో దమ్మిడీల నాణెములు కోకొల్లలు. కోట్ల సంఖ్యలో ఉండేవి. మారక ద్రవ్యంగా ఎక్కువగా వాడుకలో యీ దమ్మిడీల నాణాలే ఉండేవి. సామాన్య ప్రజలు, కూలీనాలీ చేసుకొనే ప్రజలంతా జీవితావసర నిత్య వస్తువులను దమ్మిడీలతోనే కొనుగోలుచేసేవారు. చిల్లర వ్యాపారమంతా ఈ దమ్మిడీలతోనే జరిగేది.

ఆ రోజులలో కూలీలకు, చేతివృత్తుల వారికి, పాలేళ్ళకు వారి చాకిరీకి బదులు ఎక్కువగా ధాన్యమే కొలవబడేది. చాకలి, మంగలి, కుమ్మరి, కమ్మరి, సాలి, వడ్రంగి, మాదెగ, మాలసాలీ మొదలైన చేతిపనుల వారికి ఎక్కువగా ధాన్యమే (వడ్లుగాని, మొక్కజొన్నలుగాని, పచ్చజొన్నలుగాని, తమిదలుగాని, సజ్జలుగాని పరిగలుగాని) కొలవబడేవి.

ఆ రోజులలో పల్లెటూళ్ళల్లో పాటక జనం కోమటి దుకాణంలోని సరుకులను ఎక్కువగా ధాన్యం యిచ్చే కొనుగోలు చేసేవారు.

ఆ రోజులలో మగవానికి రోజుకూలీ తవ్వెడు (3/4 కిలో) ధాన్యంగాని, 2 అణాలు (12పైసలు) డబ్బులుగా ఇచ్చేవారు. పాటక జనం కోమటి దుకాణంలో 1 దమ్మిడికి (1/2పైసకు) చింతపండు, ఉప్పు, 2 దమ్మిడీలకు (1పైసకు) బియ్యంగాని, మొక్కజొన్నలుగాని, పచ్చజొన్నలుగాని, తమిదలుగాని, 2 దమ్మిడీలకు పప్పు, మసాలా దినుసులు, ఎండుమిరపకాయలు, 2 దమ్మిడీలకు కుంకుళ్ళు, కొబ్బరినూనె, ఆముదముగాని నువ్వుల నూనెగాని కొనుక్కొనేవారు. ఈ సరుకులతో ఆలుమగలు, ఒక బిడ్డ ముగ్గురూ ఒక రోజు కడుపునిండా తిండి తినేవారు. ఆ రోజులలో మాంసం కూడా చాలా చౌక.

ఆ రోజులలో పల్లెటూళ్ళల్లో పొయ్యిలోనికి పుల్లలను పాటకజనం కొనుక్కొనేవారు కాదు. ఎక్కడబడితే అక్కడ కావలసినంత ఎండుకంప మెట్ట పొలాల్లో ఉండేది. పాటకజనం దానిని ఏరుకొని తెచ్చుకొని వంట చేసుకొనేవారు. ఆ రోజులలో కూరగాయలు, మజ్జిగ వగైరాలను రైతులు పాటకజనానికి ఊరకే యిచ్చేవారు. పాటకజనం తమ రోజుకూలీలో (12 పైసలలో) కూడా 2-3 దమ్మిడీలు వెనకేసుకొనేవారట.

## 29

ఆ రోజులలో గింజలు (ధాన్యాదులు) కొలవటానికి కొన్ని కొలత పాత్రలుండేవి. అరగిద్ద, గిద్ద, అరసోల, సోల, తవ్వ, మానిక, అడ్డ, కుంచము, మరకము మొదలగు కొలత పాత్రలు ధాన్యం వగైరాలను కొలవడానికి ఉపయోగించేవారు. అరగిద్ద, గిద్ద, అరసోల, సోల, తవ్వ, మానిక, అడ్డ మొదలగు కొలత పాత్రలను ఎక్కువగా కొయ్యలతోనూ, కుంచం, మరకం ఇనుముతోనూ చేసేవారు.

20 కుంచాలుగాని 26 మరకాలుగాని ఒక బస్తా. 10 బస్తాలు ఒక పుట్టి, 2 అరగిద్దలు 1 గిద్ద, 2 గిద్దలు 1 అరసోల, 2 అరసోలలు 1 సోల, 2 సోలలు 1 తవ్వ, 2 తవ్వలు 1 మానిక, 2 మానికలు 1 అడ్డ, 2 అడ్డలు 1 కుంచం. ఆ రోజులలో ధాన్యాదులను తూచడానికి కాటాలుండేవి కావు. ఎంత ధాన్యాన్నైనా కోమట్లు కుంచంతోగాని మరకంతోగాని కొలిచేవారు. కొలిచినందులకు వారికి తగిన మజూరీ క్రింద ధాన్యమే యిచ్చేవారు.

| | |
|---|---|
| అరగిద్ద 50 గ్రాములు, | గిద్ద 100 గ్రాములు, |
| అరసోల 200 గ్రాములు, | సోల 400 గ్రాములు, |
| తవ్వ 800 గ్రాములు, | మానిక 1600 గ్రాములు, |
| అడ్డ 3200 గ్రాములు, | కుంచం 6400 గ్రాములు, |

ఆ రోజులలో కొన్ని వస్తువులు తూచి కూడా అమ్మేవారు. బెల్లం, చింతపండు, మిర్చి, కూరగాయలు మొదలైన వస్తువులు తూచి యిచ్చేవారు. తూయడానికి కొన్ని తూకపురాళు ్ళ ఉండేవి. పావు తులము, అర తులము, తులము, పలము, ఛటాకు, నవటాకు, సవాశేరు, అర్థశేరు, శేరు, అరవీశె, వీశె, మణుగు మొదలగు తూకపు రాళ్లు ఉండేవి. వాటిలో కొన్ని ఇత్తడి తోనూ, కొన్ని ఇనుముతోనూ చేసేవారు.

పావు తులము 3 గ్రాములు, అర తులము 6 గ్రాములు

తులము 12 గ్రాములు, నవటాకు 66 గ్రాములు,

| | |
|---|---|
| ఛటాకు 33 గ్రాములు, | అర్థ శేరు 130 గ్రాములు, |
| శేరు 260 గ్రాములు, | అర వీశె 650 గ్రాములు, |
| వీశె 1300 గ్రాములు, | మణుగు 10400 గ్రాములు, |

ఆ రోజులలో నేలను పాదాల (అడుగుల) తోనూ అంగలతోనూ కొలిచేవారు. త్రాడు, దారము, గుడ్డ వగైరాలను జాన, బార వగైరాలతో కొలిచి అమ్మేవారు.

ఆ రోజులలో సమయం తెలుసుకోవడానికి గడియారాలు పల్లెటూళ్ళల్లో ఉండేవి కావు. మా గ్రామంలో ఎవరింట్లోనూ గడియారం ఉన్నట్లు నాకు గుర్తులేదు. కొంతమంది ఉద్యోగస్తుల, ధనవంతుల ఇండ్లల్లో గోడ గడియారాలుండేవనే వారు. నేను మాత్రం మా ఊళ్ళో ఎవరింటిలో కూడా గడియారం చూడలేదు.

మా బడిలో గడియారం ఉండేదికాదు. కాని మా పాఠశాలలోని పాఠాలు, మా భోజనాలు, పాఠశాలను ప్రారంభించుట, విడిచి పెట్టుట మొదలగు పనులు మా బడి చావిడి చూరు నీడను బట్టే జరుగుతూ ఉండేవి. నక్షత్రాలు (చుక్కలు), కోడికూతలు, కొన్ని పక్షుల ఆరుపులు మొదలుగు వాటి ద్వారా కూడా సమయం తెలుసుకోబడేది.

## 30

ఆ రోజులలో నీరుల్లిపాయలు, వెల్లుల్లి పాయలు, మసాళాపొడి, ఎండి మిర్చి, మాంసము, కోడిగ్రుడ్లు, పుట్టకొక్కులు, ఉలవనీళ్ళు, వగైరాలను బ్రాహ్మణులు వాడేవారు కాదు. ఇవి బ్రాహ్మణులకు నిషేధాలు. ఇవి తినగూడని వస్తువులని యెంచి బ్రాహ్మణులు, ఎంత బీదవాళ్ళైనప్పటికీ వాటిని ముట్టుకొనేవారు కాదు. ఎవరైనా తింటే, వారిని సంఘం నుండి వెలివేసేవారు.

చుట్ట, బీడీ వగైరాలను కూడా బ్రాహ్మణులు ముట్టకూడదు. బహిరంగంగా ఎవ్వరూ చుట్టా, బీడీలు కాల్చేవారు కాదు. బ్రాహ్మణులు భోజనం చేయడానికి మామూలు దుస్తులను విడిచివేసి మడి బట్టలు కట్టుకొనేవారనే వారు. ఆ పని బ్రాహ్మణుల ఇండ్లల్లో జరిగేది. బ్రాహ్మణుల ఇండ్లల్లో జరిగే సంగతులను అబ్రాహ్మణులు తెలిసికోటానికి అవకాశం ఎక్కడిది? వారిని (అబ్రాహ్మణులను) ఇంటి గుమ్మం లోనికి కూడా వారు రానిచ్చేవారు కారు.

బ్రాహ్మణేతరులలో కూడా ఎక్కువమంది యువకులు తమ పెద్దవాళ్ళ ముందు చుట్టలు, బీడీలు కాల్చడానికి భయపడి చాటుగా కాల్చుకొనేవారు. కాని ముక్కుపొడుము మాత్రం బ్రాహ్మణులు, అబ్రాహ్మణులు అందరూ బహిరంగంగానే వాడేవారు. ముఖ్యంగా బ్రాహ్మణులలో ఎక్కువమంది ముక్కుపొడిని భోజనం చేసేటప్పుడు కూడా వాడేవారనే వారు.

పండితులు, కవులు, గాయకులు, పురోహితులు ముక్కుపొడిని గంట గంటకూ పీల్చంది ఉండలేకపోయేవారట.

ఆ రోజులలో కల్లు, సారాయి దుకాణాలు పల్లెటూళ్ళల్లో ఊరికి దూరంగా ఒక మూల ఉండేవి. పాటక జనం కల్లు సారాయిలను, చుట్టా, బీడీలను బహిరంగంగా త్రాగటానికి బ్రాహ్మణులకు, అబ్రాహ్మణులకు భయపడేవారు. పాటకజనం చాటుగా కల్లు, సారాయిలను చుట్టా, బీడీలు త్రాగేవారు. వారు కల్లు, సారాయిలను త్రాగి నిషా దిగిపోయేవరకు బయటకు వచ్చేవారు కాదు. ఎందుకన ఆ రోజులలో కల్లు, సారాయి, చుట్టా, బీడీలు త్రాగుట సంఘంలో చేయకూడని పనులుగా ఎంచబడేవి. కల్లు, సారాయిలను త్రాగినవారిని నేరస్థులుగా ఎంచి గ్రామ పెద్దలు వారిని శిక్షించేవారట. అందువల్ల బ్రాహ్మణులు, అబ్రాహ్మణులు, మాల మాదెగవారు మొదలగువారు ఎవరూ కూడా బహిరంగంగా స్వేచ్ఛగా కల్లు, సారాయిలు త్రాగేవారు కారు. కల్లు, సారాయి దుకాణాలు కూడా గ్రామంలో ఎక్కడో మారుమూల ఉండేవి. అవి అందరకు అందుబాటులో ఉండేవి కావు.

## 31

ఈ రోజులలో సినిమాలు, టెలివిజన్లు, రేడియోలు, వీడియోలు వగైరాలు ప్రజల కండ్లకు, చెవులకు, మనస్సులకు, హృదయాలకు ఎంత సంబరాన్ని కలిగిస్తున్నాయో ఆ రోజులలో ప్రజలకండ్లకు, చెవులకు, మనస్సులకు, హృదయాలకు వీధి భాగోతాలు, వీధి నాటకాలు, జంగం కథలు, తోలు బొమ్మలు, కీలుబొమ్మలు, పిచ్చిగుంటల వారి కథలు, జముకుల కథలు, పిట్టదొరలు, చెంచులు, గంగిరెద్దులవారు, బుడబుక్కలవారు మొదలగువారు అంత సంబరాన్ని కలిగించేవారు.

ఆ రోజులలో వీధి నాటకాలకు, వీధి భాగోతాలకు, మా కృష్ణాజిల్లా కూచిపూడి గ్రామం చాలా ప్రసిద్ధి చెందింది. ఆ గ్రామంలోని బ్రాహ్మణులు వీధి నాటకాలలో ఆడవాళ్ళ పాత్రలను (వేషాలను) ధరించి తమ అభినయంతో ఆడవాళ్ళను మరిపించేవారు.

వీధి నాటకాలను గొల్ల భాగోతులు, మాల భాగోతులు కూడా ఆడేవారు. సామాన్య ఆర్థిక వనరులుగల ప్రజానీకం ఎక్కువగా వీరిచేతనే నాటకాలు వేయించేవారు. ఎందుకన కూచిపూడి భాగోతులకయ్యే ఖర్చుకంటే వీరికి తక్కువ ఖర్చు అయ్యేది. ఆ రోజులలో మా ఊళ్ళో ఎక్కువగా దేవుని ఉత్సవాల సందర్భంలో వీధి నాటకాలుగాని, తోలు బొమ్మలుగాని దేవాలయాల ముందు నడిబజారులో పందిరివేసి ఆ పందిరిలో ఆడించేవారు. ఆ రోజులలో గ్రామాలలో కీలు బొమ్మల ప్రచారం కూడా ఎక్కువగా ఉండేది. నడిబజారులో పట్టపగలే కీలు బొమ్మలను ఆడించేవారు. ఆ బొమ్మలనాట్యం, చూచిన ప్రేక్షకులు (చూచేవారు) అప్పటికప్పుడే అక్కడికక్కడే తమకు తోచిన విరాళాలను ఇచ్చి వెళ్ళిపోయేవారు. ఆ రోజులలో గారడీవాళ్ళు కూడా ఎక్కువగా ప్రజలను ఆకర్షిస్తూ ఉండేవారు.

వీధి నాటకాలు, తోలుబొమ్మలు వగైరాలను ఆడించడానికి మా గ్రామంలో చందాలు వసూలు చేసేవారు. వీధి నాటకాలుగాని, తోలుబొమ్మలుగాని రాత్రి 9-10 గంటలకు ఆరంభమై తెల్లవారు జామున 4-5 గంటలకు ముగించేవారు.

ఆ రోజులలో ఈ రోజులలోని బుర్రకథల ప్రచారంవలె పల్లెటూళ్ళల్లో జంగం కథలు, పిచ్చిగుంటల వారి కథలు, జముకుల కథలు, తోలుబొమ్మలు, వీధి భాగోతాలు ఎక్కువ ప్రచారంలో ఉండేవి. జంగం కథలను జంగాలు, పిచ్చిగుంటల వారి కథలను హరిజనులు, తమ మాటల చాతుర్యంతో పాటకజనాన్ని ఉద్రూతలూగించేవారు. వారుచెప్పే వీరగాధలను విని ప్రజానీకం వీరావేశంతో ఊగిసలాడిపోయేవారు.

# 32

చదువరులారా! నేను మిమ్ములను ఇప్పుడు ఏడు పదుల యేండ్లనాటి కాలానికి తీసుకొని పోతున్నాను. అంటే డెబ్బై యేండ్లనాడు జరిగిన సంగతులను మీకు ఇప్పుడు తెలుపగోరుచున్నాను. 1914 ప్రాంతంలో నేను మా కనుమూరుకు దగ్గరగా ఉన్న కొత్త కురుమద్దాలిలో మా మేనత్త గుళ్ళపల్లి అంకప్పగారి భార్య బూసెమ్మగారి ఇంట్లో అన్నంతిని ఘట్టి సుబ్బారావు పంతులువద్ద ఉచితంగా ఇంగ్లీషు నేర్చుకోసాగాను. మా మేనత్తగారి కుటుంబం, మా కుటుంబం కంటే ఆర్థికంగా ఎక్కువస్థాయిలో ఉండేది. అందువల్ల మా ఇంటివద్ద తిండి సరిగా లేనందున నేను తిండికి మొకమాసిపోయి పనికి దొంగనై చదువనేవంకతో బాగా తింటానికై తమ ఇంటికివచ్చానని యెంచి, ఆమె, ఆమె కుమారులు నన్ను చాలా చులకనగా చూస్తూ నాకు పగటివేళ బడికి వెళ్ళటానికిగాని, పాఠాలు చదువుకోవడానికిగాని ఏమాత్రం అవకాశంలేకుండా ఇంటివద్ద ఆమె మనమణ్ణి ఎత్తుకొనేపనిని, పొలములో ఏదో ఒక పనిని రోజూ నాచేత చేయింపసాగారు. అందువల్ల నాకు పగటి వేళ బడికి వెళ్ళి చదువుకొనే అవకాశంలేనందున నేను రాత్రులందు సుబ్బారావు పంతులుగారి ఇంటివద్దనే చదువుకొని అక్కడే చాపమీద పండుకొనేవాణ్ణి.

ఒక రోజున మా మేనత్తగారు తన ఇద్దరు కోడండ్రతోపాటు నన్ను మూడవ రోకలితో వడ్లలో పోటువేయమని ఆజ్ఞాపించారు. వేయకపోతే అన్నం పెట్టదేమోనని భయపడి రోకలి తీసుకొని తడబడుతూ వడ్లల్లో పోటు వేయసాగాను. సరిగా వేయడం చాతకాక తడబడిపోయి పొరపాటున వడ్లను ఎగదోస్తున్న మా మేనత్తగారి చేతివేళ్ళమీద రోకలి పోటు వేయనే వేశాను. అప్పుడు మా మేనత్తగారు బిగ్గరగా శోకాలు పెట్టుతూ “ఓరి నీ జిమ్మలాగ! దొంగ గున్న! నా ప్రాణాలు తీయడానికి వచ్చావంట్రా! పాడు గున్నా! నీ తల పగల! ముదష్టపు గున్న!” అని ఎన్నో రకాలుగా తిట్టుతూ ఇంకా బిగ్గరగా ఏడ్వసాగారు.

ఇంతలో ఆమె ఏడ్పును విని ఆమె కూతురులిద్దరూ పరిగెత్తుకొని వచ్చి నన్ను రెండుదవడలమీద ఎడాపెడా వాయించి వీపుమీద రెండుమూడు గుద్దులువేసి “వెధవ గాడిద!

మా అమ్మని చంపడానికి వచ్చావంట్రా! వెధవ! పో! మీ ఊరు వెళ్ళిపో!! మా ఇంట్లో ఉండవద్దు'' అని ఇంటిలోనుండి బజారులోనికి నెట్టివేశారు. కాని నేను చదువు చెడిపోతుందేమోననే భయంతో వారి దెబ్బలు, తిట్లు తినికూడా వారి ఇల్లు వదిలి పెట్టలేదు. అందువల్ల నేను వారి ఇల్లు ఏవిధంగానూ వదిలిపెట్టేటట్టులేనని మా మేనత్తగారు నాకు చల్ది అన్నం, చల్ది కూర పెట్టి చాలీచాలని పలుచని చల్లను పోయసాగారు. ఆమె కుమారులు నాకు పగటి వేళ ఏమాత్రం తీరికలేకుండా పొలములోని పనులు నాచేత చేయింపసాగారు.

పగటి వేళ చదువుకోవడానికి ఏమాత్రం అవకాశం లేనందున నా చదువు ఏమాత్రం సాగటం లేదు. అందువల్ల నా పరిస్థితిని గురించి మా ఇంగ్లీషు మాస్టరయిన ఘట్టి సుబ్బారావుగారితో చెప్పుకొన్నాను. ఆయనగారు వెంటనే ఆ గ్రామంలో ఓ ముఠాకు పెత్తందారయిన గుళ్ళపల్లి రామబ్రహ్మంగారిని పిలిపించి నా పరిస్థితిని వారితో చెప్పగా మా ఇంటిలో తిండి తిని నీ ఇష్టమొచ్చినన్నాళ్ళు చదువుకోరా అని ఆయన నన్ను వెంటపెట్టుకొని తన ఇంటికి తీసుకొనిపోయి తన ఇల్లాలుతోనూ, తన కొడుకులతోనూ నా పరిస్థితి గురించి చెప్పారు. వారిద్దరూ నన్నెంతో ప్రేమతో ఆదరించారు. రామబ్రహ్మంగారు కాట్రగడ్డ సోదరుల పినతల్లి గుళ్ళపల్లి బాపమ్మగారి మామగారు. అప్పటి నుండి నాకు కాట్రగడ్డ సోదరులతో సంబంధం ఏర్పడింది.

నేను మర్నాడు గుడ్డలకై మా మేనత్తగారి ఇంటికి వెళ్ళి గుడ్డలుతీసుకొని బయలు దేరినప్పుడు నేను మా ఊరువెళ్ళిపోతున్నానని మా మేనత్త వగైరాలు అనుకొన్నారు. కాని నేను రామబ్రహ్మంగారి ఇంటివద్ద ఉంటున్నసంగతి తెలుసుకొని మా మేనత్తగారి కొడుకులు నన్ను ఆ గ్రామంనుండి వెళ్ళగొట్టాలని ప్రయత్నించారు. కాని రామబ్రహ్మంగారికి ఆ సంగతి తెలిసింది. ఆయనవారిని గట్టిగా మందలించగా వారు నా మీద దాడిచేయడం మానుకొన్నారు. నేను నాలుగు రోజులపాటు రామబ్రహ్మంగారి ఇంటిలోనే భోజనం చేశాను. తరువాత గ్రామంలో వారాల భోజనం ఏర్పాటు చేసుకొని రెండు సంవత్సరాల పాటు ఇంగ్లీషు వగైరాలు నేర్చుకొని 1916 ప్రాంతంలో విజయవాడ, కొత్తపేటలోని ఎస్.కె.పి.పి. హైస్కూలులో 8వ తరగతిలో చేరాను.

# 33

నేను విజయవాడలో కొత్తపేటలోని శివాలయంవీధిలో కురుమద్దాలి గ్రామ కాపురస్తులు పిన్నమనేని నాగయ్యగారి ఖాయిదా కొట్టులో ఉంటూ, పక్కనే ఉన్న ఒక మిలటరీ హోటల్లో రోజూ రెండుపూటలా భోజనానికి నెలకు 6 రూపాయలు ఇచ్చేవాణ్ణి. విజయవాడలోని ఖర్చులకై కురుమద్దాలి గ్రామ వాస్తవ్యులు పిన్నమనేని పెదసుబ్బయ్యగారు వగైరాలు ఆర్థికసహాయం చేశారు.

కొన్నినెలల తరువాత నేను కొత్తపేటలోని కంసాలివారి మేడలో ఉన్న కమ్మ విద్యార్థుల హాస్టల్లో చేరాను. కొన్నాళ్ళకు కమ్మ విద్యార్థుల హాస్టల్ గవర్నరుపేటలోని మందడం వారి మేడలోనికి మార్చబడింది. హాస్టల్‌కు కొవ్వెలమూడి గోపాలకృష్ణయ్య ప్లీడరుగారు అధ్యక్షులుగాను, పడమట వాస్తవ్యులు కొమ్మా పుల్లయ్యగారు కార్యదర్శిగానూ ఉంటూ ఉండేవారు. నేను హాస్టల్‌లో చేరిన తరువాత నన్ను సహాయ కార్యదర్శిగా తీసుకొని భోజనానికి నాకు సగం ఛార్జి చేశారు.

ఆ రోజులలో హాస్టల్‌లో ఒక్కొక్క విద్యార్థికి నెలకు భోజనానికి 6 రూపాయలు మాత్రమే అయ్యేవి. నలుగురు విద్యార్థులు ఉండటానికి సరిపోయే మేడమీద గదికి నెలకు ఐదురూపాయల అద్దెమాత్రమే ఉండేది. స్కూలు ఫీజుకూడా నెలకు 1 1/2-2 రూపాయలకు మించి ఉండేది కాదు. ఆ రోజుల్లో కాఫీ హెూటల్లో కాఫీ, టీ, ఇడ్లీ, రవ్వట్టు, పెసరట్టు, సేమియాల పాయసము మొదలైనవి ఉండేవి. అవి చాలా చౌకగా ఉండేవి. కాని నేను మాత్రం కాఫీ హెూటల్‌కు వెళ్ళేవాణ్ణి కాదు. ఎప్పుడైనా జతగాండ్రు బలవంతంగా తీసుకొని పోయినప్పుడు కూడా నేను కాఫీ, టీలను ముట్టుకొనేవాణ్ణి కాదు. ఇడ్లీ, రవ్వట్టు మాత్రమే తీసుకొనేవాణ్ణి. నేను తరచుగా బయట అమ్మే కొబ్బరి లౌజు, బఠాణీలు, వేయించి శనగపప్పు, బెల్లం, పునుగులు కొనుక్కుని తినేవాణ్ణి. ఒక కాణీకి (1 1/2 పైసలకు) ఒక అరడజను పునుగులుగాని, ఒక అరడజను కొబ్బరిలౌజు బిళ్ళలుగాని, చారెడు వేయించిన శనగపప్పు, గుప్పెడు బెల్లం వచ్చేవి. ఆ రోజుల్లో ఇవే నా చిరుతిండ్లు.

ఆ రోజులలో నేను 20 నెంబరు ఏడు గజాల (5 1/2 మీటర్లు) ముతకనేత జత కట్టు పంచెలను,నాలుగు గజాల (2 1/2 మీటర్లు) ముతకనేత జత పైపంచెలను మొత్తం అయిదు రూపాయలకు కొనుక్కొని సంవత్సరంపాటు కట్టుకొనేవాణ్ణి. నాకు సరిపోయే బారుచేతుల రెండు చొక్కాలను 1 1/2 రూపాయలకు కొనుక్కొని సంవత్సరంపాటు తొడుక్కొనేవాణ్ణి.

మా కుటుంబం 1912 లోనే కనుమూరునుండి గుడివాడ తాలూకా పైడి కొండలపాలెం (మా అమ్మమ్మగారి ఊరు) వెళ్లి అక్కడ ఉంటున్నది. అందువల్ల నేను విజయవాడ వెళ్ళాలంటే 1917-18 సంవత్సరాలలో 12 మైళ్ళు నడిచి గుడివాడ వెళ్ళి రైలులో వెళ్ళాలి.లేకపోతే వానాకాలంలో వీరంకిలాకులవద్ద రహదారి పడవలలో ఎక్కి వెళ్ళాలి. వేసవికాలంలో నేను, మా నాయన ఇద్దరం అన్నం మూటలు కట్టుకొని విజయవాడకు, బందరుకాల్వకట్టనే నడిచి వెళ్ళేవాళ్ళం. విజయవాడలో పనిచూచుకొని మరునాడు మరల నడిచే పైడికొండలపాలెం వచ్చేవాళ్ళం.

ఆ రోజులలో విజయవాడలో ఒకపూట భోజనానికి రెండు అణాలు (12 పైసలు) తీసుకొనేవారు. ఆ రెండు అణాలు పెట్టలేక మేము నాలుగు అన్నం మూటలు కట్టుకొని రెండురోజులపాటు తిని ఇంటికి చేరుకొనేవాళ్ళం. వానాకాలంలో రహదారి పడవకు వీరంకిలాకువద్ద నుండి విజయవాడకు మూడు అణాలు ఛార్జీమాత్రమే ఉండేది. అంటే 18 పైసలు ఒక్కొక్క ప్రయాణీకునివద్ద వసూలు చేసేవారు.

ఆ రోజులలో గుర్రపు బండ్లు, ఒంటెద్దు బండ్లు ఎక్కువగా ఉండేవి. కొందరు కలిమిగలవారు వాటిల్లో బాడుగ ఇచ్చి ప్రయాణం చేసేవారు.బాడుగు మైలుకు ఒక అణా (6 పైసలు) ఉండేది.

ఆ రోజులలో సైకిళ్ళు చాలా తక్కువగా ఉండేవి. లారీలు, బస్సులు లేనేలేవు. కాని చిన్నకారులను కొంతమంది కలిమిగలవారు కొని వాడుకొనేవారు. నాకు తెలిసిన వారిలో కాట్రగడ్డ సోదరులకు ఆ రోజులలో ఒక చిన్నకారు ఉండేది. కొంతమంది తెల్లదొరలు మోటారు సైకిళ్ళమీద తిరిగేవారు. మోటారు సైకిళ్ళను పల్లెటూరి ప్రజలు వింతగా ఎగబడి చూసేవారు. వాటిమీద ప్రయాణం చేసేవారిని గొప్ప అదృష్టవంతులని చెప్పుకొనేవారు.

ఆ రోజులలో కొంతకాలంపాటు వాడిన చిన్నకారు కొన్ని వందల రూపాయలలోనే వచ్చేది. కొత్తకారు నాలుగువేల రూపాయలకు లభించేది. మోటారు సైకిల్ వెల నాలుగువందల రూపాయల లోపలే ఉండేది. మామూలు సైకిల్ 50-60 రూపాయలలో వచ్చేది. ఆ రోజులలో కాట్రగడ్డ సోదరులలో పెద్దవాడైన దశరథరామయ్యగారు లండన్‌నుంచి తెచ్చిన బి.ఎస్.సి. సైకిల్‌మీదనే నేను, మరికొంతమందిమి సైకిల్ తొక్కటం నేర్చుకొన్నాము.

## 34

1919 ప్రాంతంలో నేను ఎస్.ఎస్.ఎల్.సి పరీక్ష తప్పి మరల దానినే చదువుతున్నాను. అప్పుడే మహాత్మాగాంధీజీ రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా నిరసన తెలపమని పిలుపు ఇచ్చారు. ఆ సందర్భంగా మహాత్మాజీ విజయవాడ వచ్చారు. వారి ఉపన్యాసాన్ని విన్న తరువాత నేను చదువు మానుకొని కాంగ్రెస్ కార్యక్రమంలో ప్రవేశించాలని నిర్ణయించుకొన్నాను. కాని కమ్మ విద్యార్థి హాస్టల్ ప్రెసిడెంట్‌గారైన కొవ్వెలమూడి గోపాలకృష్ణయ్య ప్లీడరుగారు నన్ను ఎంతో ప్రేమతో చూస్తూ నాకు ఆర్థిక సహాయం చేస్తూ ఉండేవారు. వారికి నేను చదువు మానివేసి కాంగ్రెస్ కార్యక్రమం ప్రచారం చేయడానికి నిర్ణయించుకొన్న సంగతి తెలిసి నన్ను తన ఇంటికి పిలిపించుకొని ఒక రోజు తన ఇంటిలో నిర్బంధంలో ఉంచి చదువు మానుకోవద్దని నయానా, భయానా నాకు నచ్చచెప్ప సాగారు. కాని నేను ఆయన బోధనలు

వినలేదు. అందుకని ఆయన కోపంతో నా చెంపలమీద ఎడాపెడా వాయించి ''పో వెధవ! అడుక్కుతింటూ పోతావులే'' అని ఇంటిలోనుండి బయటకు నెట్టివేశారు. నేను కమ్మ విద్యార్థి హాస్టల్‌కు చేరుకొన్నాను.

నేను విజయవాడలో చదువు ప్రారంభించిన్నప్పటినుండి మొగల్‌రాజపురం కాట్రగడ్డ సోదరుల ఇంటికి తరచుగా వెళ్ళేవాణ్ణి. వారి తండ్రిగారు గంగయ్యగారు, తల్లిగారు అక్కమ్మగారు ఇద్దరూ నన్ను ఎంతగానో ఆదరించేవారు. అక్కమ్మగారు నన్ను ''తమ్ముడూ, తమ్ముడూ'' అంటూ పిలిచేవారు. రఘురామయ్య, మధుసూదనరావు మొదలైనవారు నన్ను ''మామయ్య, మామయ్య'' అని ఎంతో గౌరవంగా పిలిచేవారు.

నన్ను కొవ్వెలమూడి గోపాలకృష్ణయ్యగారు కొట్టారని తెలిసికొని రఘురామయ్య, మధుసూదనరావుగారలు కమ్మ విద్యార్థి హాస్టల్‌కి వచ్చి నన్ను పరామర్శించి కాంగ్రెస్ కార్యక్రమమే చేయమని నన్ను ప్రోత్సహించారు.

నేను, నావలె చదువు మానుకొన్న మరికొంతమంది విద్యార్థులము కలిసి బందరులో భోగరాజు పట్టాభిరామయ్య, ముట్నూరి కృష్ణారావు, హనుమంతరావు వగైరాల వద్ద రెండు వారాల పాటు రాజకీయ విషయాలు నేర్చుకొని తూర్పు కృష్ణాజిల్లాలోని గ్రామాలలో కాంగ్రెస్ కార్యక్రమం ప్రచారంతో పాటు ఖద్దరు గుడ్డల మూటలు మోసుకొని పోయి కొన్నినెలలపాటు ఖద్దరు గుడ్డలు అమ్మాము. కానీ నేను సొంతంగా ఖద్దరు గుడ్డలను నేయించి అమ్మాలని నిశ్చయించుకొని జగ్గయ్యపేటనుండి ఇద్దరు మాలసాలీలను కొనివచ్చి పైడికొండల పాలెంలో గ్రామం మధ్యఉన్న మా ఇంటిలో సగభాగంలో వారిని ఉంచి వారిచేత వడుకునూలుతో ఖద్దరు చీరలు, ధోవతులు, చొక్కా గుడ్డలు నేయింపసాగాను. కానీ మా గ్రామంలోని కొంతమంది పెద్దలు మాలసాలీలు నేసిన గుడ్డలను తడపమని మమ్ములను ఒత్తిడి చేయసాగిరి. కాని మేము అందులకు సమ్మతించనందున ఊరిలోని మంచినీళ్ళ బావికి రావడానికి వీల్లేదని మాకు కబురుచేశారు.

అప్పుడు మా నాయన సలహా మేరకు మేము, మాల సాలీలు మా పొలంలో ఉన్న బావివద్దకు వెళ్ళడానికి నిశ్చయించుకొన్నాము. కాని ఇంతలో మా గ్రామానికి దగ్గరగా ఉన్న పైడిముక్కల గ్రామవాస్తవ్యులు ఇవటూరి లింగయ్య, అయ్యవార్లుగారి కుమారుడు రామయ్యగారు మా ఇంటికి వచ్చి తయారైఉన్న ఒక కుప్పడపు అంచు చీరను తన భార్యకై తడపకుండానే తీసికొని చంకనపెట్టుకొని బయలుదేరారు. అప్పుడు మా గ్రామపెద్దలు ఆయనతో మాలవాడు నేసిన చీరను తడప వద్దా అండీ అని ప్రశ్నించారు. అప్పుడు ఆయన విదేశాలలో ఆవుకొవ్వు క్షారంలో నానపెట్టిన నూలుతో తయారైన విదేశీ గుడ్డలను

తడపాలిగాని మన దేశంలో మన సాలీలు నూలుకు వరిగంజినిగాని, జొన్న గంజినిగాని పెట్టి నేసిన గుడ్డను తడపనవసరం లేనే లేదు అని గ్రామపెద్దలకు నచ్చచెప్పారు. అంతటి మా గ్రామపెద్దలు మమ్ములను బావినీళ్ళకు రానిచ్చారు. ఇంతేకాదు వారు నేను మాలసాలీలతో నేయించిన గుడ్డను తడపకుండానే కొనడం చేశారు.

ఆ రోజులలో విదేశాలనుండి వచ్చే మల్లు, గ్లాసుకో మల్లు, 1702 మల్లు వగైరాలను మన దేశస్థులు అన్ని కులాలు, అన్ని మతాల వారు తడపకుండానే పెళ్ళిళ్ళ సందర్భంలో కూడా వాడసాగారు. కానీ మనదేశంలో మాల సాలీలు నేసిన గుడ్డలు బ్రాహ్మణులు, బ్రాహ్మణేతరులే కాకుండా కొంతమంది చాదస్తపు మాదెగవారు కూడా తడిపి తీసుకొనేవారట.

## 35

1921 ప్రాంతంలో కృష్ణాజిల్లా గుడివాడ తాలూకా వీరంకిలాకుల వద్ద గవర్నమెంటువారు బందరు కాల్వ కట్టలమీద ఉన్న పచ్చగడ్డివేలం పాటలు పెట్టారు. నేను రైతులను వేలం పాటలు పాడవద్దని బోధింపసాగాను. ఇంతలో ఇద్దరు పోలీసులు, ఒక సబ్ ఇన్‌స్పెక్టర్ వచ్చి నన్ను అరెస్టు చేసి పామర్రు తీసుకొని పోయి సబ్ జైలులో ఉంచారు. మరునాడు మేజిస్ట్రేట్ ఒక నెల వాయిదా వేసి ఆ వాయిదా రోజుకు నన్ను హాజరుకమ్మని నన్ను విడిచిపెట్టారు. వాయిదా రోజున కొంతమంది కాంగ్రెస్ అభిమానులు నన్ను బ్యాండ్‌మేళంతో పైడికొండలపాలెంనుండి దారిలో ఉన్న గ్రామాలలో ఊరేగిస్తూ పామర్రు తీసుకొని పోయారు. మేజిస్ట్రేట్ నన్ను విచారించి నాకు 6 మాసాల కఠిన శిక్ష విధించి రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపించాడు. జైలులో సర్దార్ పృధ్వీసింగ్ వగైరా విప్లవ వీరులుండేవారు. నేను పృధ్వీసింగ్‌గారివద్ద హిందీ నేర్చుకొనే అవకాశం లభించింది. పృధ్వీసింగ్‌గారు జైలు పాఠశాలలో నాకు, మరికొంతమంది రాజకీయ ఖైదీలకు ఉదయం 8 గంటలనుండి 11 గంటల వరకు హిందీ నేర్పేవారు. మరల సాయంకాలం రెండు గంటలనుండి నాలుగు గంటల వరకు తన అండమాన్ జీవితగాథను ఇంగ్లీషులోనూ, హిందీలోనూ చెప్పేవారు. ఆయనను అండమాన్ దీవులలో 1 1/2 గజము పొడవుగల 3/4 గజము వెడల్పుగల చిన్న ఇరుగు గదిలో ఉంచేవారట. చలికాలంలో చన్నీళ్ళను పిచికారుతో ఒక అరగంటసేపు ఆయన శరీరంమీద కొట్టేవారట. ఆయన చలికి తట్టుకోలేక స్పృహ తప్పిపోయేవారట. తన కేసును గురించి నిజం చెప్పమని ఆయన చేతుల పదివ్రేళ్ళ గోరులవద్ద గుండుసూదులను గుచ్చేవారట. కడుపునిండా తిండి పెట్టేవారు కాదట. స్నానము ఉండేది కాదట. గుడ్డలు కూడా చాలినన్ని ఉండేవి కాదట. ఆయన తన కష్టగాథను చెప్తుతున్నప్పుడు ఆయనకు మాకు కూడా కండ్లవెంట బొటబొటా కన్నీళ్ళు కారేవి. మహాత్మాగాంధీజీ

అహింసాత్మక సత్యాగ్రహంలో విశ్వాసాన్ని ప్రకటించిన తరువాత అండమాన్ దీవులనుండి ఈయనను, మరికొంతమంది విప్లవకారులను రాజమండ్రి సెంట్రల్ జైలుకు మార్చారట.

ఆ రోజులలో ప్రతి ఖైదీకి ఎడమకాలికి ఒక ఇనుప కడియాన్ని వేసి మెడలో ఒక అల్యూమినియం బిళ్ళమీద శిక్షించిన తేదీ, విడుదల తేదీ వేసి కట్టేవారు. బ్లాకులలో ఖాళీ లేనప్పుడు ఆ ఇనుప కడియాలలో సన్నని ఇనుప తీగను దూర్చి 10-15 మందిని గొడ్లను దాయను కట్టినట్లు బయట దేరా వేసి కట్టేవారు. రాత్రులందు కాలకృత్యాలకు వారు పడే బాధ ఇంతంత కాదు.

జైలులోకి వెళ్ళగానే ముందుగా 10-15రోజుల వరకు ప్రతి ఖైదీని క్వారన్‌టిన్‌లో **(Quar antine)** ఉంచి వైద్య పరీక్ష జరిపి తరువాత జైలులోనికి పంపేవారు. జైలులోకి వెళ్ళగానే మామూలు గుడ్డలను మూట కట్టించి దానిమీద ఖైదీ నెంబరు వేసి ఒక గదిలో భద్రపరిచేవారు. ప్రతి ఖైదీకి రెండు మట్ట లాగులు, రెండు బనీన్లు, రెండు గోచీలు, రెండు గజం బారు, అర్థగజం వెడల్పు గల తుండ్లు, రెండు కుళ్ళాయి టోపీలు, రెండు గజాల బారు, 3/4 గజం వెడల్పుగల ఒక జనపనార పట్టా, ఒక కంబళి, ఒక మట్టి మల్ల, ఒక మట్టి ముంత ఇచ్చేవారు.

ప్రతి ఖైదీకి రోజు మొత్తానికి 2 1/2 (15పైసల) రేషన్ (భోజన సామాగ్రిని) ఇవ్వాలి కాని రేషన్ ఇచ్చే డిప్యూటీ జైలర్, హెడ్ వార్డర్ ఇద్దరూ కలిసి రేషన్‌లో కొంత తగ్గించి పూర్తిగా ఇచ్చినట్లు లెక్కలు చూపించి తగ్గించిన రేషన్ డబ్బును తాము ఆరగించేవారు.అందువల్ల ఖైదీకి రేషన్ ఏమాత్రం సరిపోయేదికాదు.

రేషన్‌ను సప్లయ్ చేసే కాంట్రాక్టుదారులు కూడా తడిసిన, ముక్కిపోయిన చౌకబారు బియ్యం, చింతపండు, కారం, ఉప్పు, కందులు వగైరాల నాసిరకం వస్తువులను ఎక్కువ ధరలకు సప్లయ్‌చేసేవారు. అప్పుడప్పుడు అన్నంలో చిన్న చిన్న మేకులు, పురుగులు ఉంటూఉండేవి. కందిపప్పుకు బదులు పుచ్చిపోయిన రాళ్ళుగల కందులను ఉడకేసి తొక్కి దానిలో చాలీ చాలని చింతపండు, కారం, ఉప్పు ఏదైనా కూరగాయముక్కలు-గుమ్మడి, బొప్పాయి- వేసి ఇనుప పీపాలలో పులుసు చేసేవారు. అది చుట్టానికి నల్లగా ఉండి చిలుమూరి ఉండేది. దానికి మేము "దేవతా పులుసు" అని పేరు పెట్టాము. ఆ పులుసుకూడా చాలినంత ఉండేది కాదు.

ఉదయం 7 గంటలకు ఖైదీల ప్రాంతాలను బట్టి కొందరకు వరిగంజి, కొందరకు జొన్నగంజి, కొందరకు తమిద గంజి, కొంచెం కొంచెం కంది పచ్చడి ఇచ్చేవారు. ఆ గంజిలో కూడా ఉప్పు చాలినంత ఉండేది కాదు. ఆ గంజి కూడా చాలినంత ఇచ్చేవారుకాదు. కంది పచ్చడిలో చింతపండు, ఉప్పు, కారం చాలా తక్కువగా ఉండేది. కాని కాలే కడుపుకు గంజే పానకం అన్నట్లు మేము గతిలేక ఆ గంజిని అమృతంలాగా త్రాగేవాళ్ళం.

అన్నము చిన్న చిన్న ముద్దలుగా కొట్టి ఇనుపమంచాల బల్లలమీద ఉంచేవారు. అందువల్ల ముద్దలకు అడుగుభాగాన ఇనుముయొక్క ఎర్రని చిలుము అంటుకొనేది.అది

తినడానికి ఇష్టపడేవాళ్ళం కాము. ఆ చిలుము పట్టిన అన్నమును తీసివేసి తక్కిన చాలీచాలని ముద్దను ఆ దేవతాపులుసుతో తినేవాళ్ళం.కొన్నాళ్ళవరకు ముద్ద చాలేదికాదు. కానీ తరువాత సరిపోయినట్లుండేది. మజ్జిగ ఇచ్చేవారు కాదు, స్నానానికి నీళ్ళు చాలినంతగా ఉండేవి కావు.ఖైదీలకు ఇచ్చే గోనెపట్టాలు, కంబళ్ళనిండా కావలసినన్ని నల్లులుండేవి. రాత్రులందు నల్లులు బారులు తీర్చి జైలుగోడలకు ఎగబ్రాకేవి. రాత్రులందు మాకు సరిగా నిద్ర ఉండేది కాదు.

జైలులో ఒక్కొక్కరూ ఉంటానికి చిన్నచిన్న గదులుగల బ్లాకులు, 70-80 మంది ఉ ంటానికి పెద్ద పెద్ద బ్లాకులు ఉండేవి. ప్రతి గదిలోనూ ఒక్కొక్క ఖైదీని ఉంచేవారు. ఎక్కువ మంది చిన్న గదులలో ఉంటానికి ఇష్టపడేవారు కారు. అందుకని ఎక్కువమంది ఖైదీలు సందడిగా ఉంటుందని పెద్ద బ్లాకులలో ఉంటానికి ఇష్టపడేవారు.

చిన్న గదిలో రాత్రిపైట ఉచ్చకు, పెంటకుగాను ఒక మట్టి పిడత ఉండేది. పెద్ద బ్లాకులో పాయఖాన దొడ్డి ఉండేది.రాత్రులందు అది తగని పాడుకంపు కొట్టేది. దానికి తోడు ఖైదీలు దొంగతనంగా తెప్పించుకున్న చుట్టలు, బీడీలు కాల్చేవారు. నాబోటి ఖైదీలకు ఈ రెండూ గిట్టేవి కావు. మా అవస్థ చెప్పడానికి వీల్లేదు. నాబోటి వాళ్ళం ఎక్కువగా సింగిల్ రూమ్‌లోనికి వార్డెన్‌ను బతిమాలుకొని మార్పించుకొనేవాళ్ళం.

జైలులో కొందరు మోట లాగేవారు. కొందరు కొబ్బరి నూనె గానుగను తిప్పేవారు. కొందరు రాతి తిరుగళ్లమీద జొన్నలు, రాగులు విసిరేవారు. కొందరు పాయఖానా దొడ్లను బాగుచేసేవారు. కొందరు గుడ్డలు ఉతికేవారు. కొందరు తోటపని చేసేవారు. కొందరు ఖైదీలకు గుడ్డలు నేసేవారు. కొందరు ఖైదీలకు దుస్తులుకుట్టేవారు. కొందరు బ్లాకులను ఊడ్చేవారు.

జైలులో జన్మశిక్ష ఖైదీలకు తెల్లని డ్రస్సు ఇచ్చి వారిని తక్కువశిక్ష ఖైదీల చేత జైలుకు బయట, లోపల పనిచేయించడానికి నియమిస్తారు. జన్మశిక్ష ఖైదీని "కాన్విక్టు వార్డర్" అని అంటారు. అంటే నేరస్తుడయిన వార్డరు.అసలు వార్డర్లు బయటనుంచి వస్తారు. వారికి ఖాకీ రంగు డ్రస్సు ఇస్తారు. జైలులో కాన్విక్టు వార్డర్లకు భోజనము నివాసము బాగా ఉ ంటాయి. వారికి మామూలు వార్డర్లతో సమానమైన సౌకర్యాలుంటాయి. వారి జైలుశిక్ష కూడా కొంత తగ్గింపబడుతుంది. కాన్విక్టు వార్డర్లు బజారుకువెళ్ళి కావలసిన సరుకులను కొని తెస్తూ ఉంటారు. రాత్రులందు వారు వంతులు వంతులుగా బ్లాకులకు కావలి కాస్తూ ఉంటారు. ప్రతి గంటకు హెడ్ వార్డర్ ప్రతి బ్లాకువద్దకు తనిఖీకి వచ్చినప్పుడు కాన్విక్టు వార్డర్ "అంతా బాగున్నది" అని ఇంగ్లీషులో చెప్పాలి. ఇంగ్లీషురాని కారణాన, కాన్విక్టు వార్డర్ "హాల్ ఈజ్ హెల్" అనేవాడు. అంటే హాలు నరకంలాగా ఉన్నది అని అర్థం వచ్చును. కానీ మన రాజకీయ ఖైదీలు కాన్విక్టు వార్డర్లను ఎగతాళి చేస్తూ వారితో పాటు

తాముకూడా "హాల్ ఈజ్ హెల్" అని గట్టిగా అనేవారు. వారితో పాటు కాన్విక్టు వార్డర్లు కూడా "హాల్ ఈజ్ హెల్" అని ఇంకా గట్టిగా అరిచేవారు.

జైలులో కొందరు మంగలి పనిచేసేవారు.ఆ రోజులలో వారికి పీపా ఇనుపరేకులను సాన పట్టించి క్షౌవరం చేయమని ఆ సానపట్టిన రేకులను ఇచ్చేవారు. కానీ రాజకీయ ఖైదీలమైన మేము మాత్రం జైలులో పీపా రేకుల కత్తులతో గడ్డాలు చేయించుకొనేవారము కాదు. గడ్డాలు, మీసాలు పెంచుకొని బయటకు వచ్చేవాళ్ళం.గడ్డాలు చేయించుకొనందులకు జైలు సూపరింటెండెంట్ కాళ్లకు బేడీల శిక్ష విధించేవారు. మేము శిక్షను అనుభవించడానికి ఒప్పుకొనేవాళ్ళమే కాని పీపా రేకు కత్తులతో గడ్డాలు చేయించుకోడానికి సమ్మతించేవాళ్ళం కాము.

జైలుకువెళ్ళినందుకు నాకు హిందీ నేర్చుకొనే అవకాశం పృధ్వీసింగ్‌గారివద్ద లభించింది. బయట అవకాశం ఉంటే హిందీని వృద్ధి పరచుకోవాలనే సంకల్పం జైలులోనే కలిగింది. నేను విడుదలయ్యేరోజున నా హిందీ గురువుగారైన పృధ్వీసింగ్‌గారిని కౌగిలించుకొని కన్నీటితో వారి చేతులను తడిపి ఆయన ఆశీర్వాదాన్ని పొంది దు:ఖపూరిత హృదయంతో బయటకు అతి కష్టంమీద వచ్చాను.

## 36

నేను జైలునుండి ఇంటికి వచ్చాను. కొన్ని రోజుల వరకు మా తల్లిదండ్రులు, మా అన్నలు నన్ను బాగానే చూశారు. కానీ నేను చదువు మానివేసి సోమరిగా తిరుగుతున్నానని మా అన్నలకు లోలోపల కష్టంగా ఉండుట నేను గ్రహించిన నాకు ఎక్కడకైనా వెళ్ళి హిందీని చదువుకోవాలని కోరిక కల్గింది. ఒకరోజున మా నాయన్ని అడిగి నాలుగు రూపాయలు తీసుకొని ఇంటి వద్ద చెప్పకుండా పై గుడ్డలతో పైడికొండలపాలెం నుండి బయలుదేరి కాలినడకతో విజయవాడ రైల్వేస్టేషన్‌కు చేరి 'ఆంధ్రపత్రిక'కొని చదువుకోసాగాను. అందులో నెల్లూరులో దక్షిణ భారత హిందీ ప్రచార సభ తరుపున ఒక హిందీ ప్రచారశిక్షణ కేంద్రం ఆరుమాసాల పాటు జరుపబడుననియు, దానిలో చేరే విద్యార్థులకు ఒక్కొక్కరికి నెలకు నాలుగు రూపాయల ఉపకారవేతనము ఇవ్వబడునన్న ప్రకటన చదివి వెంటనే నెల్లూరుకు రెండున్నర రూపాయలతో రైలు టిక్కెట్టు కొని మద్రాసువెళ్ళే రైలులో ఎక్కి నెల్లూరుకు బయలుదేరాను. అదే సమయంలో విజయవాడనుండి గుంటూరుకువెళ్ళే ఒక ప్యాసింజర్ రైలు బయలుదేరి మధ్యలో పడిపోయింది.దానిలో 70మంది అక్కడికక్కడే చనిపోయారు. ఇంకా చాలా మందికి బలమైన గాయాలు తగిలాయట. ఈ ప్రకటన నేను ఇంటి నుండి బయలుదేరిన రెండవ రోజున పత్రికలలో వెలువడింది.

నేను విజయవాడలో రైల్వేస్టేషన్‌లో కూర్చున్నప్పుడు మా ఊరివారిద్దరు నన్నుచూచి ఎక్కడకురా అని అడిగినప్పుడు ఎక్కడకులేదని చెప్పి నేను వారికి కనబడకుండా తప్పించుకొనిపోయి నెల్లూరు పయనమయ్యాను. కానీ నేను గుంటూరు బండిలో ఎక్కి ఉంటానని అనుకొని నేను కూడా చనిపోయానని మా ఇంటికివెళ్ళి మా తల్లిదండ్రులతోనూ, మా మిత్రులతోనూ చెప్పారట. వారు నిజమేనని నమ్మారట. ఎందుకనగా నేను 6 మాసాలవరకు ఇంటికి గాని, మరెక్కడకు ఉత్తరం రాయలేదు.అందువల్ల నేను చనిపోయి ఉంటానని మా తల్లిదండ్రులు వగైరాలు గట్టిగా నమ్మసాగారట.

మాకు నెల్లూరులో మోటూరి సత్యనారాయణ, ఉత్తరప్రదేశ్ నివాసి అయిన రామ్ భరోసే గారలు హిందీ నేర్పేవారు. మా పాఠశాల దెయ్యాల మేడ అని ప్రసిద్ధి చెందిన ఒక పక్కా భవనంలో ఉండేది. దానిలోనికి కాపురానికి వచ్చిన వారిలో ఎవరో ఒకరు జబ్బుపడి చనిపోతూ ఉండేవారట.అందువల్ల దానిలోనికి అద్దెకు ఎవరూ రాకపోవుట వలన ఆ రోజులలో దాని అద్దె చాలా తక్కువగా ఉండేది. అందుకని మా హిందీ ప్రచారక శిక్షణ కేంద్రానికి దానిని తక్కువ అద్దె అని తీసికొన్నారట.

కొన్ని వారాలపాటు ఉన్న తరువాత మాలో కొందరు జబ్బుపడ్డారు. ఎందుకనగా ఆ భవనం మూడు ప్రక్కల పెద్ద మురుగుకాల్వ నిత్యము ప్రవహిస్తూఉండేది. దాని మురికిగాలికి తోడు మా భవనంలోని పాయఖానదొడ్డి వాసన, ఈ రెండింటివల్ల మా ఆరోగ్యం దెబ్బతిన్నది. అందుకని విద్యార్థులము వంతులు వంతులుగా ఆ మురుగు కాల్వను, పాయఖానా దొడ్డిని రోజూ శుభ్రం చేయసాగాము. అప్పటినుండి మేమంతా ఆరోగ్యంగా ఉండసాగాము.

నెల్లూరులో నాకు నెలకు నాలుగు రూపాయల ఉపకార వేతనం ఇచ్చేవారు. ఆ రోజులలో నెల్లూరులో భోజన హోటల్లో రెండుపూటల భోజనానికి నెలకు 7 రూపాయలు తీసుకొనేవారు. కానీ నా వద్ద ఉపకార వేతనం నాలుగు రూపాయలు తప్ప అదనుగా ఒక్క దమ్మిడీకూడా లేదు. అందువల్ల ఒక బ్రాహ్మణ హోటల్ యజమానురాలిని బ్రతిమాలుకొన్నాను. ఉదయం 12 గంటలకు ఒక్కపూట భోజనానికి నెలకు 3 1/2 రూపాయలు తీసుకొంటానికి ఆమె అంగీకరించింది. మిగతా 1/2 రూపాయితో సాయంకాలం రోజూ ఒక కాణీకి వేయించిన శెనగపప్పు, బెల్లం కొనుక్కొని తినేవాణ్ణి. ఈ రకంగా రెండు మాసాలు గడిచెను. కాని నేను ఒక్కపూటనే రెండుపూటల భోజనం తినివేస్తున్నానని హోటల్ యజమానురాలి కొడుకు తల్లికి చెప్పి నాకు అన్నం పెట్టడం మాన్పించి వేశాడు.

ఇక గతిలేక నేనూ మా గురువుగారైన రామ్ భరోసేగారి అనుమతి తీసికొని పాఠశాల భవనంలో ఒక మూల సొంతంగా వంట చేసికొని తినసాగాను. నాలుగు రూపాయలతోనే

ఒక నెల రోజులపాటు రెండు పూటల తిండి తినాలి. అందుకని నేను 3 1/2 రూపాయలతో నెలకు సరిపోయే బియ్యం, కట్టెలు, ఉప్పు, ఒకేసారి కొని మిగతా 1/2 రూపాయితో రోజుకు ఒక కాణీకి ఏదేని ఆకుకూర కొనుక్కొనేవాణ్ణి. కాణీ అంటే 1 1/2 పైసలకు సమానము. కారంగాని, చింతపండుగాని, మజ్జిగగానీ కొనడానికి డబ్బులు లేవు. అందువల్ల చప్పిడికూరలో ఉప్పు వేసుకొనేవాణ్ణి. మజ్జిగకు బదులు గంజి పోసుకుని తినేవాణ్ణి. ఈ రకంగా నాలుగుమాసాలు వండుకొని తిని హిందీ చదువుకొన్నాను. నేను ఇంటివద్ద చెప్పకుండా పైబట్టలతో ఇంటినుండి బయలుదేరి వచ్చానని లోగడ చెప్పాను. రెండవ జత గుడ్డలు లేనందున పైపంచె కట్టుకుని కట్టుపంచి ఉతికి ఆరేసేవాణ్ణి. అది ఆరినతరువాత దానిని కట్టుకొని పైపంచెని, చొక్కాను ఉతికి ఎండవేసేవాణ్ణి.

నాకు పక్కకు దుప్పటిగానీ, జమఖానాగానీ, పరుపుగానీ, కంబళిగానీ లేదు. గచ్చుమీద తాటాకుల చాపవేసుకొని చదువుకొని పడుకొనేవాణ్ణి. ఆరుమాసాలు ఈ రకంగా జీవితం గడిని హిందీని నేర్చుకొన్నాను. ఆరుమాసాల పాటు ఎవ్వరికీ ఉత్తరం రాయలేదు. మా గురువుగార్రైన రామ్ భరోసేగారు ఎన్నోసార్లు నా చిరునామా అడిగినా నేను చెప్పలేదు. అందువల్ల ఒకసారి నేను జబ్బుపడినప్పుడు కూడా వారే నన్ను ఆదరించారు. అప్పుడు కూడా చదువు చెడిపోతుందేమోననే భయంతో వారు పదే పదే అడిగినా నేను నా చిరునామాను చెప్పలేదు. మోటూరి సత్యనారాయణగారికి నా యందు అంత ప్రేమ ఉండేది కాదు. వారికి నా సంగతి తెలుసునో లేదో నాకు తెలియదు. వారికి నాయందు సానుభూతి ఉండేది కాదు.

హిందీ ప్రచార శిక్షణ పూర్తిఅయిన తరువాత నేను ఇంటికి వస్తున్నానని ఇంటికి ఉత్తరం వ్రాయగా నా ఉత్తరం చూచి నేను చచ్చిపోయానని చెప్పిన పెద్ద మనుషులు మా తల్లిదండ్రులతో ఆ ఉత్తరంలోని వ్రాత నాది కాదనియు ఎవడో మిమ్ములను ఏడ్పించడానికి వ్రాసి ఉంటాడనియు చెప్పాడట. కానీ కొంతమంది నా జతగాండ్రు ఆ దస్తూరి నాదేనని మా తల్లిదండ్రులతో చెప్పి వారిని ఓదార్చారట. నేనింటికి వెళ్ళడానికై మా గురువుగారు రామ్ భరోసేగారివద్ద నాలుగు రూపాయలు చేబదులుగా తీసికొని వారి ఆశీర్వాదమును, అనుమతిని పొంది 2 1/2 రూపాయలతో నెల్లూరునుండి విజయవాడకు రైలు టిక్కెట్టుకొని బయలుదేరి విజయవాడ చేరుకొన్నాను. విజయవాడలో హోటల్‌లో 2 1/2అణాలు ఇచ్చి (15 పైసలు) భోజనంచేసి వీరంకిలాకులకు పడవకు రెండు అణాలు (12 పైసలు) (22 మైళ్ళకు) ఇచ్చి వీరంకిలాకుల వద్ద మరునాడు ఉదయం దిగి పైడికొండలపాలెం వెళ్ళాను. చచ్చిపోయిన నేను ఇంటికి వస్తున్నానని తెలిసికొని నన్ను చూట్టానికి నా జతగాండ్రు, గ్రామంలోని ఇతరులు మా ఇంటి వద్ద గుమిగూడి ఉన్నారు. వారు నేను ఇంటికి రాగానే నన్ను ఒక వింతవస్తువుగా చూడసాగారు. నా మిత్రులు నన్ను అభినందించారు. మా

తల్లిదండ్రులు, మా అన్నలు, తమ్ముళ్ళు, చెల్లెండ్రు మొదలైనవారి సంతోషం చెప్పడానికి వీల్లేదు. కానీ నేను చచ్చిపోయానని చెప్పిన పెద్ద మనుషులు రెండురోజుల తరువాత నావద్దకు వచ్చి "నీవు కూడా చచ్చిపోయావని స్టేషన్‌లో ఎవరో చెప్పార్రా అబ్బాయి" అని నన్ను అభినందించి వెళ్ళారు.

# 37

నేను హిందీ చదువుకొని వచ్చానని తెలిసికొని మా పైడికొండలపాలెం గ్రామానికి దగ్గరగా ఉన్న పెనుమచ్చ గ్రామ వాసి, విద్యాభిమాని, దేశాభిమాని, వేదాంతి అయిన దండమూడి పూర్ణయ్య చౌదరిగారు తమ గ్రామంలో హిందీ నేర్పడానికై నన్ను తమ గ్రామం తీసికొని వెళ్ళారు. మొదట 10 మంది యువకులు నా వద్ద హిందీ నేర్చుకోసాగారు. నాకు నెలకు మొత్తం 10 రూపాయలు ఇచ్చేవారు. కానీ పొయ్యిలోనికి కట్టెలు, కూరగాయలు, మజ్జిగ వగైరాలను ఉచితంగా ఇచ్చేవారు. ఆ పది రూపాయలు ఆ రోజులలో (1922 ప్రాంతంలో) నేను, మరొక విద్యార్థి ఇద్దరం ఒకపూట గోధుమ రొట్టె, రెండోపూట అన్నం, కూర కడుపునిండా తినడానికి సరిపోయేవి. కొన్ని నెలల తరువాత ఆ గ్రామంలోని 80 మంది 10-20 యేండ్ల కుర్రవాళ్ళు ఒక్కొక్కరు నెలకు ఒక రూపాయ చొప్పున ఇచ్చి నా వద్ద హిందీ నేర్చుకోసాగారు.

ఒక సంవత్సరం తరువాత నేను హిందీలో ఉన్నతవిద్యను అభ్యసించాలని మొదట కాశీవెళ్ళి నాలుగు  మాసాలకు తరువాత అలహాబాద్‌లో యమునానది ఆవలి ఒడ్డున శ్రీ పురుషోత్తమదాస్ టాండన్‌గారు స్థాపించిన హిందీ విద్యా పీఠంలోచేరి శ్రీ వియోగి హరిగారి వద్ద ఆరు మాసాలు హిందీ నేర్చుకొని అహ్మదాబాద్‌లోని సబర్మతి నది ఒడ్డున మహాత్మాగాంధీగారు స్థాపించిన సబర్మతి సత్యాగ్రహ ఆశ్రమం చూచి తిరిగి పెనుమచ్చ వచ్చాను.

ఆ రోజులలో కాశీ, అలహాబాద్, అహ్మదాబాద్ వంటి పట్టణాలలో హోటల్‌లో పూటకు భోజనానికై 2 1/2 అణాలు (15 పైసలు) తీసికొని తిన్నన్ని గోధుమ రొట్టెలు, బంగాళాదుంపల కూర, రెండు గుప్పెళ్ళ వరి అన్నము పెట్టి దానిలోనికి సరిపడ గట్టి పెరుగు వడ్డించేవారు. హోటల్‌లో రెండు పూటల నెల భోజనానికి 6 రూపాయలు మాత్రమే తీసుకొనేవారు. మామూలు చాయ్ (టీ) దుకాణంలో ఒక అణాకు (6 పైసలు) అరడజను తాజా తాజా పూరీలు, వాటిలోకి సరిపడా బంగాళదుంప కూర పెట్టేవారు. నలుగురికి సరిపోయే గట్టి పెరుగు రెండు అణాలకు (12పైసలకు) ఇచ్చేవారు. ఆ రోజులలో విజయవాడనుండి కాశీకి రైలు ఛార్జీ 15 రూపాయల ప్రాంతంలో ఉండేది.

నేను పెనుమచ్చులో ఆశ్రమ పద్ధతిలో ఒక పాఠశాలను నడపాలని యత్నించగా కొన్నికారణాల వల్ల నా కోరిక నెరవేరనందున కృష్ణాజిల్లా చిన్న కళ్ళేపల్లిలో కొన్ని నెలలపాటు హిందీ నేర్పడానికి వెళ్ళాను. అక్కడనుండి హిందీ నేర్పడానికై గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా మైనేనివారిపాలెం వెళ్ళాను. అక్కడ కొన్నినెలల పాటు హిందీ నేర్పిన తరువాత రేపల్లె తాలూకా తూర్పుపాలెం గ్రామంలో హిందీ నేర్పడానికి వెళ్ళాను. అక్కడ ఒక సంవత్సరం హిందీ నేర్పి మరల మైనేనివారిపాలెం వచ్చాను.

ఈ గ్రామంలో 1925లో బొబ్బా బసవయ్యగారి మూడవ కుమార్తె బసవమ్మకు నాకు పెండ్లి జరిగింది. మా పెండ్లి సందర్భంలో కొంతమంది మిత్రులు, కొంతమంది నా శిష్యులు మాకు కొన్ని బంగారు నవర్సులను చదివించారు. ఆ రోజులలో నవర్సు ఖరీదు 12–13 రూపాయలకంటే ఎక్కువ లేదు. ఖద్దరు గజము ఖరీదు నాలుగు అణాలు(24 పైసలు) వడ్ల బస్తా 4–5 రూపాయలు మాత్రమే. బియ్యం బస్తా 8–10 రూపాయలు మాత్రమే. వెన్న శేరు (250 గ్రాములు) 5 అణాలు (25 పైసలు). ఒంగోలుజాతి మూడు సంవత్సరాల కోడెదూడ ఖరీదు 80–90 రూపాయలు. అప్పట్లో ఇది పెద్ద ధర అనేవారు. పూటకు రెండు మూడు లీటర్ల పాలు ఇచ్చే ఆవు ఖరీదు 15–20 రూపాయలుండేది.

నేను 1927 వరకు అత్తగారి ఇంటివద్దనే ఉంటూ నా ఇల్లాలికి తెలుగు, హిందీ భాషలు నేర్పి 1928లో రేపల్లె తాలూకా బెల్లంవారిపాలెంలో కొన్ని నెలలు, తెనాలి తాలూకా అమృతలూరులో కొన్నినెలలపాలు హిందీ నేర్పి 1929లో తెనాలి శివారు అయితా నగర్‌లో ఆలూరి వెంకట్రాయుడు,అలూరి వెంకటసుబ్బయ్య (చక్రపాణి), నన్నపనేని పెదవీరయ్యగార్ల ప్రోత్సాహంతో 20మంది యువకులకు హిందీ నేర్పసాగాను. వారు నెలకు 40 రూపాయలు ఇచ్చేవారు. ఆ రోజులలో అది పెద్దజీతం కింద లెక్క. ఆ రోజులలో హైస్కూలులో పనిచేసే బి.ఎ., బి.ఇడి. హిందీ పండితులకు నెలకు 30 రూపాయలు జిల్లా బోర్డు వారు ఇచ్చేవారు.

## 38

1929 ఆఖరులో గుంటూరు జిల్లా బోర్డు అధ్యక్షులయిన జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరిగారు నన్ను రేపల్లె హైస్కూల్లో హిందీ పండితునిగా నియమించి వెళ్లి చేరమని నాకు ఆర్డరు కాగితం అయితానగర్ పంపించారు. నేను ఉద్యోగం కావాలని అర్జీ పెట్టుకోలేదు. కానీ మోటూరి సత్యన్నారాయణగారి సలహా మేరకు కుప్పుస్వామిగారు కమ్మకుల అభిమానంతో ఈ ఆర్డర్ కాగితం పంపించారని తెలిసింది.కాని నేను హైస్కూలు ఉద్యోగం చేయడానికి ఇష్టపడక వారికి జవాబుకూడా వ్రాయలేదు. ఒక నెల తరువాత కుప్పుస్వామిగారు ఆ రోజులలో తెనాలి మునిసిపల్ చైర్మన్‌గా ఉన్న త్రిపురనేని రామస్వామి చౌదరిగారికి

ఏవిధంగానైనా నన్ను రేపల్లె హైస్కూలుకు పంపవలసినదిగా కబురు చేశారట. రామస్వామి చౌదరిగారు తన స్నేహితులయిన అయితానగర్ యువకులతో నేను ఉన్న ఇంటి మీద గెడ్డలు వేసి బెదరేసి నన్ను ఉద్యోగానికి వెళ్ళేటట్టు చేయమని చెప్పారట. కాని ఆ యువకులే నావద్ద హిందీ నేర్చుకుంటున్నందున నా సంగతి వారితో చెప్పి మా హిందీ గురువుగారిని మా ఊరినుండి వెళ్ళగొట్టడానికి తమతరం కాదనియు, నేను మొండి పట్టుగలవాడననియు వారితో చెప్పారట. అంతట ఆయన తన ప్రయత్నాన్ని విరమించుకొన్నారట.

మహాత్మాగాంధీజీ హరిజన దేవాలయ ప్రవేశ ఉద్యమ సందర్భ పర్యటనలో ఆంధ్రప్రాంతానికి వచ్చినప్పుడు ఒక రాత్రి అయితానగర్‌లో మకాం చేశారు. అప్పుడు మహాత్మాగాంధీగారికి సేవ చేయడానికి, వారితో కొన్ని నిమిషాలసేపు మాట్లాడటానికి, వారి హిందీ ఉపన్యాసాన్ని తెలుగులోనికి అనువదించడానికి నాకు అవకాశం లభించింది. ఆ సందర్భంలో అయితానగర్ రామాలయములోనికి హరిజనుల ప్రవేశం జరిగింది.

## 39

ఉప్పు సత్యాగ్రహోద్యమం దేశంలో ముమ్మరంగా సాగింది. నేను మా ఆవిడ ఇద్దరం హిందీ పాఠశాల మూసివేసి నేను గుంటూరు జిల్లా బాపట్ల తాలూకా గణపవరం వాలెంటీర్ల శిబిరంలో చేరాను. మా ఆవిడ గుంటూరులో ఉన్నవ లక్ష్మీబాయమ్మగారి దళంలో చేరి గ్రామాలలో కాంగ్రెస్ ప్రచారం చేయసాగింది.

గణపవరం వాలెంటీర్ల శిబిరంలో ఉప్పు తయారుచేసినందులకు నన్ను అరెస్టుచేసి ఒక సంవత్సరం కఠినశిక్ష విధించి బి.క్లాసు ఇచ్చి రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపారు. ఒక నెల రోజుల తరువాత నన్ను, ఎర్నేని సుబ్రహ్మణ్యం, మరికొంత మంది బి.క్లాస్‌వారిని కేరళ రాష్ట్రంలోని కన్ననూరు సెంట్రల్ జైలుకు మార్చారు. అక్కడ నన్ను, సుబ్రహ్మణ్యంగారిని బి.క్లాస్‌నుండి సి.క్లాస్‌కు మార్చారు. ఎందుకన ఎ.క్లాస్; బి.క్లాస్‌లు బి.ఎ, డిగ్రీ కానీ, 10-15 ఎకరాల భూమిగాని, సంఘంలో మంచి పేరు ప్రతిష్టలుగాని ఉన్నవారికి మాత్రమే ఇస్తారు. నాకు, సుబ్రహ్మణ్యంగారికి బి.ఎ. డిగ్రీలేదు. 10-15 ఎకరాల భూమిలేదు. సంఘంలో పేరు ప్రతిష్టలు లేవు. అందువల్ల మమ్ములను బి.క్లాస్‌నుండి సి.క్లాస్‌కు మార్చారు. నేను, సుబ్రహ్మణ్యంగారు ఒకే బ్లాకులో వరుస గదులలో ఉండేవాళ్ళము. మేమిద్దరము మా రేషన్ క్రింద ఉడకబెట్టిన కందులు, గోధుమరొట్టెలు, రోజుకు ఒక కొబ్బరికాయ తినేవాళ్ళం.

కన్ననూరు జైలులో తమిళులు, కన్నడులు, మళయాళీలు, ఆంధ్రులు మొత్తం అయిదువేలమంది రాజకీయ ఖైదీలుఉండేవారు. వారిలో ఎ.క్లాస్, బి.క్లాస్, సి.క్లాస్‌లవారు కూడా ఉన్నారు. ఎ.క్లాస్‌లో మన ఆంధ్రులు కొండా వెంకటప్పయ్య, టంగుటూరి ప్రకాశం, గొల్లపూడి సీతారామశాస్త్రి, బారు రాజారావు మొదలగువారు ఉండేవారు. బి.క్లాస్‌లో మన ఆంధ్రులు బులుసు సాంబమూర్తి, మద్దూరి అన్నపూర్ణయ్య, దుగ్గిరాల రాఘవచంద్రయ్య, శరణు రామస్వామి చౌదరి, చింతమనేని భావయ్య చౌదరి, చీరాల గౌస్ బేగ్

వగైరాలుండేవారు. సి.క్లాస్‌లో మన ఆంధ్రులు నేను, సుబ్రహ్మణ్యంగారు, గుంటూరు జిల్లా అనంతవరం నాగభూషణం, భూషయ్య, తెనాలి తాలూకా సంగం జాగర్లమూడి కొత్తపల్లి సీతారామయ్య మాత్రమే ఉండేవాళ్ళం.

కన్ననూరు జైలు సూపరింటెండెంట్‌గారు గుజరాతీయుడు. ఆయన భార్య గాంధీ భక్తురాలు, అందువలన ఆమె సుబ్రహ్మణ్యంగారి ప్రోత్సాహంతో ఒక పుట్టెడు దూది, 10 దూదేకుల బద్దలు, 100 రాట్నాలు, 400 తక్లీలు కొని పంపించింది. సుబ్రహ్మణ్యంగారు నాకు, మరికొంతమందికి దూదేకుట, ఏకులు చేయుట, రాట్నము వడుకుట, తక్లీ వడుకుటను నేర్పేవారు. నేను రోజుకు రెండు గంటలు ఉదయం ఎ.క్లాస్ వారికి హిందీ నేర్పేవాణ్ణి. మిగతా కాలంలో సుబ్రహ్మణ్యంగారికి సహాయపడేవాణ్ణి. ఏకుట, ఏకులు చేయుట, నూలు వడుకుట మొదలగు పనులు రెండు మాసాలు బాగా సాగాయి. కానీ ఇంతలో గాంధీ ఇర్విన్ ఒడంబడిక జరిగినందున రాజకీయ ఖైదీలందరినీ విడిచిపెట్టారు. నేను జైలునుండి వచ్చేటప్పుడు 100 తక్లీలను తెచ్చి అమ్మి డబ్బును సూపరింటెండెంట్‌గారి భార్యకు పంపాను.

1921లోకంటే జైలు నియమాలలో గొప్ప మార్పులు ఏమీలేవు. అవే మట్టలాగులు, అవే బనీనులు, అవే గోచీలు, అవే తుండ్లు, అవే నల్లులుగల జనపనార పట్టాలు, కంబళు ్ళ ఉండేవి. కానీ కాళ్ళకు ఇనుప కడియాలు, మెడలో బిళ్ళలు, మట్టి మల్లలు, మట్టి ముంతలు మాత్రం లేవు. మట్టిమల్లలకు బదులు అల్యూమినియం పళ్ళాలు, మట్టి ముంతలకు బదులు అల్యూమినియం లోటాలు ఉండేవి. మెడలోని బిళ్ళకు బదులు ఒక అల్యూమినియం బిళ్ళమీద శిక్ష తేదీ, విడుదల తేదీ వేసి ఇచ్చేవారు. దానిని మేము బనీనుకు తగిలించుకొనేవాళ్ళం. క్షౌరం చేయడానికి పీపా ఇనుపబద్ద రేకుకు బదులు నాటు మంగలి కత్తులుండేవి.

ఎ.క్లాస్‌వారి ద్వారా బి.క్లాస్‌వారు బయటినుండి మాంసము, కోడిగ్రుడ్డు, ఇతర తినుబండారాలను తెప్పించుకొని తినేవారు. ఎ.క్లాస్‌వారి ద్వారా బి.క్లాస్‌వారు డబ్బుకూడా తెప్పించుకొని తమ ఇష్టం వచ్చిన వస్తువులను బయటినుండి తెప్పించుకొనేవారు.

నేను 1931లో కన్ననూరు జైలునుండి విడుదలై వస్తూ చిత్తూరు జిల్లా ఏర్పేడులో మళయాళస్వాముల వారు స్థాపించిన వ్యాసాశ్రమానికి వెళ్ళి శ్రీ మళయాళ స్వాముల వారిని, మా రెండవ బావమరిది కృష్ణచరణ్ (విమలానంద స్వామి)ను చూచి శ్రీ మళయాళస్వాముల వారి అమూల్య సలహాలను తీసుకొని తెనాలి అయితానగర్ వచ్చి మరల హిందీ పాఠశాలను నడపసాగాను.

నేను జైలుకు వెళ్ళిన తరువాత మా ఆవిడ బసవమ్మాదేవిని అరెస్టుచేసి కోర్టుకు తీసుకొనివెళ్ళినప్పుడు ఆమె బంధువులు కొందరు ఆమెను ఒత్తిడి పెట్టి ఆమె చేత బలవంతంగా క్షమాపణ చెప్పించారట. అందులకు ఆమె విచారంతోనూ, సిగ్గుతోనూ చాలా బాధపడిందట. నేను మా ఆవిడ ఇద్దరం హిందీ పాఠశాల తిరిగి నడపసాగాము.

# 40

1932లో మద్యపాన నిషేధోద్యమము, విదేశీ వస్త్రముల దుకాణాల వద్ద పికిటింగులు జోరుగా సాగాయి.అందుకని మేము హిందీ పాఠశాలను మూసివేసి పై ఉద్యమములలో పాల్గొన నిశ్చయించుకొన్నాము. ముందుగా మా ఆవిడ, మా చెల్లెలు సరళాదేవి, మైనేని బసవ పూర్ణమ్మ ఈ ముగ్గురు విదేశీ వస్త్రముల దుకాణాలవద్ద పికిటింగు చేయసాగారు. అందువల్ల వారిని అరెస్టుచేసి ఒక్కొక్కరికి ఆరు మాసాల కఠిన శిక్షవేసి రాయవేలూరు జైలుకు పంపించారు.

నేను, కొత్తపల్లి వెంకట కృష్ణవర్మ, వి. వెంకయ్య ముగ్గురం రేపల్లె తాలూకా మైనేనివారి పాలెంలో కల్లు ముంతలు కట్టివున్న ఈత చెట్ల వద్ద పికిటింగు ప్రారంభించాము. ఈ వార్త విని రేపల్లె పోలీస్ సబ్ఇన్స్పెక్టరు 12 మంది పోలీసులను వెంటబెట్టుకుని మమ్ములను పేము బెత్తాలతోనూ లాఠీలతోనూ సుమారు 70–80 దెబ్బలు కొట్టించాడు. మేము ముగ్గురం స్పృహ తప్పి నేలమీద పడిపోయాము. కొంతసేపటికి స్పృహ వచ్చినప్పుడు నేను మంచినీళ్ళను నావద్ద కావలివున్న ఆ గ్రామ వెట్టి వానిని తెచ్చి పెట్టమని అడగగా వాడు చెంబుకై వెళ్ళబోతుంటే పోలీసులు వెళ్ళనీయలేదు. అందుకని వెట్టివాడు తన పైపంచెను కాల్వనీటిలో ముంచి తీసుకొని వచ్చి ఆ తడిగుడ్డను నా నోటిలో పిండాడు. అప్పుడు నా దప్పిక తీరింది.

నేలమీద పడివున్న మా ముగ్గురిని విడిచిపెట్టి సబ్ఇన్స్పెక్టర్, పోలీసులు రేపల్లె వెళ్ళిపోయారు. పోలీసులు వెళ్ళిపోయిన తరువాత గ్రామస్తులు వచ్చి మా ముగ్గుర్ని మోసుకొని పోయి ఆ రాత్రంతా కాపులుకాసి ఎంతో సేవ చేశారు. మూడు రోజులకుగాని మేము లేవలేకపోయాము. మూడవ రోజున మేము ముగ్గురం కుంటుకుంటూ, కుంటుకుంటూ మైనేనివారిపాలెంలో ఏటికట్టమీద ఉన్న సారా దుకాణంవద్ద పికిటింగు సాగించాము. ఈవార్త గ్రామ మున్సిఫ్ రేపల్లె పోలీస్ స్టేషన్‌కు తెలపగా ఇద్దరు పోలీస్ సబ్ఇన్స్పెక్టర్లు 16 మంది పోలీసులు వచ్చి తుపాకులతోనూ, లాఠీలతోనూ పేము బెత్తాలతోనూ మమ్ములను ముట్టడించారు.

ముందుగా మా సంచులలో ఉన్న గుడ్డలను తీసి ఒకచోట కుప్పవేసి మా పుస్తకాలను కాల్వలో పారవేశారు. తరువాత ఒక సబ్ఇన్స్పెక్టరు పోలీసుల చేత మా ఒంటిమీద ఉన్న బట్టలను ఊడదీయించి గుడ్డల కుప్పమీద పడవేయించాడు. మేము కట్టు పంచలలోపల లంగోటాలను కట్టుకొని ఉన్నందున మేము దిగంబరులము కాలేదు. సబ్ఇన్స్పెక్టరు మా గుడ్డలన్నీ కిరోసిన్ పోయించి తగులబెట్టించాడు. తరువాత బూటుకాళ్ళతో మమ్ములను వరుసబెట్టి తన్నసాగాడు. మేము నేలమీద పడిపోయాము. తరువాత పేము బెత్తాలతోనూ, లాఠీలతోనూ కొట్టించాడు. మేము స్పృహలేకుండా నేలమీద పడిపోయాము. ఈ దృశ్యంచూచిన 2–3వేల మంది జనం పోలీసులను కవ్వింపసాగారు. అప్పుడు పోలీసులు

భయపడి గుంపును చెదరగొట్టడానికి 10-15 సార్లు గాలిలోనికి తుపాకులు పేల్చారు. జనం కొంతదూరం పారిపోయి మరల రాసాగారు. మరల పోలీసులు తూటాలు పేల్చారు. చీకటి పడవచ్చింది. పోలీసువారు భయపడిపోయి మమ్ములను ఒక పడవలో ఎక్కించుకొని రేపల్లెకు సమీపంలో ఉన్న పెనుమూడికి తీసుకొని పోయి అక్కడనుండి ఒంటెద్దు బండిమీద రాత్రి 8 గంటలకు రేపల్లె సబ్ జైలుకు తీసుకుని పోయి ఆ రాత్రి అన్నం, నీళ్ళులేకుండా జైలులో ఉంచారు. నాకు కుడిచేతి బొటనవ్రేలు, చూపుడువ్రేలు మధ్య లాఠీ దెబ్బలు తగులుటవలన పెద్ద గాయము కలిగెను. నెత్తురు అదేపనిగా కారెను. కానీ డాక్టర్ని దగ్గరకు రానివ్వలేదు.

పడవలో నాకు దప్పిక అయినప్పుడు మంచినీళ్ళు ఇప్పించమని పోలీస్ సబ్ఇన్‌స్పెక్టర్ని అడగగా ఒక పోలీసుతో నా నోటిలో ఉచ్చపోయమని ఆజ్ఞాపించాడు. కాని అతడు ఆ పనిచేయడానికి జంకాడు. నేను దప్పికతోనూ కోపంతోనూ కుమిలిపోయాను.

తెల్లవారిన తరువాత మమ్ములను లంగోటీలతో ఉండటంచూచి ప్రజలు గుమిగూడి సబ్‌జైలును ముట్టడించారు. సబ్ఇన్‌స్పెక్టరు, సర్కిల్ ఇన్‌స్పెక్టరు, జిల్లా సూపరింటెండెంట్ ముగ్గురు ఆలోచించుకొని మమ్ములను విడుదల చేశారు. మేము కుంటుకుంటూ, కుంటుకుంటూ బయటకురాగానే జనం మాకు ఖద్దరు గుడ్డలను తెచ్చి ఇవ్వసాగారు. కానీ మేము ముగ్గురము మూడు లుంగీలకు, మూడు తుండులకు, మూడు జోలీలకు సరిపోయే గుడ్డను తీసుకుని తక్కిన గుడ్డలను బీదలకు పంచిపెట్టాము. ప్రభుత్వం మా వెంట ఇద్దరు పోలీసులు తీయకుండా ఉండేలాగున నియమించి మేముచేసే కార్యక్రమాన్ని ఏరోజుకారోజు తెలుపమని వారిని ఆజ్ఞాపించెను. మేము ముందుగా రేపల్లె తాలూకా తూర్పుపాలెం వెళ్ళాము. అక్కడ మాకు పరుచూరి రామకోటయ్యగారు అన్నం పెట్టిరి. వారిని వెంటనే అరెస్టుచేసి సాయంకాలానికి ఆరుమాసాల కఠినశిక్ష చెప్పి రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపించారు. మాకు అన్నం పెట్టినవారిని, మాకు చాప ఇచ్చినవారిని, మాకు రాత్రిపూట పండుకొనుటకు చోటిచ్చినవారిని అరెస్టు చేస్తామని పోలీసులు బెదిరించగా మేము ఇంటింటికీ ఒక ముద్ద చొప్పున అన్నం మా గుడ్డ జోలీలో వేయించుకొని తీసుకొని వెళ్ళి దేవాలయంలో తిని, నేలమీద మా తుండ్లను పరుచుకొని నిద్రపోయేవాళ్ళం. ఒకపూట ఉదయం ముద్దలు అడుక్కొని తినేవాళ్ళం. రాత్రిపూట ఎవరైనా పేలాలనుగాని, ఫలహారాన్నిగాని పెట్టితే తినేవాళ్ళం. పెట్టకపోతే నీళ్ళు త్రాగి పండుకొనేవాళ్ళం. ఈ రకంగా ముద్దలు అన్ని కులాలవారి వద్ద అడుక్కొని తింటూ రేపల్లె తాలూకా గ్రామాల్లో నాలుగు మాసాల పాటు కాంగ్రెస్ ప్రచారంచేస్తూ 50-60 వాలంటీర్లను పికిటింగుకు పంపించాము.

వారిలో చాలామందిని అరెస్టుచేసి శిక్ష విధించి జైలుకు పంపించారు. చివరకు 5వ మాసంలో నేను, కొత్తపల్లి వెంకటకృష్ణవర్మ, రేపల్లె తాలూకా నల్లూరులో వాలెంటీర్ల శిబిరంపెట్టి ఆడా, మగ 50 మందిని వాలెంటీర్లను పికిటింగుకు పంపగా వారందరినీ అరెస్టుచేసి శిక్షవిధించి జైలుకు పంపారు. చివరకు నన్నూ, వెంకటకృష్ణవర్మ గారిని అరెస్టుచేసి చెరి 6 మాసాల కఠిన శిక్ష విధించి రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపించారు.

# 41

రాజమండ్రి సెంట్రల్ జైలులో కందులకు బదులు పప్పు వాడేవారు. రేషన్ ఒక్కొక్క ఖైదీకి ఆ రెండున్నర అణాలే (15పైసలు) రోజుకు ఇచ్చేవారు. మా ఇద్దరకు రెండు పూటలు గోధుమ రొట్టె, పప్పు ఇచ్చేవారు. మజ్జిగ లేనే లేవు. అందువల్ల మా ఇద్దరకు రేచీకటి జబ్బువచ్చింది. రాత్రిపూట కండ్లు బొత్తిగా కనిపించేవి కావు. జైలులో మేమిద్దరం అన్ని జిల్లాలకు చెందిన రాజకీయ ఖైదీలకు హిందీ చెప్పేవాళ్ళం. సుమారు 100–150మంది హిందీ నేర్చుకొనేవారు.

నేను జైలునుండి రాకపూర్వమే మా ఆవిడ, మా చెల్లెలు బసవపూర్ణమ్మ వగైరాలు జైలునుండి విడుదలైనారు. నేను 1933లో విడుదలైన తరువాత నేను, మా ఆవిడ, మా చెల్లెలు అయితానగర్ చేరుకొని హిందీ పాఠశాలను నడపసాగాము.

అయితానగర్‌లో 1933లో మా చెల్లెలు సరళాదేవికి కొత్తపల్లి వెంకటకృష్ణవర్మకు అమావాస్య రోజున పెండ్లి జరిగింది. పెండ్లికి ముఖ్యఅతిధులుగా నా స్నేహితులైన కొంతమంది హరిజనులు (క్రైస్తవులు) కూడా వచ్చారు. మాతోపాటు జైలులో ఉన్న కొంతమంది మిత్రులు కూడా పెండ్లికి వచ్చారు. కాని అయితానగర్ గ్రామస్థులెవరూ రాలేదు.

# 42

1934లో హిందీని అభివృద్ధి పరచుకోవాని నేను, మా ఆవిడ, మా మేనల్లుడు నాదెళ్ళ వెంకటేశ్వరరావు, మా ఆవిడ అన్న బొబ్బా శంకరరావు, ఆయన భార్య దమయంతి, మొత్తం అయిదుగురం గోరఖ్‌పూర్ జిల్లాలోని బరహజ్‌లో శ్రీ బాబా రాఘవరావు స్థాపించిన ఆశ్రమంలో హిందీయేతర ప్రాంతాల వారికి హిందీ నేర్పటానికి పెట్టిన హిందీ విశ్వవిద్యాలయంలో చేరాము. మేము ఆశ్రమానికి కొంచెం దూరంలో ఉన్న ఒక పల్లెటూరిలో వరద బాధితులకై కట్టిన మట్టిగోడలుగల సత్రంలో రెండు గదులలో ఉండేవాళ్ళము. తక్కిన గదులలో వరద బాధితులైన హరిజనులుండేవారు. వారు మేము అన్నదమ్ములవలె ఉండేవారము. మేము అంటును పాటించకుండుటను చూచి వారు మమ్మెంతో గౌరవంగా చూస్తూ మాకు ఎంతో సహాయం చేసేవారు.

ఆశ్రమం తరుఫున నాకు, మా బావమరిది శంకరరావుకు నెలకు చెరి పది రూపాయలు ఉపకారవేతనం లభించేది. ఈ 20 రూపాయలు మా అయిదుగురికి రెండుపూటల భోజనానికి బాగా సరిపోయేవి. ఉదయం 9 1/2 గంటలకు వరి అన్నం, కూర, పెరుగు, రాత్రికి రొట్టెలు, బంగాళదుంప కూర పాలు తీసుకొనేవాళ్ళం. నేను, మా బావమరిది శంకరరావు సాహిత్యరత్న పరీక్షకు చదివాము. కానీ పరీక్షకు కూర్చోలేకపోయాము.

1935 లో మేమందరం లక్నో కాంగ్రెస్ మహాసభకు హాజరయ్యాము. ఆంధ్రదేశం తరుఫున ఎగ్జిబిషన్‌లో కొమ్ము బొమ్మల దుకాణంపెట్టి అమ్మకం చేశాము. ఒక నెలరోజులపాటు మేము లక్నోలో ఉన్నాము. ఆ సమయంలో మన ఆంధ్ర ప్రాంతంనుండి కొంతమంది యాత్రికులు రైలులో కాంగ్రెస్‌కు వచ్చారు. వారు వస్తూ మా కొరకు కొన్ని నారింజపండ్లు, నిమ్మకాయలు తెచ్చారు. నేను నారింజపండ్లను నా ఉత్తరదేశ మిత్రులకు తినమని ఇస్తేవారు వాటిని ఎలా తినాలో చూపించమన్నారు. ఎందుకనగా ఉత్తరభారత ప్రాంతంలో నారింజ, కొబ్బరి, నిమ్మచెట్లు ఉండవు. వారికి కొబ్బరి, నిమ్మకాయలు పరిచయం ఉందిగాని, నారింజకాయను వారు పాపం చూచియే ఉండకపోవచ్చును. అందులో ఉత్తరప్రదేశంలో గోరఖ్‌పూర్ జిల్లా చాలా వెనుకబడిన ప్రదేశము. అక్కడ ఉన్న బీదరికము ఒక్క ఒరిస్సాలో తప్ప మరెక్కడాలేదు. ఇచ్చట పాటకజనం-కూలీనాలీ చేసికొని జీవించేవారంతా-కుంకుళ్ళ కొనలేక నదీ, కాలవల ఒడ్డున పేరుకొన్న ఒండ్రుతో తలలు రుద్దుకొంటారు. అదే వారి శిర స్నానము. చాలామందికి కట్టుకోటానికి రెండవజత బట్టలుండవు. తింటానికి చాలినంత తిండిలేక హరిజనులు, గిరిజనులు మామిడి టెంకలలోని జీడీలను ఎండబెట్టుకొని పిండిగా చేసుకొని తిండిలేని రోజున రొట్టె కాల్చుకొని తింటారు. మామిడి టెంకలు దొరకనప్పుడు పశువులు గోధుమ, జొన్నచేలల్లో మేసి పేడ వేసినప్పుడు పేడలో గోధుమలు, జొన్నలు ఉండునట. ఆ పేడ బీదలు ఒకచోట ప్రోగుచేసి ఉంచి ఎండిన తరువాత దానిని గొడ్లతో నూర్చి తూర్పేత పోసి గింజలను వేరు చేసెదరు. ఆ గింజలను కడిగి ఎండబెట్టుకొని తిండిలేనప్పుడు పిండి చేసుకొని రొట్టెలు చేసుకొని తింటారు. నేను ఒక పల్లెటూరిలో జరిగే ఒక హరిజనుల సభకు వెళ్ళినప్పుడు గొడ్లతో పేడను నూర్చే దృశ్యము చూడగలిగాను. వారిని అడిగినప్పుడు ఈ విషయాలు వారి ద్వారా నేను తెలుసుకోగలిగాను. ఆ ప్రాంతంలో కుష్ఠురోగులు ఎక్కువగా కనిపిస్తారు. ముఖ్యంగా బీదలలోనే ఎక్కువమంది కుష్ఠురోగులున్నారని చెప్పారు.

పాటకజనం నదిలో ఒక్కసారి మునిగి వెంటనే బయటకు వచ్చేస్తారు. వారి కట్టుబట్టకూడా పూర్తిగా తడవనే తడవదు. ఎక్కువ సేపు నీళ్ళల్లోఉంటే గంగమ్మతల్లికి కోపం

వస్తుందనే వారు. వారు ఆ రోజులలో సబ్బుపెట్టి నదినీటిలో గుడ్డలు ఉతుకుట పాపమనేవారు.

గ్రామాలలో మంచినీటి బావులవద్ద బయటకు వెళ్ళివచ్చిన మగవాళ్ళు తమ చెంబులను బయటమట్టితో తోమి దానిని బావిలో పడవేసి శుభ్రం చేసేవారు. బావిలో ఈ రకంగా అందరూ మట్టితో తోమిన వందల చెంబులను శుభ్రంచేయుట వల్ల బావిలో బండ్ల కొలది మన్ను పేరుకొని పోయి బావినీళ్ళు మలినమైపోతూ ఉండేవి. కానీ వారు మాత్రం వాటిని పవిత్రమైన జలమని నమ్మేవారు. బయట మట్టితో తోమి బయటనీటితో కడుగుటవల్ల చెంబు అపవిత్రమైపోతుందని చెప్పేవారు. బావిలోని మురికినీటిని మేము త్రాగమని చెప్పగా మా కొరకు ఒక బోరింగు పంపు వేశారు. ఆ పంపునీళ్ళు ఆపవిత్రమైనవని అచ్చటి పామరులేగాక మేధావులు (చదువుకొన్నవారు) కూడా అనేవారు. మేము గుడ్డలకు సబ్బుపెట్టేవాళ్ళము. పంపునీళ్ళు వాడేవాళ్ళము. అందుకని మమ్ములను నాస్తికులనేవారు.

ఆ ప్రాంతంలో ఆస్తిగల జమిందారులనబడే పెద్ద రైతులు కూడా వేయించిన గోధుమపిండిలో ఉప్పు కలుపుకొని ఎండుమిరపకాయ నంజుకొని అల్పాహారం క్రింద తినేవారు. ఆ ప్రాంతంలో దినం (శ్రాద్ధకర్మ) చేసేటప్పుడు పురోహితుడు వగైరాలువల్ల కాటిలో డేరా వేయించుకొని అక్కడ పక్కా భోజనము (నేతితోగాని ఆవనూనెతోగాని) పిండివంటలు, కూరలు చేయించుకొని తింటారు. అలా తింటే చనిపోయిన వ్యక్తికి తృప్తి కలుగునని పురోహితులు చెబుతారు. పురోహిత బ్రాహ్మణులు, హరిజనులు తప్ప తక్కిన కులాలవారు చేసిన పిండి వంటలను లెస్సగా తింటారు. కానీ నీటితో వండిన వరి అన్నంగాని రొట్టెలుగాని పనికిరావనే వారు. వాటిని బ్రాహ్మణ పురోహితులు తినరట. నూనెతోగాని, నేతితోగాని చేసిన రొట్టెలు, పూరీలు మొదలైనవాటిని వారు తినవచ్చునట.

ఉత్తరభారత రాష్ట్రంలో గుడ్డలను నేసేవారంతా మహ్మదీయులే. హిందువులు బట్టలు నేయకూడదట. అందుకని మహ్మదీయులే హిందువులకు కావలసిన గుడ్డలను నేసి మార్కెట్టులకు తీసుకొని వచ్చేవారు. వారు నేసే గుడ్డలను హిందూవులు కట్టుకోవచ్చునట. కానీ ఇనుప రేకులమీద పింగాణీ కోటింగుగల పళ్ళాలను మహ్మదీయులు వాడతారు కాబట్టి ఆ పింగాణీ పళ్ళాలను హిందువులు వాడకూడదట. ఆ పింగాణి పళ్ళాలనుగానీ, గిన్నెలనుగానీ హిందువులెవరైనా వాడితే వారిని కులంనుండి బహిష్కరించేవారు. ఈ విషయం నేను స్వయంగా అనుభవించాను. నేను ఒక పింగాణి పళ్ళెంలో అన్నంతినేవాణ్ణి. అందుకని నన్ను నా సహ పాఠకులు చాలా తేలికగా చూసేవారు. నన్ను ముట్టుకొంటే పాపమనేవారు.

ఆ రోజులలో గోరఖ్‌పూర్ జిల్లాలోని చాలా గ్రామాలలో పాయిఖానాదొడ్లు ఉండేవికావు. మగవాళ్లు చెంబులు తీసుకొని గ్రామాలచుట్టూ ఉన్న మెరక పొలాలలోకి వెళ్ళేవాళ్ళు. రైతులు పెంటను ఎరువుగా ఎంచి బయలుకు వచ్చినవారిని ఏమీ అనేవారుకాదు. కానీ ఆడవారు

మాత్రం పగటివేళ బయలుకు చెంబులు తీసుకొనివెళ్ళకూడదు. అవసరం అయినప్పుడు పగటివేళ ఒక మూల ఒక పాత్రను ఉంచి దానిలో కాలకృత్యాలు తీర్చుకొని చీకటి పడిన తరువాత ఆ పెంటను బయట పారవేసి పాత్రను కడిగి శుభ్రంచేసి ఇంటికి తీసుకొనిరావాలి. ఏ ఆడదైనా పగలు బయటకు చెంబు తీసికొని బయలుదేరితే, ఆమెను బోగంసాని అని ఎగతాళిచేసి సంఘం నుండి బహిష్కరిస్తారు.

ఉత్తరప్రదేశ్‌లో పెండిండ్లుకూడా చాలా విచిత్రంగానూ, మన ఆచారానికి పూర్తి వ్యతిరేకంగానూ ఉంటాయి. మాతోపాటు హిందీ సాహిత్యరత్న చదివే 15 యేండ్ల కుర్రవానికి పెండ్లి నిశ్చయింపబడింది. నేను పెండ్లి కుమార్తె వయస్సు ఎంత అని అడగగా ఆమెకు 18 సంవత్సరాలుండునని చెప్పారు. ఇంత పెద్దపిల్లను ఇంత చిన్నబ్బాయికి ఎందుకు ఇస్తున్నారని అడగ్గా కుర్రవాడు వయస్సుగలవాడు అయ్యేవరకు అతని పెండ్లాము తన అత్తమామలకు సేవ చేయాలి. ఎందుకన అతడు కాపురానికి వచ్చిన తరువాత ఆమెకు అత్తమామలకు సేవచేయడానికి అవకాశం ఉండదు. అందుకని ముందుగానే కోడలు అత్త మామలకు కొన్ని సంవత్సరాల పాటు సేవ చేయాలి. అందుకని చిన్న కుర్రవాళ్ళకు పెద్దమ్మాయిలను ఇచ్చి పెండ్లి చేస్తామని చెప్పారు.

ఈ ప్రాంతంలో మరొక విచిత్రమైన ఆచారం ఉంది. ఇచ్చట ఒక జాతి బ్రాహ్మణులలో మాంసం తినే ఆచారం కలదు. వారే స్వయంగా వేటపోతును తోలు తీసికొని మాంసాన్ని తలాకాస్త పంచుకొని వండుకొని తింటారు. కానీ ఇతరులు కోస్తే ఆ మాంసం పనికిరాదట. ఇంతే కాదు. ఆ జాతిలో ఒకసారి అయినా మాంసం వండని ఆడదాని చేతి వంటను తక్కినవారు ముట్టరట. అందుకని ప్రతి ఆడుది ఒక్కసారి అయినా మాంసం వండి తీరాలట.

ఇక్కడ పెండిండ్ల సందర్భంలో విఘ్నేశ్వర విగ్రహ పూజకు బదులు ఏనుగునే పూజిస్తారు. దానిని పూజించి దానికి పెద్ద పెద్ద రొట్టెలు పెడతారు. ఈ ప్రాంతంలో గవర్నమెంటు ఆఫీసులలో ఆ రోజులలో బంట్రోతుకు పెద్ద నెలజీతం 7 రూపాయలు. గుమాస్తాకు 25 రూపాయలు నెలజీతం పెద్ద జీతమనేవారు.

# 43

1935 లో లక్నోకాంగ్రెస్ మహాసభకు ఆంధ్రప్రాంతంనుండి వచ్చిన యాత్రికుల రైలుబండిలో మా ఆవిడ ఇంటికి వెళ్ళిపోయింది. మా బావమరిది శంకరరావు ఆయన భార్య మరొక చోటుకు చదువుకోవటానికి వెళ్ళిపోయారు. ఇక నేను మా మేనల్లుడు వెంకటేశ్వరరావు ఇద్దరం సొంతంగా వంట చేసికొని నేను సాహిత్యరత్న కోర్సు, మా మేనల్లుడు వెంకటేశ్వరరావు హైస్కూలులోనూ చదువుకొనసాగాము.

కానీ 1937 చివరిభాగంలో నేను రేపల్లెతాలూకా మైనేనివారిపాలెం వచ్చాను. అప్పటికి మా అబ్బాయికి ఆరు మాసాల వయస్సు. కుటుంబాన్ని తీసికొని నేను అయితానగర్ వచ్చి

చందాలు ద్వారా పాఠశాలను నడపసాగాను. మా కుటుంబానికి నెలకు 24 రూపాయలు బాగా సరిపోయేవి.

మా అబ్బాయికి ఉదయం పావుశేరు ఆవుపాలు కూడా కొనేవారము. అందరం ఆవుపాడినే వాడాలనుకొని 1938లో 22రూపాయలకు పూటకు మూడుశేర్లు (4లీటర్లు) పాలుఇచ్చే ఆవును కొని దానికి పైమేత కొరకు బస్తా తవుడు 1 1/2 రూపాయలకు, బస్తా పచ్చిశెనగపొట్టు 2 1/2 రూపాయలకు కొనేవాణ్ణి. క్రమ క్రమంగా అది పూటకు నాలుగుశేర్లు పాలు ఇవ్వసాగింది. దాని పాల ద్వారా పది నెలల్లో పదికిలోల నెయ్యిని కూడబెట్టాము. ఆ రోజులలో వెన్న శేరు అయిదు అణాలు (30పైసలు), వడ్ల బస్తా ఖరీదు రెండున్నర నుంచి 3 రూపాయలు, బియ్యం బస్తా ఖరీదు ఏడున్నర - 8 రూపాయలు మాత్రమే. పాత చిన్న మోటారుకారు 400-500 రూపాయలకు, క్రొత్తది 3-4వేల రూపాయలకే వచ్చేవి. బియ్యం రూపాయకు 15 కిలోలు వచ్చేవి. చింతపండు వీసె రెండున్నర అణాలు అంటే ఒకటిన్నర కిలో చింతపండు 15 పైసలు.

# 44

1941 వరకు హిందీ పాఠశాలను నిశ్శుల్కంగా (జీతాలు లేకుండానే) నడిపి దక్షిణభారత హిందీ ప్రచారసభ పరీక్షలకు విద్యార్థినీ విద్యార్థులను కొన్ని వందల మందిని పంపాను. ఇంతలో 1942 క్విట్ ఇండియా (Quit India) ఉద్యమం ప్రారంభమైంది. మా దంపతులలో ఎవరో ఒకరు ఈ ఉద్యమములో పాల్గొనాలని నిశ్చయించుకొన్నాము. మాకు 1940లో ఒక అమ్మాయి కలిగింది. ఆమెకు రెండు యేండ్లు. మా అబ్బాయికి 6 యేండ్లు. పిల్లల పోషణకై ఆర్థిక సహాయాన్ని ఏర్పాటుచేసి మా ఆవిడను ఇంటివద్ద ఉంచి నేను ఉద్యమంలో పాల్గొన్నాను.

దేశమంతటా ఘోరంగా లాఠీఛార్జీలు,పేము బెత్తాలతో బాదుట, కొన్నిచోట్ల తుపాకీ కాల్పులు జరగసాగాయి. మన ఆంధ్రరాష్ట్రంలో కూడా చాలా మందిని అరెస్టుచేసి జైలుకు పంపించారు. నాతోపాటు నా వద్ద జైలులో హిందీ నేర్చుకోవాలనే కోరికతో తెనాలి తాలూకా పెదరావూరుకు చెందిన కొంత మంది యువకులు, దోనేపూడికి చెందిన వెనిగళ్ల వెంకటకృష్ణ, మా బావమరిది బొబ్బా సత్యన్నారాయణ వగైరాలు నావెంట అరెస్టయ్యారు. నాకు, మరికొంతమందికి ఒక్కొక్కరికి ఒక సంవత్సరం కఠిన శిక్ష, మరికొంతమందికి 6 మాసాలు కఠినశిక్ష విధించి బళ్లారి క్యాంపు జైలుకు మమ్మంల్నదర్నీ పంపించారు. శిక్ష చెప్పునపుడు నాకు బి.క్లాసు ఇవ్వాలని నా సహపాఠి అయిన సూర్యదేవర రామచంద్రరావు పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గారు ప్రయత్నింపగా నేను దానిని అంగీకరించక సి. క్లాస్‌లోనే అందరితోపాటు ఉన్నాను.

జైలులో 1921, 1930, 1932 సంవత్సరాలలోకంటే రేషన్‌లోగాని, దుస్తులలోగాని, పక్కపట్టాలలోగాని, కప్పుకొనే కంబళ్ళల్లోగాని ఎక్కువ మార్పులేదు. పట్టాలోనూ, కంబళిలోనూ నల్లుల రాజ్యం సాగుతూనేఉంది. నల్లులు జైలుగోడల మీద రాత్రిపూట బారులు తీర్చి షికారుకు బయలుదేరేవి. ఇచ్చట రాజకీయ ఖైదీల సంఖ్య ఎక్కువగుటవల్ల త్రాగటానికి గానీ, స్నానానికిగాని నీటి సప్లై సరిగా ఉండేది కాదు. ఒక్కొక్క రోజున స్నానం చేస్తూ ఉండగానే పంపులు ఆగిపోయేవి. ఒక్కొక్కరోజున ఉదయం 10 గంటలనుండి సాయంకాలం నాలుగున్నర గంటల వరకు త్రాగటానికి మంచినీళ్లు దొరకక నానా ఇబ్బందులు పడ్డాము. ఒక్కొక్క రోజున ఎంగిలి పళ్ళాలు కడగటానికి, ఎంగిలి చేతులు కడుక్కోటానికి నీళ్లు దొరకక పళ్ళాలను, చేతులను ఎండబెట్టుకొని సాయంకాలం నాలుగున్నర గంటలకు పంపు వచ్చినపుడు కడుక్కొనేవాళ్ళం.

పంపునీళ్ళు పట్టుకొనే సమయంలో మన ఆంధ్రులు, అరవవారు పళ్ళాలతోనూ, లోటాలతోనూ కొట్టుకొనేవారు. ఎందుకనగా నీరు ఎప్పుడు అయిపోతాయో అని అందరూ భయపడి నీటికై ఎగబడేవారు. ఏడాదిలో స్నానం ఏ రోజూ కూడా తృప్తిగా చేయలేదు. త్రాగటానికే నీళ్ళు దొరకనప్పుడు స్నానానికి నీళ్ళెలా లభించగలవు?

జైలులో నేను కొందరికి హిందీని, కొందరికి తెలుగును, కొందరికి ఇంగ్లీషు ఉదయం 7 గంటలనుండి 11 గంటల వరకు, సాయంకాలం 2-4 గంటల వరకు నేర్పేవాణ్ణి. జైలులో నాతోపాటు పొట్టి శ్రీరాములు, గోపరాజు రామచంద్రరావు, గౌతు లచ్చన్న, ఎర్నేని సుబ్రహ్మణ్యం, తుమ్మల బసవయ్య, తరిమల నాగిరెడ్డి, ఘంటసాల వెంకటేశ్వరరావు, గుత్తా వీరరాఘవయ్య చౌదరి మొదలగువారలు ఉండేవారు.

ఒకసారి సూపరింటెండెంట్‌తో పాయిఖానా దొడ్లు శుభ్రంగా ఉండుట లేదని ఫిర్యాదు చేయగా ఆయన వ్యంగ్యంగా మీరు బాగుచేసి చూపించవచ్చునుగా అన్నారు. వెంటనే రెండవరోజు మొదలుకొని నేను, ఎర్నేని సుబ్రహ్మణ్యం, గౌతు లచ్చన్న, పొట్టి శ్రీరాములు నలుగురము 8, 16 బ్లాకులలోని పాయిఖానా దొడ్లను ఒక వారంరోజులపాటు శుభ్రంచేశాము. చివరిరోజున సూపరింటెండెంట్‌గారు స్వయంగా వచ్చి మేము శుభ్రంచేసిన పాయిఖానా దొడ్లను మామూలుగా పాయిఖానా దొడ్లను శుభ్రంచేయు వారికి చూపించి మమ్ములను పొగడసాగెను. అప్పటినుండి సూపరింటెండెంట్ తక్కిన జైలు అధికారులు రాజకీయ ఖైదీలను కాస్త గౌరవంగా చూడసాగారు.

## 45

నేను 1943 ప్రాంతంలో బళ్ళారి క్యాంపు జైలునుండి విడుదలై అయితానగర్ (తెనాలి) వచ్చి మరల హిందీ పాఠశాలను ప్రారంభించి 1945 వరకు నడిపాను. 1946 ఫిబ్రవరిలో అయితానగర్‌లో కేవలం బాలికల కొరకు "ఆదర్శ బాలికా పాఠశాల" అనే పేరుతో బాలికలను ఆదర్శ గృహిణులనుగా తయారుచేయాలనే కోరికతో శ్రీబెజవాడ గోపాలరెడ్డిగారి అధ్యక్షతన

కన్నెగంటి శాయమ్మగారి వెంకయ్యగారి ఖాళీస్థలంలో స్కూలు స్థాపించి చందాలతోనే నడపసాగాను. దానిలో ఆరుగురు ఉపాధ్యాయులు, ఇద్దరు ఉపాధ్యాయినులు పనిచేసేవారు. ఉపాధ్యాయులకు, ఉపాధ్యాయినులకు జీతాలు చందాలద్వారా వసూలైన ధనం ద్వారానే ఇచ్చేవాడిని. ఎందుకన పాఠశాలలో చదువుకొనేవారిలో చాలామంది బీదపిల్లలే. వారినుండి జీతాలు తీసుకొనేవారం కాదు.

పాఠశాల తరపున ఒక హాస్టల్ కూడా నడిపాం. పొరుగు గ్రామాలనుండి 60–70 మంది బాలికలు వచ్చి హాస్టల్‌లో సొంతంగా వండుకొని తిని చదువుకొనేవారు. వారు వంట పాత్రలను స్వయంగా తోముకొనేవారు. తమ గుడ్డలను తామే సబ్బుపెట్టుకొని ఉతుక్కొనేవారు. పాఠశాలను, వంటశాలను వారుండే నివాసగృహాన్ని వారే స్వయంగా రెండుపూటలూ ఊడ్చేవారు. మా పాఠశాల తరుపున పనివాళ్ళు ఉండేవారుకాదు. చాకలి లేనేలేదు.

హాస్టల్‌లో భోజనానికి ఒక్కొక్క బాలికకు నెలకు 15 రూపాయలు, ఏడు శేర్లు (8 కిలోలు) బియ్యం సరిపోయేవి. పాఠశాలలో అన్ని జిల్లాల బాలికలు ఉండేవారు. కానీ ఎక్కువగా కృష్ణా, గుంటూరు జిల్లాల వారుండేవారు.

1948లో గుంటూరుజిల్లా బోర్డు అధ్యక్షులు, గొప్ప విద్యాభిమానులు. వెనుకబడిన జాతులలో విద్యవ్యాప్తికై కుగ్రామాలలో కూడా ఉన్నత పాఠశాలల స్థాపనకు ముఖ్యకారకులైన పాములపాటి వెంకటకృష్ణయ్య చౌదరిగారు ఒకరోజు ఉదయాన జిల్లా హెల్త్ ఆఫీసరుగారిని వెంటపెట్టుకొని మా పాఠశాల పేరును విని తనిఖీకై వచ్చారు. అప్పుడు మా హాస్టల్ బాలికలు పాఠశాలను, భోజనశాలను, పాయిఖానా దొడ్డిని పరిశుభ్రంగా బాగుచేసి స్నానంచేసి వంట చేసుకొనుచుండిరి. మా పాఠశాల పాకలను, వంటశాలను, పాయిఖానాదొడ్డిని ఇద్దరూ చూచి వచ్చి మా పాఠశాల క్రమశిక్షణను, పరిశుభ్రతను, నిరాడంబరతను చూచి సంతోషించి అప్పటికప్పుడే 116 రూపాయలు బీద పిల్లల సహాయం కోసం ఇచ్చి తెనాలిలోని మరికొంత మంది ధనికులతో కూడా మా విద్యాసంస్థకు ఆర్థిక సహాయం చేయించారు. ఇంతేకాకుండా హైస్కూళ్ళలో ఉద్యోగాలు ఇప్పిస్తానని వాగ్దానం చేశారు. చివరకు జిల్లా హెల్త్ ఆఫీసరుగారితో ఇంగ్లీషులో కావూరు వినయాశ్రమం కంటే ఇక్కడే ఎక్కువ శుభ్రం కనిపిస్తుందని అని నాకు ఇంగ్లీషు రాదనుకొని నాతో "ఏమయ్యా! నీ పాఠశాలలో శుభ్రం తక్కువగా ఉన్నదే" అని తెలుగులో అనేసరికి నేను "మీ ఇంగ్లీషు సంభాషణ నాకు కాస్త అర్థమైనదండీ" అని అనేసరికి ఇద్దరూ నవ్వుకొని నన్ను అభినందించి వెళ్ళిపోయారు.

మా పాఠశాలలో మొదట కొన్నాళ్ళవరకు దక్షిణ భారత హిందీ ప్రచారక సభ పరీక్షలకు చెప్పి తరువాత ప్రయాగ మహిళా విద్యాపీఠ పరీక్షలకు, కాశీ హిందూ విశ్వవిద్యాలయం

మెట్రిక్ పరీక్షకు విద్యార్థినులను పంపించాము.

1949 లో పాఠశాలను కన్నెగంటి బాపయ్యగారివద్ద కొన్న స్థలంలో పాకలు వేయించి అక్కడకు మార్చాము. అప్పటినుండి కేవలం ప్రయాగ మహిళా విద్యాపీఠ పరీక్షలకే 1967 వరకు విద్యార్థినులకు శిక్షణ ఇచ్చాము. ఎందుకనగా ఆదర్శ గృహిణులగుటకు కావలసిన పాఠ్యక్రమము ఆ పరీక్షా గ్రంధాలలో ఉండేది.

బాలికలకు వంటచేయుట, చేతికుట్టుపనులు, పిల్లలను పోషించుపద్ధతి, సంగీతము వగైరాలు నేర్పేవారు. అందువలన బాలికలు ఆదర్శ గృహిణులగుటకు ఆ పాఠ్యక్రమము మంచిదని యెంచి ఆ పరీక్షలకే వారిని పంపించేవాళ్ళం.

# 46

పాఠశాల హాస్టల్‌లో ఎక్కువగా ఈడువచ్చిన బాలికలే చేరేవారు. వారి మంచిచెడులను మా ఆవిడ బసవమ్మాదేవే చూస్తూ ఉండేది. వారిని ఆమె ఎంతో శ్రద్ధతోనూ, ప్రేమతోనూ తల్లివలె చూస్తూ ఉండేది. అందువలన హాస్టల్ బాలికలు ఆమెను "అత్తయ్యా, అత్తయ్యా" అని ఎంతో ఆప్యాయంగానూ, గౌరవంగానూ పిలిచేవారు.

మా ఆవిడ మితబాషిణి. ఆమెకు సినిమా అంటే గిట్టేది కాదు. ఆమె ప్రతిరోజూ తన గుడ్డలను, తన బిడ్డల గుడ్డలను, నా గుడ్డలను సబ్బుపెట్టి సొంతంగా ఉతికేది. వంట సొంతంగా చేసేది. మజ్జిగ చేసేది. మా వంటశాలను వారానికి ఒకసారి అలికేది. ఈ పనులన్నీ హాస్టల్ బాలికలకు కూడా దగ్గర ఉండి నేర్పేది. అందువలన హాస్టల్‌లోని బాలికలు కూడా సొంతంగా గుడ్డలు ఉతుక్కొనేవారు. వంట సొంతంగా చేసుకొనేవారు. సొంతంగా అంటుపాత్రలను తోముకొనేవారు. వంటశాలను, పాఠశాలను రోజూ రెండుపూటలా సొంతంగా ఊడ్చేవారు. మాకుగాని హాస్టల్ పిల్లలకుగాని చాకలిగాని, పనిమనుషులుగాని ఉండేవారు కాదు. మా ఆవుల దగ్గర మాత్రం ఒక హరిజన నౌకరును ఉంచాము.

# 47

మా ఆవిడ బసవమ్మాదేవికి 1966లో జబ్బుచేసింది. ఆమెకు రక్తపోటు ఎక్కువైనందున పనులు చేయలేకపోయింది. పైపెచ్చు ఆమెకు సేవచేయడానికి ఒక ఆడమనిషి కావలసి వచ్చింది. అందువల్ల ఆమె తన కుమార్తె వద్దకు విజయవాడ వెళ్లవలసి వచ్చింది. ఇక్కడ తెనాలిలో బాలికల హాస్టల్ నిర్వహించుట నావల్ల కాక మూసివేయవలసి వచ్చింది. ఇంతేకాకుండా నేను సొంతంగా వంట చేసికొని ఆవులను సంబాళించుకుంటూ పాఠశాలను నడుపుట కష్టసాధ్యమైనందున పాఠశాలను కూడా 1967లో మూసివేసి విజయవాడ మా అమ్మాయివద్దకే వెళ్ళవలసి వచ్చింది. కానీ నేను ఎక్కడున్నా ఇంకా ఏదేని పనిచేయాలనే కోరిక నన్ను విడిచిపెట్టలేదు.

నేను తెనాలిలో ఉంటున్నప్పుడు హిందీలో కొన్ని పుస్తకాలు వ్రాశాను. వాటిలో కొన్ని గుంటూరు జిల్లా బోర్డు హైస్కూళ్ళలో పాఠ్యగ్రంధాలుగా పెట్టారు. వాటిలో నా 'హిందీ-తెలుగు వ్యాకరణము' 3-4 సార్లు అచ్చువేయబడింది. దానివి కొన్నివేల ప్రతులు అమ్ముడుపోయాయి. వాటివల్ల నాకు కొంత ఆదాయం కూడా వచ్చింది.

ఇక విజయవాడ వచ్చినప్పటినుండి మా అల్లుడు కాట్రగడ్డ నరసయ్య నడిపిస్తున్న మధుగార్డెన్స్‌లో మొక్కలను పెంచుట, మొక్కలకు అంటులు కట్టుట, క్రోటనులకు గూటీలు కట్టుట మొదలైన పనులకు సంబంధించిన పుస్తకాలు తెప్పించుకొని వాటిని బాగా చదివి అవగాహన చేసికొని తోటలో పనిచేసే తోటమాలులకు కూడా తోట పనులను నేర్పుతూ చివరకు ''మొక్కల పెంపకము'' అనే పుస్తకం వ్రాశాను. దానిని మా అల్లుడు అచ్చువేయించాడు. ఇప్పుడు అది అయిదవసారి అచ్చుకాబోతున్నది. ఇంతటితో నేను తృప్తిచెందక మన సంఘంలోగల మూఢనమ్మకాలను, మూఢాచారాలను గురించి తెలుగులో కొన్ని పుస్తకాలను వ్రాయాలనుకొని మా అల్లుడు కాట్రగడ్డ నరసయ్యతో చెప్పగా ఆయన మూడు భాషలలోగల (తెలుగు, హిందీ, ఇంగ్లీషు ) కొన్ని గ్రంధాలను తెప్పించి ఇచ్చాడు. వాటిలో భగవద్గీత, ఉపనిషత్తులు, వేదాలు మొదలగు గ్రంధాలుకూడా ఉన్నాయి. వాటిని శ్రద్ధగా చదివి ముందుగా "కులమేది?" అనే పుస్తకాన్ని వ్రాశాను. దానిని చుక్కపల్లి పిచ్చయ్యగారు అచ్చు వేయించారు. అది ఇప్పుడు నాల్గవసారి అచ్చు కాబోతోంది. తరువాత "శ్రాద్ధకర్మ ఎవరికొరకు?" "పెండ్లెందుకు?" వ్రాశాను. వీటిని విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మేనేజ్‌మెంట్‌వారు అచ్చువేయించారు. అవి ఇప్పుడు మూడవసారి అచ్చు కాబోతున్నవి. తరువాత "దేవుళ్ళెవరి కొరకు?" వ్రాశాను. అది రెండవ సారి అచ్చు కాబోతుంది. తరువాత "విగ్రహారాధన వేద విరుద్ధంకాదా?", "మంగళసూత్రం పవిత్రమైనదా?", "ఇందుకేనా స్వరాజ్యం?" వ్రాశాను. అవి రెండవసారి అచ్చు కాబోతున్నవి. తరువాత ''యువతా మేల్కొనవా?" వ్రాశాను. దానిని నార్ల చంద్రశేఖరరావుగారు అచ్చు వేయించారు. తరువాత "బాపూజీ జీవిత పరిశీలన" వ్రాశాను. దానిని కన్నెగంటి వెంకటరామయ్య (తెనాలి), అట్లూరి వెంకటసుబ్బారావు, సూర్యదేవర రామచంద్రరావుగారలు (విజయవాడ) అచ్చు వేయించారు. అది రెండవసారి అచ్చు కాబోతోంది. తరువాత "వేదాలంటే ఇవేనా?" వ్రాశాను. దీనిని విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్ మేనేజ్‌మెంట్ వారు అచ్చు వేయించారు.

నేను ఆరోగ్యంగా ఉంటూ పుస్తక రచన సక్రమంగా సాగించగలగటానికి ముఖ్య సహాయకురాలు మా ఆవిడ బసవమ్మాదేవియే. ఆమె తాను అనారోగ్యంగా ఉంటూకూడా 1976 జనవరి వరకు వంటమనిషి ద్వారా నా శరీరానికి అనుకూలమైన తిండిని వండించి వేళకు పెట్టించేది. కానీ ఆమె 1976 ఫిబ్రవరిలో చనిపోయింది. ఆమెలేని లోటు

కొట్టవచ్చినట్లు కనిపించినా మా అమ్మాయి నా ఆరోగ్యాన్ని గురించి తగిన శ్రద్ధ తీసికొంటున్నందున నేను ఇప్పటికీ ఆరోగ్యంగా ఉంటూ సంఘంలో ఆర్థికంగానూ, సాంఘికంగానూ భౌతికంగానూ (చదువు సంధ్యలలోనూ) వెనుకపడిఉన్న ప్రజానీకాన్ని చైతన్యవంతం చేయడానికి అనువైన రచనలు సాగించాలనే కోరిక ఇంకా నన్ను విడిచిపెట్టలేదు.

తుదకు నేను చెప్పేదేమంటే చదువు సంధ్యలులేని బీద కుటుంబంలో పుట్టిన సామాన్యుడు కూడా తిండిలోనూ, పనిలోనూ, సంసారం చేయడంలోనూ ప్రాకృతిక నియమాలను తు.చ.తప్పకుండా పాటింపగలిగితే, అతడు తన సుఖంతోపాటు తనతోటి మానవుల సుఖానికై కూడా యత్నించగలడని నా నమ్మకం.

# 48

ఇక నా తుది ఆవేదనను వినండి ప్రతి పౌరుని ఆర్థిక (డబ్బు సంబంధమైన) సాంఘిక (పదిమందితో గల సంబంధం) నైతిక (నడతకు సంబంధించిన) పరిస్థితులు, అతని రాజకీయ, మత సంబంధమైన వ్యవస్థల మీద ఆధారపడి ఉంటాయి.

అంటే ప్రతి పౌరునికీ ముఖ్యంగా ఆర్థికంగా రాజకీయ వ్యవస్థ తప్పక తోడ్పడాలి. ఎందుకనగా రాజకీయ వ్యవస్థ పుట్టిందే అందుకు.

అంటే ప్రతిపౌరుని శరీరం ఆరోగ్యంగా ఉండాలంటే అతనికి తగినంత ఆరోగ్యకరమైన తిండి, కట్టుకోవటానికి కప్పుకోవటానికి తగినన్ని గుడ్డలు, ఉండటానికి చాలినంత వెలుతురు, గాలివచ్చే ఇల్లు అతనికి రాజకీయ వ్యవస్థ సమకూర్చాలి. ఇంతేకాకుండా అతడు మానవత్వాన్ని మరచిపోకుండా ఉంటానికి తగిన చదువును కూడా అతని రాజకీయ వ్యవస్థే ఇవ్వగలిగి ఉండాలి. అతనిని ఇతరులెవరైనా అన్యాయంగానూ దౌర్జన్యంగానూ బాధిస్తూఉంటే, అతనిని రక్షించే బాధ్యతకూడా అతని రాజ్యాంగ వ్యవస్థదే. అంటే అతనిని అన్నివిధాలా సుఖపెట్టడానికే అతని రాజకీయ వ్యవస్థ యొక్క ముఖ్యలక్ష్యంగా ఉండాలి.

ప్రతి పౌరుని సాంఘిక పరిస్థితి పాక్షికంగానూ, నైతిక పరిస్థితి పూర్తిగానూ అతని మత వ్యవస్థ పరిస్థితిపై ఆధారపడి ఉంటాయి. అంటే అతనికి సంఘంలో 10 మందిలో అందరితోపాటు గౌరవ మర్యాదలుండేటట్లు, సంఘంలో అతనికి ఏవిధమైన అవమానము 'జరగకుండా చూసే' బాధ్యత అతని మత వ్యవస్థదే.

అతడు నీతివంతుడుగానూ, పరోపకారబుద్ధిగలవాడుగానూ, మానవసేవా తత్పరుడుగానూ ఉండేలాగున తగిన నీతిబోధనను, శిక్షణను అతనికి అతని మతవ్యవస్థ అందించాలి. సర్వప్రపంచమానవులు–వారు ఏ మతస్థులుగానీ –తమ కులస్థులుగానీ అందరూ సమానులే; అందరి సుఖమే తన సుఖమని యెంచి అతని చేత ఆచరణలో పెట్టించేయత్నం అతని మత వ్యవస్థదే.

కనుక మానవుడు ఆరోగ్యకరమైన, నిజమైన మానవుడుగా బతుకుతూ తోటి మానవుల కష్ట–సుఖాలలో పాలుపంచుకొనే సద్భావంగలవాడవ్వాలంటే అతని రాజకీయ, మత వ్యవస్థలు మంచివిగా ఉండాలి. అంటే అతని రాజకీయ, మత క్షేత్రాలలో పనిచేసే వ్యక్తులయొక్క వ్యక్తిగత, సాంఘిక, నైతిక జీవిత పరిస్థితులు మంచివిగా ఉండాలి. ఎందుకనగా ప్రతిమానవుని జీవిత పరిస్థితులు కూడా అతని రాజకీయ మత వ్యవస్థలునడిపే వారి జీవిత పరిస్థితుల మీద ఆధారపడి ఉంటాయి.

ఇక ఇప్పుడు మనం మొదటగా మనదేశ రాజ్యాంగాధిపతుల జీవిత పరిస్థితులను పరిశీలిద్దాం. నేడు మనదేశాన్ని పరిపాలిస్తున్న రాజకీయ అధికారులు పూర్తిగా మత ప్రచారకులైన జ్యోతిష్కులు, సిద్ధాంతులు, మఠాధిపతులు, పీఠాధిపతులు,బాబాలు, దేవతా విగ్రహారాధకులు మొదలగువారి మీద ఎనలేని భక్తి విశ్వాసాలు కలిగిఉంటూ వారు చెప్పినట్లు నడుచుకొనుచున్నారు. నిజానికి నేడు మనదేశాన్ని పాలించేది మతమేనని చెప్పవచ్చును.

మన రాజ్యాధినేతలు ఎన్నికలలో ధనరాసుల్ని వెదజల్లి ప్రజల ఓట్లను కొని గెలిచి పదవులను సంపాదించుకొన్న తరువాత తాము జ్యోతిష్కుల, దేవతా విగ్రహాల పూజల వల్లనే ఎన్నికలలో గెలిచామని భావించి ధనానికి దాసులై అనేక అవినీతి పనులు చేసి ధనరాసులను ఆర్జించి కోట్లకు పడగలెత్తుతూ స్విస్ బ్యాంకులలో దాచుకొనుచున్నారు. అంతేకాని ప్రజల ఓట్లవల్లనే తమకు జయంకలిగిందనే పరమ సత్యాన్ని పూర్తిగా మరచిపోయి ప్రజలవైపు కన్నెత్తి కూడా చూడటానికి తీరికలేనంత ధనార్జనలో నిమగ్నమైపోతున్నారు. ధనార్జన కొరకు వారు ఎంతటి అవినీతికరమైన పనినైనా చేయడానికి వెనుకాడుట లేదు. అందువల్ల రాజ్యాంగ విధానం స్వార్థానికి, అవినీతికి, లంచగొండితనానికి, అరాచకానికి, హింసకు కేంద్రమై పోయింది. అందువల్ల సామాన్య ప్రజానీకం ఆర్థికంగా అనేక ఇబ్బందులకు గురి కావలసి వస్తుంది. సామాన్య నిత్య జీవితావసర వస్తువుల ధరలు చుక్కలనంటుచున్నందున సామాన్య ప్రజలలో నూటికి 60 మందికి పైగా కడుపునిండా కూడులేక, వంటినిండా గుడ్డలేక తలదాచుకోటానికి గూడులేక అనేక ఇబ్బందులకు లోనై వారు జీవచ్ఛవాల్లాగా బ్రతకవలసి వస్తోంది. ఆ రోజుకారోజు బీదలు ఇంకా బీదలుగానూ ధనవంతులు ఇంకా ధనవంతులుగానూ అయిపోతున్నారు.

ఇటు వ్యాపారస్తులు, ఉద్యోగస్తులు, డాక్టర్లు, ప్లీడర్లు మొదలగు మేధావులు, మఠాధిపతులు, పీఠాధిపతులు, బాబాలు మొదలగువారు కూడా ధనానికి దాసులై ధనార్జనకై అనేక అవినీతి పద్ధతులను అవలంబించడానికి వెనుకాడుట లేదు. వారిలో బీదలను ఆదుకోవాలనే సద్భావమే కరువైపోయింది.

ఇక ఇప్పుడు మనం మత వ్యవస్థను కూడా పరిశీలిద్దాం. నేడు మనదేశంలో మతవ్యవస్థ– హిందూమత వ్యవస్థ–మఠాధిపతుల, పీఠాధిపతుల, జ్యోతిష్కుల, సిద్ధాంతుల, వేదపండితుల, పురోహితుల, పూజారుల, బాబాల, యోగుల, అమ్మలచేతులలో కీలక బొమ్మగా ఉంటున్నది. నేటి ధనయుగ ప్రభావం ఈ మత ప్రచారకుల మీద పడక మానలేదు. నేటి మఠాధిపతులు, పీఠాధిపతులు, బాబాలు, అమ్మలు, యోగులు అనేవారు కోట్ల రూపాయలకు పడగలెత్తుచూ ధనార్జనలో రాజకీయ నాయకులకు, వ్యాపారస్తులకు, ఉద్యోగస్తులకు ఏమాత్రం తీసిపోవడం లేదు. నేడు మత ప్రచారకులనబడే పీఠాధిపతులు, బాబాలు మొదలగువారు అనేక అవినీతి కార్యాలయాల ద్వారా ధనాన్ని సంపాదించుకొంటున్నారు. ఇటువంటి అవినీతిపరులయిన మత ప్రచారకుల మూలాన మతవ్యవస్థ పూర్తిగా కుళ్ళిపోయింది. అందువల్ల సామాన్య ప్రజల నైతికస్థాయి కూడా చితికి పోయింది. ప్రజలలోకూడా నీతి నిజాయితీలు గర్భదారిద్ర్యం వల్లగాని ధనికుల ఆర్థికదోపిడీ వల్లగాని మేధావుల బౌద్ధికదోపిడీ వల్లగాని కరువైపోయాయి.

అటు రాజకీయ నాయకులు, ఇటు మత ప్రచారకులు డబ్బుకు దాసులై నీతి నిజాయితీలను నిలువులోతు గుంటలో పాతిపెట్టి ధనార్జనకై దిశదిశలు దౌడులు తీస్తూ ఉంటే, ఎన్నోతరాల నుండి చదువు సంధ్యలు, భోగభాగ్యాలు, సాంఘిక వనరులు వగైరాలకు కరువాసిపోయిన సామాన్య ప్రజలు నీతి నిజాయితీలతో ఉండాలనటం పచ్చిమోసంకాదా?

రాజకీయ నాయకులు, మతప్రచారకులు ఏకమై సామాన్య ప్రజానీకాన్ని పుణ్యము, మోక్షము, దైవము, యజ్ఞము అనే మోసపు మాటలను చెప్పి వారి కష్టార్జితాన్ని నిలువునా దోపిడీ చేస్తూ వారిని కొన్ని తరాల వరకు ఆర్థికంగానూ, బౌద్ధికంగానూ, పతితులనుగా ఉంచటానికి నిరంతరం కుట్ర పన్నుతున్నారు. ఈ రకంగా సామాన్య ప్రజలు ఆర్థికంగానూ, బౌద్ధికంగానూ, ధనవంతులకు, మతప్రచారకులకు దాసులైపోతూ నికృష్టజీవితాలను గడుపుతున్నారు.

కనుక సామాన్యప్రజలు ధనవంతుల, మతప్రచారకుల దాస్యాలనుండి బయటపడజాలనంత వరకు వారి ఆర్థిక, బౌద్ధిక పరిస్థితులు బాగుపడుట కల్ల. అందులో ఆర్థికదాస్యం కంటే బౌద్ధిక దాస్యం (భావదాస్యం)మరీ భయంకరమైనది. ఆర్థిక దాస్యానికి పునాది భావదాస్యమే. ఈ భావదాస్యంనుండి సామాన్య ప్రజలు స్వతంత్రులైన నాడు ఆర్థిక దాస్యంనుండి అతితేలికగా బయటపడగలుగుతారు. భావదాస్యానికి మూలము, పుణ్యము, స్వర్గము, మోక్షము, దైవము మొదలైన మూఢనమ్మకాలు, మూఢాచారాలే. కనుక సామాన్య ప్రజలు ముందుగా మూఢాచారాలను, మూఢనమ్మకాలను విడనాడిన యెడల భావదాస్యం పతనమైపోతుంది. దానితోపాటు ఆర్థికదాస్యం కూడా అంతర్ధానమై పోతుంది.

అయితే ప్రజలలోని మూఢనమ్మకాలు, మూఢాచారాలు పోవాలంటే మత ప్రసక్తిలేని నిస్వార్థ

రాజ్యాంగ వ్యవస్థ ఉండాలి. మత ప్రసక్తిలేని రాజ్యాంగమే మూఢాచారాలను, మూఢనమ్మకాలను అరికట్టగలదు. కనుక మత ప్రసక్తిలేని నిస్వార్థపరులైన ప్రజాప్రతినిధులే నిజమైన ప్రజోపకరమైన రాజ్యాంగ వ్యవస్థను స్థాపింపగలరు. కనుక సామాన్య ప్రజలు తమ ఓట్ల ద్వారా మత ప్రసక్తిలేని నిస్స్వార్థపరులైన ప్రతినిధులనే ఎన్నుకోవాలి. అటువంటి ప్రజా ప్రతినిధులే మత ప్రసక్తిలేని రాజ్యాంగవ్యవస్థను స్థాపించి ప్రజలలోగల మూఢనమ్మకాలను, మూఢాచారాలను నిర్మూలింపజేసి దేశంలో సుఖ-శాంతులను నెలకొల్పగలరు.అంటే సామాన్య ప్రజల ఆర్థిక, బౌద్ధిక దాస్యాలను నిర్మూలింపజేసి వారిని ఆర్థికంగానూ, బౌద్ధికంగానూ బాగుపరచగలరు.

✦✦✦

# నా తుది సందేశము

1. నేడు ఈ పచ్చిస్వార్థ ప్రపంచంలో డబ్బుకున్న విలువలు, గౌరవ మర్యాదలు నీతి-నిజాయితీలకు లేవు.
2. ఈ స్వార్థమయ ప్రపంచంలో నేడు అక్రమ ధనార్జన మగతనానికి మారుపేరు.
3. నేడు ఈ పచ్చిస్వార్థపూరిత ప్రపంచానికి అబద్ధము, మోసములు, ఉచ్ఛ్వాస, నిశ్వాసములుగా తయారైనాయి.
4. ఈ ఆధునిక నాగరిక ప్రపంచంలో దీర్ఘకాలిక ముసలితనము, అనేక ఆపదలు, అనాధత్వమూ. అనాదరణ, అవమానము, అసూయలకు నిలయము.
5. నిజానికి దీర్ఘకాలిక ముసలితనము నికృష్ట జీవితానికి ఆలయము.

**12-12-1996 యలమంచిలి వెంకటప్పయ్య (98-11-12 వయస్సు)**

# యలమంచిలి వెంకటప్పయ్య సంస్మరణ వేదిక

స్వాతంత్ర్య సమరయోధుడు, హిందీ ప్రచారకుడు, హేతువాది, పలు హేతువాద గ్రంధాల రచయిత ఐన యలమంచిలి వెంకటప్పయ్యగారి ఆశయాలకనుగుణమైన కార్యక్రమాలను ప్రతిఏటా వారి వర్థంతి సందర్భంగా నిర్వహించడానికి ఏర్పడిన వేదిక ఇది.

ఈ వేదిక నిరంతరం కార్యక్రమ నిర్వహణకై ఇరవై ఐదువేల రూపాయల భూరివిరాళం డిపాజిట్ చేసినవారు ఐతానగరంకు చెందిన ఈదర శివరామకృష్ణప్రసాద్ (సురేష్). దాతలు ఈ వేదికకై ఇచ్చే విరాళాలు మూల నిధికి జమ అవుతూ ఉంటాయి. వేయి రూపాయలు, ఆపైన విరాళాలు ఇచ్చేవారిని వేదిక సభ్యులుగా స్వీకరిస్తారు.

ఈ క్రింది కార్యక్రమాలను వేదిక నిర్వహిస్తుంది.

- వెంకటప్పయ్యగారి వర్థంతిని జరుపుట. సమకాలీన సాహిత్య సామాజికాంశాలపై ప్రసంగాలు, గోష్టులు, సదస్సులు ఏర్పాటుచేయుట, అవార్డులు ఇచ్చుట.
- వెంకటప్పయ్య గారు రాసిన పుస్తకాల ప్రచురణగానీ, వారి ఆశయాలకనుగుణమైన పుస్తకాలను గానీ ప్రచురించడం.

**చిరునామా :**


**మురళీధర్, యలమంచిలి**

**403, అరుణ నివాస్,**

**డాన్ బాస్కో స్కూలు ఎదురురోడ్డు**

**గురునానక్‌నగర్, విజయవాడ–520007**

**సంచారవాణి: 94403 27500**

# కాకినాడలో 1923లో జరిగిన అఖిలభారత జాతీయ కాంగ్రెస్ వార్షిక మహాసభలో జరిగిన ఒక సాంఘిక సంస్కరణ గురించి

**- యలమంచిలి వెంకటప్పయ్య**

నేను ఒక వాలంటీర్ దళమునకు నాయకుడను. మా దళం వంటశాల వద్దగల పనులలో సహాయము చేయుచుండెడిది. వంట చేయుటకు 60-70 మంది బ్రాహ్మణులుండిరి. సభకు వచ్చినవారికి భోజనము చేయుటకై ఒక పెద్దపాక నిర్మించబడింది. ఒకేసారి 5,000 మందికి పైగా జనం కూర్చొని భోజనం చేయునంత పెద్దహాలు ఉండేది. మొదటిరోజు ఉదయమున వంట బ్రాహ్మణులు వంటను ప్రారంభించి హాలులో వేరుగా బ్రాహ్మణులు ఒక వందమందికి పైగా భోజనం చేయడానికి ప్రత్యేకించి ఒక గదిని తాటాకు చాపలతో కట్టసాగిరి. అచ్చట వాకిలిలో ఉన్న బ్రాహ్మణేతర వాలంటీర్లు అలా కట్టడానికి వీలులేదని అడ్డగించగా, వంట బ్రాహ్మణులు వినకుండా కట్టసాగిరి. బ్రాహ్మణేతర వాలంటీర్లు హాలునే తగులబెట్టెదమని బెదరించి నావద్దకు వచ్చారు. విషయం తెలుసుకొని నేను వెంటనే పట్టాభిగారి వద్దకువెళ్ళి విషయం తెలిపాను. పట్టాభిగారు వెంటనే సన్మానసంఘ సభ్యులను సమావేశపరచినారు. సన్మాన సంఘ సమావేశానికి అధ్యక్షత వహించిన కొండా వెంకటప్పయ్యగారు ముందుగా నన్ను మాట్లాడమనిరి. నేను విషయమును తెలుపుతూ ప్రత్యేకించి బ్రాహ్మణులకు వేరుగా ఒక గదిని కట్టడానికి వీలులేదనే తీర్మానాన్ని ప్రవేశపెట్టాను. వెంటనే కొండా వెంకటప్పయ్యగారు కండ్లు ఎర్రచేసుకొని లేచి, నీవూ, నేను భ్రష్టులమైతే అయ్యాము గాని ఎంతోమంది శ్రోత్రియ బ్రాహ్మణులుగలరు. వారికి ప్రత్యేక స్థలము ఏర్పాటు చేయించాలని తీర్మానానికి వ్యతిరేకంగా మాట్లాడినారు. నేను వారి తీర్మానాన్ని ఖండించడానికి మొదలుపెట్టగా చెరుకువాది నరసింహం పంతులుగారు నన్ను చౌదరీ అని సంబోధిస్తూ, 'చౌదరీ నీవు కూర్చో, నేను నీ తీర్మానం గురించి చివరన మాట్లాడతాను' అని నన్ను కూర్చోబెట్టిరి. తరువాత పట్టాభి వగైరాలు తీర్మానానికి అనుకూలంగా తమ అభిప్రాయాలు తెలిపి తీర్మానాన్ని పాసు చేయించారు.

ఈ లోపుగా బ్రాహ్మణులైన వంటవారు దడులను కట్టసాగిరి. ఇతర బ్రాహ్మణేతర వాలంటీర్లు నావద్దకు పరిగెత్తుకొని వచ్చి వంట బ్రాహ్మణులు మరల దడులు కట్టుచున్నారని చెప్పిరి. వెంటనే నేను, పట్టాభిగారు, కాకినాడ ప్రాంతంలో ప్రసిద్ధిచెందిన కాంగ్రెస్ నాయకుడు

మందపాక రంగయ్యనాయుడుగారు, నరసింహంగారు వగైరాలు వంటశాల వద్దకువెళ్ళి తీర్మానం గురించి చెప్పగా వంట బ్రాహ్మణులు కోపం చెంది తమ వంట పాత్రలను తీసుకొని వెళ్ళిపోవుటకు తయారైరి. ఇంతలో పట్టాభిగారు వారలను ఒకవైపుకు దూరంగా తీసికొనిపోయి ఏమి చెప్పారో మాకు తెలియదు. వంట బ్రాహ్మణులు వంట చేయుటకు సన్నహించి వంటశాలలో ప్రవేశించారు. ఈ లోపుగా రంగయ్యనాయుడుగారు, వందమంది వంటవాళు ళ్ళ నావద్ద ఉన్నారు. వారంతా ఉచితంగా వంట చేయడానికి రెండురోజుల వరకు సిద్ధంగా ఉన్నారు. అని చెప్పగా పట్టాభిగారు 'అవసరంలేదు బ్రాహ్మణులే వంట చేయుటకు ఒప్పుకొనినార'ని చెప్పినారు.

కనుక కులవిచక్షణ లేకుండా అన్ని కులములవారు ఒక చోట కూర్చోని తిండి తినుటకు ఏర్పాటు చేశారు. ఇష్టంలేనివారు బయట హొటళ్ళలో తినవచ్చునని రంగయ్యనాయుడుగారు గట్టిగా నిలబడి వక్కాణించారు. ఆనాటి కాంగ్రెస్‌వారు కులరక్కసి రెక్కలను విరగగొట్టగా, నేటి కాంగ్రెస్ నాయకులు కులరక్కసిని పోషించి పెంచుతూ దాని ఆధారంతో తమ పరువును, జాగ్రత్త పరుచుకొని, సమాజంలో కులమతాలను రెచ్చగొట్టుచూ, అక్రమ ధనార్జన చేస్తూ, దేశ విదేశీ బ్యాంకులలో వేలాది కోట్ల రూపాయలను దాచుకొనుచూ కులుకుతున్నారు. దేశంలో చాలామంది బీదవారికి చాలినంత తిండి, బట్ట నీడ లేక అల్లాడిపోతున్నారు. కాని నేటి మన రాజకీయ నాయకులలో మతతత్త్వం కలవారు, పదవీకాంక్షగలవారు ఎక్కువయ్యారు. వారి హృదయాలు బీద ప్రజలగోడువిని ఎలా ద్రవించకున్నాయి? మన నల్లదొరల అవినీతి పరిపాలనా విధానంవలన దేశంలో కనీవినీ ఎరుగని అరాచకత్వం తాండవిస్తోంది. అందువలన సామాన్య ప్రజలు తమ స్వల్ప ఆస్తులను, ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని దిన దిన గండంగా తమ జీవితాలను గడుపుకొంటున్నారు.

# వెంకటప్పయ్యగారు రాసిన పుస్తకాల జాబితా

1. బాపూజీ జీవిత పరిశీలన
2. వేదాలంటే ఇవేనా?
3. ఋగ్వేదం ఆర్యులు అనార్యులను ఊచకోత కోసిన శోక కత కాదా?
4. పనికిమాలిన వేదాల గుట్టు రట్టు చేయుట
5. కొంతమంది త్రాగుబోతుల ప్రేలాపాలైన వేదాలు జ్ఞాన–విజ్ఞాన భండారాలా?
6. దేవుళ్ళు ఎవరి కొరకు?
7. తులసీరామాయణం అంటే ఇదేనా?
8. కులమేది?
9. పెండ్లెందుకు?
10. శ్రాద్ధకర్మ (దినము) ఎవరి కొరకు?
11. పుష్కరాలు ఎవరి కొరకు?
12. బీదబ్రతుకు (స్వీయచరిత్ర)
13. ఈ స్వరాజ్యం కోసమేనా జనం త్యాగాలు చేసింది?
14. లగ్గాల పెండిండ్ల బండారము
15. ఇందుకేనా స్వరాజ్యం?
16. యువతా! మేల్కొనవా?
17. మన నల్లదొరల నలుబడి నాలుగు ఏండ్ల పరిపాలన ఇదేనా?
18. ఆడవాళ్ళను ఆదుకోరా?
19. విగ్రహారాధన వేద విరుద్ధం కాదా?
20. మంగళసూత్రం పవిత్రమైనదా?
21. మతాలు ఎవరి కొరకు?
22. మొక్కల పెంపకము
23. బీద ఓటర్లకు మేలుకొలుపు
24. ప్రపంచ పుట్టుపూర్వోత్తరాలు
25. స్వతంత్ర్య భారతదేశంలో బీదల బ్రతుకులింతేనా?
26. తిరుపతి వెంకన్న తిండి తినుట, రోగాలు పోగొట్టుట నిజమేనా?

27. కన్యలు కరువైపోయే కాలం కన్పెట్టుకుని కూర్చున్నది
28. వేమన్న ఏమన్నాడు?
29. దేశం ఏమైపోయేటట్టు?
30. మనదేశం బాగుపడేదెలా?
31. పేదరికం కల్గడానికి కారణాలేమిటి?
32. నేటి ఆస్తికులలో ఎక్కువమంది చేతలలో నాస్తికులేనా!
33. చదువదగిన చిరుపొత్తము
34. ఇందుకేనా మగరాయుళ్ళు బ్రతికేది?
35. నేడు మనదేశం ఎటు పయనిస్తున్నది? ఉన్నత శిఖరం వైపుకా? అవినీతి అగాధం వైపుకా?
36. నేడు మనదేశంలోగల అరాచకానికి అసలు కారకులెవరు?
38. నేడు జగమంతా స్వార్థమయం
39. వినాశ కాలే, విపరీత బుద్ధి : పోయేకాలం వచ్చే ఇటువంటి పాడు బుద్ధులు పుట్టడం
40. ఆత్మను తెలుసుకోవాలంటే!
41. గాంధీ మహాత్ముని మహావాక్యాలు
42. సామాన్య జనం తెలుసుకోవలసిన చేదునిజాలు
43. హిందీ-తెలుగు-ఇంగ్లీషు వ్యాకరణము 1వ భాగం
44. హిందీ-తెలుగు-ఇంగ్లీషు వ్యాకరణము 2వ భాగం
45. హిందీ-తెలుగు-ఇంగ్లీషు వ్యాకరణము 3వ భాగం
46. హిందీ-తెలుగు-ఇంగ్లీషు వ్యాకరణము 4వ భాగం
47. సరళ హిందీ-తెలుగు వ్యాకరణము
48. నేడు మనముంటున్నది నాగరిక ప్రపంచమేనా?
49. పెద్దలేమన్నారు? 1వ భాగం
50. పెద్దలేమన్నారు? 2వ భాగం
51. పెద్దలేమన్నారు? 3వ భాగం
52. వైదిక ఆర్యుల ప్రాచీన సంస్కృతి
53. ముంచుకొస్తున్న ముప్పు

# యలమంచిలి వెంకటప్పయ్య సంస్మరణ వేదిక సభ్యుల జాబితా

| క్ర.సం. | చేరిన తేదీ | పేరు | |
|---|---|---|---|
| 1. | 1-3-1999 | ఈదర శివరామకృష్ణప్రసాద్, తెనాలి | 25,000 |
| 2. | 1-3-1999 | యలమంచిలి మురళీధర్, విజయవాడ | 1,000 |
| 3. | 1-3-1999 | కొత్తపల్లి రవిబాబు, విజయవాడ | 1,000 |
| 4. | 1-3-1999 | డా॥ వెలగా వెంకటప్పయ్య, తెనాలి | 1,000 |
| 5. | 1-3-1999 | కన్నెగంటి సుబ్బారావు, తెనాలి | 1,000 |
| 6. | 1-3-1999 | జె.ఎస్.ఆర్.కృష్ణయ్య, తెనాలి | 1,000 |
| 7. | 1-3-1999 | పందరబోయిన సాంబశివరావు, హైదరాబాద్ | 1,000 |
| 8. | 1-3-1999 | వెలగా రామకోటేశ్వరరావు, యడ్లపల్లి | 1,000 |
| 9. | 1-3-1999 | కడియాల పిచ్చయ్య, కఠెవరం | 1,000 |
| 10. | 1-3-1999 | కడియాల సత్యనారాయణరావు, తెనాలి | 1,000 |
| 11. | 1-3-1999 | ముత్తేవి మాధవాచార్య, తెనాలి | 1,000 |
| 12. | 1-3-1999 | తుమ్మల కృష్ణాబాయి, విశాఖపట్నం | 1,000 |
| 13 | .1-3-1999 | వి. శివరామయ్య, ఏలూరు | 1,000 |
| 14 | .1-3-1999 | ముత్తేవి రవీంద్రనాధ్, తెనాలి | 1,000 |
| 15. | 1-3-1999 | పరుచూరు భగవంతరావు, తెనాలి | 1,000 |
| 16. | 1-3-1999 | పరుచూరు వెంకమాంబ, తెనాలి | 1,000 |
| 17. | 1-3-1999 | కొత్తపల్లి శశిబాబు, చీరాల | 1,000 |
| 18. | 1-3-1999 | జి. కుటుంబరావు, గుడ్లవల్లేరు | 1,000 |
| 19. | 30-5-1999 | కన్నెగంటి సీతారామయ్య, తెనాలి | 1,000 |
| 20. | 4-7-1999 | ఎస్. జయరామిరెడ్డి, అనంతపురం | 1,000 |
| 21. | 7-5-2000 | పాటిబండ్ల కోటేశ్వరమ్మ, తెనాలి | 1,000 |
| 22. | 7-8-2000 | చుండూరు వెంకటేశ్వర్లు, చీరాల | 1,000 |
| 23. | 5-5-2004 | పి. సాంబశివరావు, అమెరికా | 10,000 |
| 24. | 12-3-2005 | చుక్కపల్లి పిచ్చయ్య, విజయవాడ | 2,500 |
| 25. | 12-3-2005 | యలమంచిలి వేంకటేశ్వరరావు, ఎనికేపాడు | 1,000 |
| 26. | 1-2-2008 | యలమంచిలి నాగేశ్వరరావు, విజయవాడ | 1,000 |
| 27. | 1-4-2009 | యాళ్ళ సూర్యనారాయణ-పార్వతీపురం | 1,000 |
| 28. | 12-5-2009 | వకుళాభరణం రామకృష్ణ-హైదరాబాదు | 1,000 |
| 29. | 14-6-2009 | యస్.వి.నరసయ్య, బెంగళూరు | 5,000 |
| 30. | 10-7-2009 | మక్కపాటి వెంకటరత్నం, బ్రాహ్మణకోడూరు | 1,000 |
| 31. | 10-2-2010 | దివికుమార్, విజయవాడ | 1,000 |
| 32. | 5-6-2010 | యలమంచిలి బాలకృష్ణ, హైదరాబాద్ | 6,000 |
| 33. | 7-8-2010 | యలమంచిలి నరశింహారావు, బుద్ధవరం | 1,000 |
| 34. | 12-3-2011 | యలమంచిలి శ్రీధర్, గుంటూరు | 1,000 |
| 35. | 14-4-2011 | తుమ్మా భాస్కర్, కోదాడ | 2,000 |
| 36. | 15-4-2011 | వాసిరెడ్డి భాస్కరరావు, హనుమకొండ | 1,000 |
| 37. | 11-12-2011 | అట్లూరి ప్రేమకుమారి | 1,116 |

# సంస్మరణ వేదిక నిర్వహించిన వెంకటప్పయ్యగారి వర్ధంతి సభల వివరాలు

| | | |
|---|---|---|
| **1-3-1999**<br>రెండవ వర్ధంతి సభ | తెనాలి | ముత్తేవి మాధవాచార్యులు<br>డా॥ తుమ్మల వేణుగోపాలరావు<br>దివికుమార్ |
| **5-3-2000**<br>మూడవ వర్ధంతి సభ | తెనాలి | వట్టికూటి వెంకటసుబ్బయ్య<br>వావిలాల గోపాలకృష్ణయ్య<br>ముత్తేవి రవీంద్రనాథ్ |
| **4-3-2001**<br>నాల్గవ వర్ధంతి సభ | విజయవాడ | ఏలూరి ప్రసాదరావు<br>ప్రొ॥కొడాలి శ్రీనివాస్ |
| **9-3-2002**<br>ఐదవ వర్ధంతి సభ | చీరాల | ఆచార్య వకుళాభరణం రామకృష్ణ<br>కుర్రా హనుమంతరావు<br>రావిపూడి వెంకటాద్రి |
| **9-3-2003**<br>ఆరవ వర్ధంతి సభ | తెనాలి | డా॥ బీరం సుందరరావు<br>డా॥ నన్నపనేని అంజయ్య |
| **2-3-2004**<br>ఏడవ వర్ధంతి సభ | విజయవాడ | డా॥ గోపాళం శివన్నారాయణ<br>దివికుమార్ |
| **12-3-2005**<br>ఎనిమిదో వర్ధంతి సభ | విజయవాడ | చలసాని రాధాకృష్ణదాస్<br>డా॥ యలమంచిలి శివాజీ |
| **19-3-2006**<br>తొమ్మిదో వర్ధంతి సభ | తెనాలి | డా॥ బీరం సుందరరావు |
| **2007** | | నిర్వహించలేదు |
| **2-3-2008**<br>పదకొండో వర్ధంతి సభ | విజయవాడ | డా॥ సి.నరసింహారావు<br>డా॥ బీరం సుందరరావు |
| **8-3-2009**<br>పన్నెండో వర్ధంతి సభ | తెనాలి | ఈడ్పుగంటి నాగేశ్వరరావు<br>ముత్తేవి రవీంద్రనాథ్ |
| **21-3-2010**<br>పదమూడవ వర్ధంతి సభ | విజయవాడ | రావెల సాంబశివరావు<br>డా॥ తాటి శ్రీకృష్ణ |
| **6-3-2011**<br>పధ్నాల్గవ వర్ధంతి | గుంటూరు | బాబు గోగినేని |

## వెంకటప్పయ్య నేత్రాలతో ఇద్దరికి చూపు

**విజయవాడ, మార్చి 5 (న్యూస్ టుడే) :** స్వాతంత్ర్య సమరయోధుడు యలమంచిలి వెంకటప్పయ్య నేత్రాలను కార్నియో గ్రాఫ్టింగ్ ద్వారా అమర్చి ఇరువురు అంధులకు చూపు ప్రసాదించారు. వెంకటప్పయ్య ఇటీవల మృతిచెందిన విషయం విదితమే. స్థానిక అరవింద కంటి ఆస్పత్రిలో జరిగిన ఆపరేషన్ ద్వారా ఆగిరిపల్లికి చెందిన ఎం. నాగేశ్వరరావు (28), నందిగామకు చెందిన నాగరాజ్యం (35) లకు అమర్చినట్లు అరవింద 'ఐ' బ్యాంక్ కార్యదర్శి డాక్టర్ వెలగపూడి సాంబశివరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీరిరువురికి దృష్టి ప్రసాదించిన వెంకటప్పయ్య కుటుంబ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 9వ తేదీన స్థానిక మధుకళామండపంలో వెంకటప్పయ్య సంస్మరణ సభను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

**– ఈనాడు, 6-3-1997**

## యలమంచిలి కళ్ళతో ఇద్దరికి చూపు

**విజయవాడ, మార్చి 5 (ప్రభాత వార్త) :** యలమంచిలి వెంకటప్పయ్య నేత్రాలను ఆగిరిపల్లికి చెందిన ఎం.నాగేశ్వరరావు, నందిగామకు చెందిన నాగరాజ్యంలకు అమర్చినట్లు అరవింద కంటి ఆస్పత్రికి చెందిన డాక్టర్ వి. సాంబశివరావు తెలిపారు. తమకు దృష్టిని ప్రసాదించినందుకు వెంకటప్పయ్య కుటుంబ సభ్యులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. తొమ్మిదవ తేదీ ఉదయం పది గంటలకు మధుకళామండపంలో యలమంచిలి సంస్మరణ సభ జరుగుతుందని తెలిపారు.

**– వార్త, 6-3-1997**

"గాంధీయొక్క త్యాగము, దేశభక్తి, సమదృష్టి, బీద జనాదరణ, నిర్భయత్వము, ఓర్పు, పట్టుదల, సత్యనిష్ట, అహింసావ్రతము అద్వితీయాలు. పోతే, దేవుడు మతము, కులము, కులవృత్తులు మొదలగువాటి గురించి బాపూజీ అభిప్రాయాలతోనే నేను పూర్తిగా ఏకీభవింపజాలక పోతున్నానని చెప్పటానికి విచారపడుతున్నాను. కాని బాపూజీ సత్య, అహింసలు, అంటరానితన నిర్మూలనతో మాత్రం నేను పూర్తిగా ఏకీభవిస్తున్నాను."

(వెంకటప్పయ్యగారి రచన "బాపూజీ జీవిత పరిశీలన" గ్రంథం నుంచి పేజీ 291.)

# నమ్మలేని నిజాలు

1912లో తెల్ల కాగితాలు దస్తా -1 1/2 అణాలు (9 పైసలు)

1912లో పెద్దవాళ్ళకు హాఫ్ ఆరమ్ చొక్కా ఖరీదు 7 అణాలు (42 పైసలు)

1914లో పెన్సలు కానీ (1 1/2 పైసలు)

1916లో మగ కూలి వానికి రోజుకు 2 అణాలు గాని తవ్వెడు ధాన్యంగాని ఇచ్చేవారు (12 పైసలే లేక 3/4 కే.జి. ధాన్యం)

1917లో ఆఫీసులో బంట్రోతుకు నెలకు 6 రూపాయలు, గుమస్తాకు 20 రూపాయలు మంచి జీతాలు.

1918లో విజయవాడలో మిలటరీ హెూటల్‌లో పూటకు 2 అణాలు. (12 పైసలు) నెలకు 6 రూపాయలు.

1923లో అలహాబాద్ పట్టణంలో హెూటల్‌లో పూటకు 2 1/2 అణాలు (15 పైసలు) నెలకు 7 రూపాయలు.

1925లో నవర్సు వెల 12 రూపాయలు, 2 యేండ్ల ఒంగోలు జత కోడె దూడ ఖరీదు 90 రూపాయలు. ఆవు పూటకు 2 శేర్లు పాలు ఇచ్చేది 20 రూపాయలలో వచ్చేది.

1929లో వడ్ల బస్తా 5 రూపాయలు, బియ్యపు బస్తా 11 రూపాయలు, తవుడు బస్తా 2 రూపాయలు.

1933లో వడ్లబస్తా 2 1/2 రూపాయలు, బియ్యపు బస్తా 6 రూపాయలు, తవుడు బస్తా 1 1/2 రూపాయలు, బాగా పండే మాగాణి ఎకరం 400 రూపాయలు.

1935లో నార్ల వెంకటేశ్వరరావుగారి పాత్రికేయ జీవితం నెలకు 35 రూపాయలతో ఆరంభమైంది.

1936లో కాశీలో ముగ్గురుగల కుటుంబానికి నెలకు 10 రూపాయలు బాగా సరిపోయేవి.

1938లో తెనాలిలో ముగ్గురుగల కుటుంబానికి నెలకు 24 రూపాయలు బాగా సరిపోయేవి.

1939లో పూటకు 3 శేర్లు (4 లీటర్లు) పాలు యిచ్చే ఆవు ఖరీదు 22 రూపాయలు. నేయి వీశె 1 1/2 రూపాయలు (కేజీ 1 రూపాయి)

1940లో కొత్త చిన్నకారు ఖరీదు 4 వేల రూపాయలు, సెకండు హాండుది 400 రూపాయలు మాత్రమే.

1942లో బారాటి వాసపు బొంగులు వంద 15 రూపాయలు. కొబ్బరి త్రాడు వీశె 5 అణాలు (కిలో 24 పైసలు) బెల్లం, చింతపండు, ఎండు మిర్చి వీశె 2 1/2 అణాలు (కేజీ 15 పైసలు) కొబ్బరి కాయ 1/2 అణా (3 పైసలు) మేదర తడిక గజంకి 3 అణాలు (మీటరు 18 పైసలు)


KNOWLEDGE IS POWER
A BOOK IS A BEST FRIEND




మదికుదరచేసి చల్లని మాట


సంస్మరణ వేదిక-తెనాలి.



యలమంచిలి వెంకటప్పయ్య
సంస్మరణ వేదిక-తెనాలి.






యలమంచిలి వెంకటప్పయ్య
సంస్మరణవేదిక




632

